SREE

RANGARAYAKADANA

For REFERENCE ONLY

SAMAVAKARAM.

An Historical and Original Telugu Drama in three Acts

BY

KALLAKURY SAMBASIVA ROW F.A.,

Teacher, Pittapur Rajah's College, Cocanada.

శ్రీకృష్ణ దేవరాయాంధ్ర భాషానిలయము
సుల్తాన్‌బజార్, హైదరాబాద్. 1.

FIRST EDITION 1000 COPIES.

COCANADA.

Printed at the SUJANARANJANI PRESS, by the Proprietor, P. Brahmananda Row, and published by the Author.

1899.

Copy-Right.

PRICE 6 ANNAS.

రంగారాయకదన సమవాకారము.

ఇది

కాకినాడ పిఠాపురంరాజాగారి కాలేజీలో నుపాధ్యాయుఁడగు

కాళ్లకూరి సాంబశివరావుచే

రచియింపఁబడినది

మొదటికూర్పు

కాకినాడ

సుజనరంజనీ ముద్రాక్షరశాలయందు

ముద్రింపఁబడి

గ్రంథకర్తగారిచేతనే ప్రకటింపఁబడెను.

కాపీరైట్.

దీనివెల 6 అణాలు.

పీఠిక.

ఆంధ్ర భాషాభిమానులారా !

ఇది గడచిన 1757 సంవత్సరము జనవరినెల 26 తేదీని బొబ్బిలివారికిని విజయనగరం మహారాజులుగారికిని జరిగిన యుద్ధకథ. ఇది ప్రబంధముగాను, ద్విపదగాను, పాటగాను రచింపఁబడి పండితపామరుల కమితానందంబు సంధిల్లఁజేయుచున్నదని నేనువేఱే చెప్పనక్కఱలేదు. అట్టి సంతోషమునకుఁ గారణము బొబ్బిలిజనుల శౌర్యాతిరేకమేగాని కథారచనా చమత్కారము గాదు. దృశ్యప్రబంధముగనుండినఁ జూపరుల కపరిమితానందంబు గల్గుననియెంచి స్నేహితులచేతఁ బ్రేరేపింపఁబడి యీకథాసరళి కొంచె మించుమించుగ సమవాకార లక్షణమును బోలినహేతువుచేత సాధ్యమైనంతవఱకు దానిననుసరించినాఁడ. రసభరితములగు కృతులనొనర్ప సమర్థులగు కవిశ్రేష్ఠులఁ బోలకున్న నాంధ్రభాషయం దభిరుచిగలవాఁడనగుటచే శక్తికొలఁదిని బ్రయత్నించితిఁగాని ప్రప్రథమరచనా గ్రంథమగుటచే నిందు దోషములుండకపోవు. మార్పులుకావలసియున్నచోట్ల నాంధ్రభాషాధురీణులు దయతోఁదెలియఁజేసినం గృతజ్ఞతాపూర్వక వందనములతోఁగైకొని రెండవకూర్పునందు సవరించుకొనుచున్నాఁడను. ఈగ్రంథరచనలో దిట్టకవి నారాయణకవికృత రంగారాయచరిత్ర కడుసాహాయ్యం బొనర్చినది. మఱియుఁగొంత వృత్తాంతము కార్మైకెల్ దొరవారు వ్రాసినవిశాఖపట్టణం డిస్ట్రిక్టుమ్యాన్యూల్ నుంచి కొంత యారమ్ధొరగారు వ్రాసినచరిత్రనుంచి కొంత శ్రీ బొబ్బిలిరాజావారి ముఖస్థముగను గ్రహింపనయ్యె. సాధ్యమైనంతవఱకీ గ్రంథస్థమగుచరిత్ర వాస్తవమని నొక్కి చెప్పఁగలను. ఇక్కథానాయకుఁడగు శ్రీ గోపాల కృష్ణరంగారావు వారికినిప్పుడు బొబ్బిలిసంస్థానంబు నేలుచున్న శ్రీ రాజా మెహర్బాని, దోస్తాన్ శ్రీ రాజారావు వెంకట శ్వేతాచలపతి రంగారావుబహద్దర్, కే.సి.ఐ.ఇ. వారైదవతరము వారగుటచే నీగ్రంథము వారియభిమాన చారిత్రాభివర్ణనమేగాన వారికే కృతినియ్యఁదలఁచి, గడచిన జూన్ 30 తేదీని శ్రీవారిసభలోఁ జదివి వారికిఁగృతినొసంగినాఁడను. శ్రీ రాజావారు నమిత భాషా సరసులగుటచే రసంబుగ్రహించి యపరిమిత సంతోష సంపూరితాంతఃకరణులగుచు నన్ననేకవిధంబుల సన్మానించినదేగాక యీగ్రంథము నచ్చొత్తించుభారంబును వహించిరి శ్రీ వారికిని వారికుమారరత్నములగు శ్రీ వెంకటకుమార కృష్ణరంగారావుగారికిని శ్రీ రామకృష్ణ రంగారావుగారికిని దైవ మనిశంబు శ్రేయంబులనొనగూర్చుఁగాత.

కా. సాంబశివరావు.

ఇష్టదైవస్తుతి.

శా. శ్రీనాథోర్వీసుమేరుభూధర సురజ్యేష్ఠాగమాబ్జార్కలిం
పూనన్ రాజదజింహగోరురథ ధర్మోగ్రేద్ధసవ్యేష్టకా
జానేయవ్రజచక్రయుగ్మమయి చంచద్ఘోరసంఖ్యంబులో
నానక్తంచర కాలసంజ్ఞపురదిష్టాంతంబుఁ గావించి మేల్
క్షోణిన్నింపిన సాంయుగీనున కెదన్ జోహారుఁగావించెదన్.

కృతిపతిస్తుతి.

శా. శ్రీరాజీవభవాండమండల ఫలస్ఫీతంబు దీవ్యద్యశ
స్సౌరభ్యప్రథితంబు సద్గుణ సుమస్ఫారంబు కామప్రదం
బారూఢాత్మకవీంద్ర చిత్తమధుపౌఘాసేవ్యమానంబునౌ
శ్రీరంగాధిప కల్పకంబు విజయశ్రీనేలు రంగాధిపున్.

క. రాజునహిరాజు నంబుధి
రాజు నుమారాజు నద్రిరాజు నఖిలగో
రాజు హసియించి బొబ్బిలి
రాజుల సత్కీర్తి దిగ్విరాజులవేలున్.

సీ. చక్రరక్షణకళాశాలి యాతండని చక్రరక్షణకళాశాలియగుచుఁ
గమలాధికామోదకారి యాతండని కమలాధికామోదకారియగుచుఁ
సతతసన్మార్గసంచారి యాతండని సతతసన్మార్గసంచారియగుచుఁ
బ్రకటాఖిలలోక బాంధవుండతఁడని ప్రకటాఖిలలోక బంధువగుచు
గీ. శూరుఁడాతఁడని త్రిలోకశూరుఁడగుచు
నాప్రభాకరుతో నీప్రభాకరుండు
సాటియనవొప్పితివి రాజసార్వభౌమ
రంగరాయనృపాల శ్రీరమ్యశీల!

గీ. మీకులమువారిదైన సమీకచరిత
మో, సమవాకారముగఁ జేసిమీకుఁగృతి నొ
సంగుచున్నాఁడఁగొనుఁ డగ్రజాత్యకాళ్ళ
కూరి సాంబశివామాత్య ధీరుఁడ, నిదె.

ఈరూపకమునందలి ప్రధానపాత్రలు.

రంగారావు—బొబ్బిలిరాజు

వెంగళ్రాయఁడు—రంగారావు తమ్ముఁడు

చినరంగారావు—రంగారావు కుమారుఁడు

దామరదమ్మన్న
ధర్మారావు
చెలికాని వెంకయ్య
తాండ్ర పాపయ్య
పంతెన బుచ్చెన } రంగారావు బంధు మిత్రవర్గము.

విజయరామరాజు—విజయనగరం మహారాజు

జగన్నాథరాజు—విజయరామరాజు మంత్రి

వత్సవాయాన్వయుఁడు—పెద్దాపురంరాజు

బుస్సీ—ఫ్రెంచి గవర్నరు

హైదరుజంగు—బుస్సీమంత్రి

గోరుంబొర—కమాండరించీఫు

లక్ష్మన్న—బుస్సీ దుబాసీ

మద్దాల రెడ్డిరాయఁడు—గోరుంబొర దుబాసీ

నాగోజీరావు—హైదరుజంగు గుమాస్తాలలో ముఖ్యుఁడు

లూయిస్ మట్టెణ్—గోరుంబొరంపినవకీలు

లా, రాసూ, లాడమూఖాణ్, లాసుఖాణ్, హసనల్లీఖాణ్
షుకురల్లీ, ఒిడ్డీబిలాల్, కుప్పి, కుస్లాము } ఫరాసుపారసీకపు జోదులు

మల్లమ్మాదేవి—రంగారావుభార్య

శ్రీరస్తు.

శ్రీరంగారాయకదన సమవాకారము.

ప్రథమాంకము.

నాంది

రంగావనినాథుఁ డాప్రిథితలక్ష్మీసంశ్రయుం డాశ్రితా
ధారుం డుగ్రరణప్రమోది విజయోదారానుగుం డంచితా
చారుం డూర్జితుఁ డప్రమేయుఁడు గుణస్ఫారుండు మీనధ్వజా
కారుం డెల్లపుడిచ్చు మీకు నిఖిలాశీర్వప్రభాశ్రీయముల్.

(నాంద్యంతమున)

సూత్ర—నటీ! ఇటురమ్ము.

నటి—చిత్తము. ఆర్యపుత్రా! ఏమిసెలవు.

సూత్రి—ఇప్పుడియ్యెడఁగూడియున్న సభం దిలకించితివా?

నటి—చూచుచున్నానార్యసుతా.

సూత్ర—నటీ! ఈసభ, సుధర్మంబోలె విబుధమండల విరాజితంబై, కాసారంబు రీ రాజహంసాశ్రయంబై, కైలాసంబు భాతి సదార్యానుకూలంబై, కరిపురంబు వడువున గౌరవయోగ్యంబై, బ్రహ్మగేహంబుకైవడి భారతీనిలయంబై, యలకాపురంబు చెన్నున ధనదప్రధానంబై, కలశార్ణవంబు కరణి సంపజ్జనకంబై యొప్పుమీఱుచున్నది చూచితే?

నటి—పండితపుత్రా, నిజము. ఇప్పుడేమనియెదు?

సూత్ర—నటీ! వీరియుల్లంబులు పల్లవింప నేదేని యొక్క యపూర్వకథాప్రసంగంబు నడపవలెనని.

నటి—అట్లైనఁ గానిమ్ము, కాని సమస్తదృశ్యప్రబంధంబులును బ్రదర్శింపఁబడినవి

సూత్ర—నటీ! నీవెన్నఁడైన రంగారాయకదన సమవాకారంబన వినియుంటివే?

నటి—లేదు. అదెట్టిది?

సూత్ర—నటీ! అది బొబ్బిలి వెలమదొరలకును, విజయనగరము రాజునకును జరిగిన యుద్ధకథ.

నటి—అట్లైన నదియపూర్వమైనదే. దీని నెవరు రచించిరి?

సూత్ర—చెప్పెదవినుము.

సీ. కాశ్యపార్యాన్వయకలశపాథోరాశి రాకానిశీథినీరాజవరుఁడు
సప్తర్షివర్యసందీప్తభారద్వాజ సత్తపోధనగోత్ర సంభవుండు
ప్రస్ఫుటభోగరాట్పాపమాంబా గర్భశుక్తిముక్తామణిస్ఫూర్జితుండు
హూణాంధ్రభాషా మహోన్నత శేముషీ వైదుషీ విశ్రుతిభాసురుండు

గీ. సాంబశివరాయ కవిబుధజనవిధేయుఁ
డిదిగో రచియించె బొబ్బిలికదనచరిత
ముసమవాకారముగ రసస్ఫూర్తి యెసఁగ
సకలజనమానసాహ్లాదసరసఫణితి.

నటి—నీయంతటనీవే ప్రదర్శింప నెంచితివా? లేక సభ్యుల యనుమతమా?

సూత్ర—నటీ! నాయిష్టముగాదు. వారలే కోరిరి.

నటి—సరే. సభ్యులంతగొప్పవారని యంటివే! ముచ్చటదీరునట్లు వారినెట్లు రంజింపఁగలుగుదుము.

సూత్ర—నటీ! ఎంతవెఱ్ఱిదానవు మూర్ఖుల రంజింపఁజేయుట కష్టముగాని ధీరులను రంజించుటెంతపని,

గీ. రాజహంసలు క్షీర నీరములువేఱు
పఱచిక్షీరంబెగైకొని పరఁగుపగిది
సుగుణదోషములేర్పడఁజూచిగుణమె
గైకొనంజాలు వారలుగారెబుధులు.

నటి—ఆధైర్యమే నీకున్నచో నుద్యోగింపుము.

సూత్ర—మున్నుగ దత్సూచకంబగు శరదృతువర్ణనం బొనర్పుము. నటీ!

నటి—ఆపనికి నన్నే నియోగించితివా! కానిమ్ము. ప్రయత్నించెదను.

చ. శరములు నిర్మలత్వమున జాలుకొనె న...

శరములు పల్లవించె నలశారదలక్ష్మి మదుంగులోయనన్
శరములుపూని శాత్రవులు జన్యములం బచరింపసాగిరీ
శరదమలాంబుదంబులు ప్రసన్నములై ప్రబలెన్నభంబునన్.

చ. సురుచిరురంగరాయని యశోరుచులీసరణిన్ బ్రశస్తవై
ఖరిం బ్రసరించె నావిశదకాంతి శరద్వరచంద్రికల్ దిగం
తరములనిండె మాక్తికసుధారజతావని భృత్సురాపగా
సురభిపటీరహీర శరసూనములన్ హసియించిమించుచున్.

సూత్ర—ఆహా!

గీ. హాయిగానీవు గావించినట్టిశార
దాభివర్ణనము సుమనోహరిమై స్వ
భావసిద్ధంబునైయిప్డు ప్రబలుచునికి
నీదుచాతుర్యమే వర్ణనీయమయ్యె.

నటి—సరే! నాపాట కసూయంజేయక సంతసించితి వింతే చాలును.

సూత్ర—సుజనుల తెఱంగది గాదుగదా!

క. "దిద్దవలెం దప్పుగలిగిన
ముద్దుగనైఘంటికంబు మూలముగనితా
రెద్దియుంజూడక రోసెడి
గద్దరి కుమతులను లెక్కగొంతురె సుమతుల్."

ఇంతేగాక మున్ను.

క. అలబొబ్బిలిరావుకులీ
నులయున్నతింగాంచి యోర్వనోగిలియసూయా
కులుండైన పూసపాటిన్ప
తిలకుండేపాటికీరతిన్ జెందెనిలన్.

నటి—త్రైలోక్య విజయుండగు విజయరామరాజు కొల్వుండు తఱియయ్యె చాలుంజా
లు! మనమీపాటి పోవుదముపద.

సూత్ర—అవు నది నిజమే.

అని నిష్క్రమించుచున్నారు.

ఇది ప్రస్తావన.

రంగము :—విజయరామరాజు సభ.

[విజయరామరాజు, మంత్రి జగన్నాథరాజు ప్రవేశించుచున్నారు]

రాజు—మంత్రిపుంగవా!

మంత్రి—మహాప్రసాదము రాజా.

రాజు—నామనంబు చింతాకరంబయ్యెఁగదా! సౌఖ్యరాహిత్యంబగు వైభవమ్ము మరాళవర్జిత కాసారంబుగదా! అడవిగాచిన వెన్నెలకైవడిని నాజన్మంబు సాఫల్యముబొందమికి నాడెందంబు గడుఁగుందుచున్నయది.

గీ. చింత చితియనురెంటిలోఁజింతఘనము
మానసంబుననూహింప మాన్యచరిత
వినుముచితికాల్చు నిర్జీవులను బుడమిని
జింతఁగాల్చును బ్రాణులజీవయుతుల.

మఱియును.—

గీ. అంతి పురమును విజనంపుటడవిగవని
నంతి పురముగఁదోఁచింప స్వాంతమెసుమ
కారణంబగు నన్యంబుగాంచలేదు
సచివమూర్ధన్యయదిగాదె జగతియందు.

మంత్రి—రాజేంద్రా! వైభవమ్మున నింద్రుని, ధర్మంబున బలిని, పరాక్రమంబున రంగరాయుని మించి భూపాలుర నదిమి కప్పంబులుగొంచు దనయుర్వి కామధేనువునా విధి విధానమ్మున రాజ్యంబుసేయు మీకుఁగొఱంతగల్గునా!

గీ. అట్టిదుర్వ్యాకులంబేయహమునఁగాని
పొందఁగారాదు మీవంటిపురుషులకును
విభవసంస్ఫూర్తిజిష్ణువు! విజయరామ
రాజ! రాజన్యలోకమార్తాండమూర్తి.

రాజు—మంత్రివరా! నీవెంతబొగడినను రంగారాయశబ్దము విననప్పటియుండియు మనంబెరిసెడిని, ఏలనన!

శా. బాల్యంబాది యసంఖ్యమా యపకృతుల్ వారెన్నిమో జేయసా

కల్యంబేర్పడ సావినోద్భటమి నేఁగార్పణ్యమొప్పారిత
త్తుల్యంబుల్ప్రచరింపఁజాలకయె మద్దోర్దర్పముం జింపకే
లౌల్యంబౌగతి నూరకుంటినిగదా లావెంతయున్నల్గినన్.

ఇంతేగాక

క. ఎన్నంగరాని దుష్కృత
పన్నగవిషబాధకోర్వఁజాలైతిని త
త్పన్నగవిషదంష్ట్రావళి
నెన్నిక మున్మున్న డుళ్ళనేయనయితిహా. !

గీ. గోటఁజిమ్ముదాని గొడ్డండ్లఁగొట్టంగ
వలసెనన్ననూట పాటియయ్యె
నయ్యనేమి వారి నాజిని హతులుగ
జేసి సార్థకంబు జేతునభిధ.

మంత్రివరా! వైరిక్ష్మాజాని చక్షుఃశ్రవం బక్షీణోదగ్ర జిహ్వాగ్రంబులక్ష్వేళంబు గ్ర
క్కుచు క్షణక్షణంబును బొంచియుండ నాకెట్లు క్షేమంబుగల్గును?

మంత్రి—రాజేంద్రా! పరమంబగు నొక్క యర్థంబుగలదు. దానినాకర్ణింపుము.

గీ. తుష్టికలదేని వనమునందున్నఁగాని
నోఁచుసుఖముగజనునకుఁదుష్టిలేక
యున్నఁబురినున్న వనమునను న్నరీతి
సుఖముఁబొందకయుండును జూడనరుఁడు.

రాజు—అది నిజమే, గాని పరాక్రమశూరులగు రాకుమారులకిల నరివరోర్వీవరులదు
బులం బరాజితులంజేసి వారి యుర్వీరమల గొనుట ధర్మముకదా!

శా. రత్నస్థాపితవస్త్రపఙ్క్తియును శక్రస్వస్థసామ్రాజ్యమున్
నూత్నావాపక యక్షకర్దమసదన్యూనోత్తరాసంగముల్
యత్నోపార్జిత ఘోటకద్విపసమూహ ప్రాభవశ్రీలున
త్పత్నీరత్న కదంబమెల్లఁదులయే ప్రాంచద్యశోలక్ష్మికిన్.

కనుక మంత్రివరా!

సీ. కలితతజ్జయలక్ష్మి సంగ్రామసీమ
[illegible]

భూద్వితీయాభ్యుదయ కంతపూజ్యసూత్ర
పటలవిచ్ఛేదిగాని నాప్రాణమేల ?

మంత్రి—రాజేంద్రా! అట్టిధర్మంబరాతివీరులయెడఁ దగినదేగాని వారిత్తరి మనలకప రాథంబేమియుఁజేసినవారుగారు, నిర్నిమిత్తోద్యద్రుషాపాటవంబున నిరాటంకంబ గు యుష్మద్వ్యాచాటనంబున శత్రురాజులఁ గెలువనేర్తుమే ? "యతోధర్మస్తతోజ య" మన్న శ్రుతులమనము వినియుంటిమిగదా ? ఎచ్చట నధర్మంబుండు నచ్చట నాశంబగు చింతించనేల! అయినను

పంచచామరము. బలాబలంబులెంచి పొంచిబల్మినోర్వగావలెన్
హాళాహళిన్ దురంబులో నరాతివీరసంతతిన్
ఝుళంఝుళారవంబులొప్ప శస్త్రముల్చరింపఁగా
భళాభళీయటంచు మింటబల్పుపర్వులార్వగన్.

ప్రియంవదావృత్తం. అరులగెల్వఁదటేమైనయపుడా
యరినరాధిపుని నాజిగెల్వన్
గరువమేర్పడునుగాని సమయం
బరయకుండ ననర్థమగునే.

జనపాలా! నీకెల్లప్పుడు హితముగోరి సమయాసమయంబులారసి యరాతివీరుల నో ర్వకాలంబు సమకూడ నేనూరకుందునే ?

రాజు—అమాత్యవరా! నీవు వాక్రుచ్చినది నిక్కువంబే, గాని, ప్రక్క నరివీర రంగ రాట్పన్నగంబు బొబ్బిలి ప్రాకారవామలూర్వంతరస్థాయియై యుండెననుచింతయం తరంగకకుబంతకుహరపుటభేదనంబు గావించుచున్నది.

మంత్రి—రాజేంద్రా! వినుమరాతివీరబలోద్రేకంబు మనకనుభవైకవేద్యమే.

గీ. వైరివీరులపారదుర్వారులనుచు
మక్కువాదిస్థలంబుల మనకుదేట
పడియెగా యింకనెందుకీపాటి చూడి
సమయమునువేచియుండుట చక్కనగును.

అదిగాక.

గీ. అచటఁబుట్టిన ననగొమ్మమైనఁజేవ

చేత రాజిలు వీరులఁజెప్ప నేల ?
ప్రథితబలరాజులతుల పరాక్రమమ్మున
రాజులారయ బొబ్బిలి రాజులెల్ల.

మఱియును.

గీ. వారిమాహాత్మ్యమెన్నంగవశమె మనకుఁ
జండదోర్దండకాండప్రకాండకాండ
కలనఁబెద్దలువారలు ఘనచమూర్ధ
తినిమనము బెద్దలము నిజస్థితినిగనుఁడు.

రాజు—నీవును వారిమహిమనే యెక్కుడుగఁదలంచుచున్నావా?

మంత్రి—లేదు. రాజా! దురంబులకరుగనుత్సహించుతఱి నెదిరిబలంబును నిజబలంబును మనమాలోచించుకొనవలయును గదా! అందుకొఱకై జెప్పినాఁడనుగాని వేఱుగాదు.

(కంచుకి ప్రవేశించుచున్నాఁడు.)

కంచుకి—మహాప్రభూ! మీదర్శనంబునకిద్దఱు బ్రాహ్మణులు వచ్చి ద్వారంబున వేచియున్నారు.

రాజు—సేవకా! వారినిటుల బిలువుము.

సేవకుఁడు—చిత్తము. దేవరా! (అనియరుగుచున్నాఁడు)

(బ్రాహ్మణులు ప్రవేశించుచున్నారు)

రాజు—లేచి చేతులుమోడ్చి (ప్రకాశముగా) నమస్కారము. భూసురోత్తములారా!

బ్రాహ్మ—విజయీభవ. (అని యాశీర్వదించుచున్నారు)

రాజు—మేదినీసురలారా! ఇటుల నాసీనులరగుడు.

బ్రాహ్మ—ఆసీనులగుచున్నారు.

రాజు—భూదేవోత్తములారా! ఎచ్చటినుండి విచ్చేయుచున్నారు?

బ్రాహ్మ—భూవరా! శ్రీరబొబ్బిలి సంస్థానాస్థానంబు వెలువడివచ్చుచున్నాము.

రాజు—అచ్చటివింతలేమి?

బ్రాహ్మ—నరేంద్రా! అచ్చటివింతల నెంతని దెల్పుదుము. వత్సరంబునంగల ద్వాదశమాసంబులు విచ్చలవిడిజరించుచు నందందుల రాజచంద్రుల దర్శించుచు వారిమాహాత్మ్యంబులుచూచుచుంటిమిగాని యాబొబ్బిలిరాజన్యానేకపసింహులంబోలిన ఛాశ్ర
[illegible]

రాజు—(తనలో) ఏమిపొగడుచున్నారు. నేనుగూడ విశేషధన మొసంగితినా నన్ను నిట్లేయొండుచోటం బొగడుదురు.

బ్రాహ్మ—శా. శ్రీమాటోపసుధీస్థిరత్వమహిమావిశ్రాణనాలిక్షమా
ప్రామాణ్యంబుల నీసడింతురు సుమా పాండుద్వితీయాత్మజా
తామర్త్యాళిగురుప్రమేరురవిపుత్రానంతవర్గంబు నిం
కేమర్త్యుల్సమహాదురిమ్మహినిదే యీరాజలోకంబునన్.

మఱియును.

గీ. అంటిపొడిచి వేగగంటువెంబడిదూరు
నదురుగుండె పిక్క చెదురులేక
దరమునందు రిపుల దుర్వారశక్తిచే
రాజవరుఁడు రంగరాయఘనుఁడు.

రాజా! ఆగోపాలకృష్ణరంగరాయ కుమారవల్లభు ప్రాభవంబు వర్ణింప వేనోళ్ళ చిలువకైనను దరంబుగాదు.

గీ. పుడమి నెంచఁజూడ రాజపుంగవులను
గంటిమేగాని లేరిటువంటివారు
ధనమొసంగఁగుచేలుఁడు ధనదుఁడగును
శిక్షజేయఁదలంచిన శివుఁడడంగు.

గీ. పుణ్యజనులను గారింపఁబూనెరంగ
రాయుఁడనువాడు మాపై నీరంగరాయుఁ
డాత్మలోనఁదలంచినిరంతరంబు
పుణ్యజనులనురక్షించుపూనిక్కబూని.

రాజు—ఆహా! నిజమేనా! ఏమిపొగడుచున్నారు! బాపలకు పొగడుట నైజము. మీకువిశేషమొసఁగినవారే దానకర్ణులు. తక్కనగుణంబులెట్లున్నను.

మంత్రివరా! ఈబాపలను బంపివేయుము.

మంత్రి—మంచిది రాజేంద్రా. (అనివారిని బంపివేయుచున్నాఁడు)

బ్రాహ్మ—ఇదేమి. వారిని బొగడితిమనిగాఁబోలు మనలనువచ్చినదారిని బొమ్మనె. ఎంత వెఱ్ఱిపనిచేసితిమి ? (అనుకొనుచుఁబోవుచున్నారు.)

రాజు—మంత్రిపుంగవా! ఈబ్రాహ్మణుల వరన నిజమైనదియే ?

మంత్రి—కొంత నిజమే. దానినతిశయముగఁ జెప్పియున్నారు. లోకమందిట్టిది యాచకులకు సహజమేగదా ?

రాజు—సచివాగ్రణీ !

గీ. దానరాధేయులఁట సుప్రతాపశౌండు
లఁట యుపాయవిదులఁట సప్తాంగధుర్యు
లఁట తగన్వారు నేను గానఁట కను మిదె
తెలియు నాక్షాత్రమున్ వారి వెలమతనము.

(వారొనర్చిన యపకృతి నెదఁదలంచి) తలపంకించుచు (ప్రకాశముగా) ఈపట్ల వారిని వదలివేయఁజనదు.

మంత్రి—(స్వగతము) ఆహా ! ఈరాజు రావువంశపయోధి సుధాంశుండైన గోపాల కృష్ణరంగరావు సరళియరసి చూపోపక నిర్హేతుక జాయమాన కృధాకలితుఁడగుచు దుర్వ్యథచే బాధితుఁడగుచున్నాఁడు. బలాబలంబులం దెలుప నేనన్నమాటలచేతనే కుందుచుండఁగా గోరుచుట్టుమీఁద రోకంటిపోటన్నట్లు బ్రాహ్మణులుకూడ సమకూడిరి. కూడిరిబో శత్రురాజవర్ణనగూడఁ గావించిరి. దండతాడిత భుజంగంబుభాతి నుగ్రుఁడైయున్నాఁడు. (ప్రకాశముగా)

రాజాగ్రణీ! శాంతివహింపుఁడు. ఆరంగరావిత్తఱిఁదమకెట్టియపకారంబుఁజేసినవాఁడు ? నిర్హేతుకంబుగ నిట్టికోపమేల ? ఇత్తఱి నారాజుపై దండెత్తినచో నన్యాయయుద్ధంబని జనులు మనలను నిందింతురు గాన.

క. కారణములేక కార్యము
గా రా దని పెద్దలండ్రు గావునరంధ్రం
బారసి రాజోత్తమ! ప్రతి
కారం బేమైనఁగాని కావింప నగున్.

రాజు—కారణములేదా ? నీకుఁ దెలియలేదుగాఁబోలును.

ఉ. ఇప్పుడువాఁడు సేయుపని యేమియెఱుంగవె ? యింకనేమి వా
తప్పులు సేయఁగావలెనా ? తద్దయుఁబాటెడు కొండకాల్వలం
జప్పున నడ్డుగట్టి పలుసస్యము పండఁగ నాత్మరాజ్యమున్
జొప్పడఁజేసెఁ దానెదురఁజూడవె ? న్యాయముఁదప్పె నీసునన్.

నీవిట్టివెడఁగుమాటలాడకుము. ఉత్తమమైన క్షత్రియ వంశంబునఁ బుట్టి క్షాత్ర

మింకైనను లేక యిట్టిపిఱికిమాట లాడ నేమిమగతనంబు? ఎట్లైన నారాజుం జయించి వీరలక్ష్మిం జేకొందుంగాక.

మత్తకోకిల. వీరవంశమునందుఁ బుట్టియు వీరులన్ రిపులన్ సుగం
భీరులం బొలియింప లేనిది విశ్రుతంబగు క్షాత్రమే?
శూరుని స్థ్దరమందు నేర్చి విశుద్ధకీర్తిని బొందెదన్
గారుబీరము లాడుచుండుట గాదుసుమ్ము యథార్థముల్.

మంత్రి—(స్వాగతము) అంతకంతకుఁ గ్రోధంబు హెచ్చి యెదిరిబలంబెఱుఁగనివాఁడై యిట్లనుచున్నాఁడు. నేనిప్పుడేమన్నను వినువాఁడుగా లేఁడు. పోనిమ్ము నాకేల? ఎవఁడెంతచేసికొను నంత ననుభవించునుగదా? (ప్రకాశముగా) రాజేంద్రా! మీరట్టి పౌరుషవంతులే.

రాజు—పౌరుషముకంటె జీవనము పెద్దయే? పౌరుషహీనుఁడై బ్రతుకుకంటె సమరంబున నరాతివీరులచే మడియుట మేలు. ఈజన్మం బనపాయంబు గాదు గదా? నవలక్షకళింగాధిపతినై యుండియును వేయిమడుంగులు తక్కువగు బొబ్బిలిరాజుల పాటి యసంబును బొందలేక కీర్తికాంతను జేసేత వారిపాలెట్లుసేతును?

మహాస్రగ్ధర. ఘోరంబౌ మత్ప్రకాండాగ్నుల వెలమకులాంకూరముల్ కాల్చివైతున్
వీరాటోపం బెలర్ప న్విమతుల సమరోర్వీస్థలి న్జెండివైతున్
బారిరంభానీకఘాటిం బ్రకటిత విజయం బంది బొబ్బిల్లడీనిన్
ధీరౌద్ధత్యంబుపేర్మిన్ స్థిరముగ నిజదోర్దీప్తశక్తిన్ భరింతున్.

అట్లుగాదేని.

గీ. రంగరాయఁడొండె రంగద్విజయరామ
రాయఁడొండెనుభయరాజ్యములకు
రిపులనోర్చియేలు విపులభీమాహవ
కేళియందు నిజజనాళి మెచ్చ.

అట్లుగాన మంత్రివరా! నాయుద్యమంబునకుఁ దగిన ప్రయత్నంబొనఁ గూర్పుము. అరాతివీరులబల మెఱుంగనిదిగాదు. వారును శౌర్యాన్వితులే, అట్టివారిని దురంబున జయించినదే జయము. పిచ్చుకమీఁదఁజంద్రాయుధ మన్నట్లు గంభీరులనుదాగి భీరులైనవారిపై దాడివిడియు చేటినడువడి?

మంత్రి—అది నిజమేగాని

గీ. జన్యములకేగు కాలంబు చక్కనెఱిఁగి
పగఱబల మెంచి సప్తాంగపటిమ నెఱసి
పగను సాధింప సంకింప వలెను గాని
తలఁచినప్పుడ సమకట్టఁ దగవు గాదు.

రాజు—పోనిమ్ము. మనకపకారమొనరించిరా లేదా ?

మంత్రి—దానివలన గోపాలకృష్ణరంగారాపు మనకు నికారమెంచెనో లేదో ?

రాజు—నీవింక నట్లనియెదవేల ?

గీ. నిర్ఝరము లడ్డి మనచేల నీరుబాఱ
నీక మనరైతు లంతట నాఁకపెట్ట
మన్నెవా రంత వారల మట్టిరి యఁట
దగునె వారికి ? నింతయుఁ దలఁప వైశి.

ఇందుకేమనియెదు ?

మంత్రి—రాజా ! అదియకార్యమే. మొదట సామదానభేదంబుల వారితో ముచ్చటించుటమంచిది.

రాజు—మొదటినుండియు నాయం దసూయాభావము నే మదిఁ బొందుపఱచియున్న రంగరావు నాతో దాచకార్యసరళి పొత్తొనరించునా ? నీవు చెప్పినది యొప్పుగ నున్నది. ఏమినీతిచెప్పితివి ? ఆరాజాధముండు నన్నంత నీచపఱచెనుగా ? వానితో నాసామదానభేదోపాయంబులు ?

మంత్రి—గీ. ఎట్టికార్యములందైన నేలిక ! మును
మున్న ప్రతికార్యమునకును బూనుపట్ల
సామదానభేదంబులఁ జక్కఁజేయఁ
గాకయుండినఁ దండంబె కడఁక దగును.

రాజు—కం. ఆలోచనలెన్నియునిం
కేలా యీయెడల మనకు ? నింతేనియులోఁ
జాలిఁదలఁపఁదగదు తగవు
మాలినయావెలమదురభిమానులయెడలన్.

గనుక మంత్రివర్యా ! పరిపరివిధంబులఁ దద్విధానంబుమనంబున నాలోచించుచుం[illegible]
[illegible] నీకు నాసహాయత్వంబునకే కడఁగుము.

(నేపథ్యంబున) కళింగాధిపుఁడెచ్చటనున్నవాఁడు ?

(అందఱు నాలకించుచున్నారు.)

సేవకు—మహాప్రభూ ! ఎవ్వరోయిద్దఱు తురకబంట్రోతులువచ్చి రాజుంజూపుమనిఖీ మాట్టహాసముచేయుచున్నారు సెలవైనఁదోడ్కొనివత్తును.

రాజు—మంత్రివర్యా ! వారి నిటు బిల్వ నంపుము.

మంత్రి—చిత్తము. రాజేంద్రా ! సేవకా !

సేవకు—మహాప్రసాదము మంత్రిపుంగవా !

మంత్రి—వారినిటుదోడ్కొనిరమ్ము.

సేవకు—చిత్తమట్లే తోడ్కొనివత్తును.

(అనిపోయివారిని వెంటఁగొనివచ్చుచున్నాఁడు.)

బంట్రోతు—సలామ్‌దేఖో మహారాజ్ మాప్రభువైన హైదరుజంగు తమకిమ్మని తాఖీదొసంగియున్నాఁడు. ఇదిగోగైకొనుఁడు.

(అని మంత్రికాతాఖీదునిచ్చుచున్నారు.)

మంత్రి—(చదివిచూచుకొని) రాజేంద్రా ! హైదర్జంగుసాహెబుగారు మనలను దస్తువసూలుచేసికొని జమాబందీ నిమిత్తము రాజమహేంద్రవరముమకామునకు రమ్మని కమ్మవ్రాసిరి. ఇదెవర్తమానము.

రాజు—అట్లయిననరే. (ముఖవిలాసముతో) మంత్రివరా ! ఇట్టియధికారమును వీరికెవ్వరొసంగియున్నారు మఱచిపోతిని జెప్పుము ?

మంత్రి—రాజా ! ఉత్తరసర్కార్లను 1752 వ వత్సరంబున డక్కనునవాబగు సాలబజ్జంగుగారు పరాసుసైన్యరక్షణకొఱకు బుస్సీదొరవారికొసంగియున్నారు. వెనుక ముజఫర్జంగుగారు డూప్లేదొరవారికిచ్చిన దేశముతో నుత్తరమున గుండ్లక్కమాలగాయతు జగన్నాథమువఱకు నుండుదేశమంతయుఁ బరాసువారిస్వాధీనమైనది. గనుక బుస్సీదొరవారుమనకు సర్వాధికారులు. హైదర్‌జంగుసాహెబుగారు వారిమంత్రులు.

రాజు—అపుడు జ్ఞాపకమువచ్చినది (వికాసము ముఖమునందోఁపఁగా.)

(స్వాగతము) మంచిసమయము సమకూడినది కానిమ్ము వారింగలిసి యభిమతసిద్ధింబడసెదనుగాక (ప్రకాశముగా) మంత్రివరా ! వారెప్పుడువచ్చిరి ?

మంత్రి—క్రీస్తుశకమునందు 1756 వదియగు నీవత్సరము డిశంబరునెల 19 వ తేదీని వా

రు రాజమహేంద్రవరముం బ్రవేశించియున్నారు.

రాజు—బంట్రోతులారా! ఎవ్వరెవ్వరువచ్చిరి?

బంట్రో—మహారాజా! సర్వసర్వంసహాధీశ్వరుండగు బుస్సీదొరవారు వారి మంత్రియగు హైదర్జంగు సాహేబుగారు మహమ్మదుహుస్సేన్ లాడూఖాన్ సిద్దీబిలాల్ జానూఖాన్ హసనల్లీఖాన్ మొదలగు మేటిజోదులును వచ్చియున్నారు ఇంక నాగోజీరాయాది ముసద్దీలు చాలామందిసిద్దీలును వచ్చియున్నారు.

రాజు—వీరికందఱకు బసదిగుటకుఁదగిన స్థలంబెచ్చటననువుపడినదో?

బంట్రో—గోదావరీ తటంబునఁ గోటిలింగపుణ్యక్షేత్ర సామీప్యంబున గుడారంబుల నిర్మించుకొని విడిసియున్నారు మహాప్రభూ!

రాజు—వారు సేనాసహితంబుగవచ్చినారా?

బంట్రో—మహారాజా! వారుచతురంగ బలసమేతంబుగవచ్చియున్నారు?

రాజు—ఏయే రాజులకుఁ దాఖీదులనంపియున్నారు

బంట్రో—శ్రీకాకుళపుసర్కారులోఁగల జమీదారులకందఱికిని దాఖీదులంజేసియున్నారు మేముసత్వరంబుగఁబోయి వారికీతాఖీదులంజూపి బూసీసందర్శనంబునకుంబోవలసియున్నది మాకు సెలవొసంగుఁడు.

రాజు—మంత్రివరా! ఈసాహేబులకుందగిన సత్కారంబులఁజేసిపంపుము మనమును బుస్సీదర్శనమునకు వేగమ పోవుదము.

మంత్రి—మంచిదిరాజేంద్రా! అట్లేయొనర్తును.

(అనివారికిఁదగిన బహుమతులనొసఁగి పంపివేయుచున్నాఁడు.)

రాజు—సచివాగ్రణీ! మనప్రయాణంబునకుఁదగిన రథగజపదాతి తురంగవ్రజంబు నాయత్తపఱుపుము సేనలకుఁ బ్రయాణంబులుసెప్పి తగినయుద్యమంబున నుండుము. మఱియును దగిన దినంబారసిచెప్పుము.

మంత్రి—నరేంద్రా! వార్షికవాసరంబులరిగె శరత్కాలంబు జరుగుచుండె విజయనిమిత్తోత్సవంబులనలరుచు రాజన్యులకు జన్యముల కరుగు కాలముకూడ సమకూడినది.

గీ. కొలఁకులెల్లను సంపూర్ణజలముచేత
నొప్పుచున్నవి. తృణవృద్ధినుర్వియొసఁగు
చున్న దిప్పుడురాజేంద్ర! యొయ్య సేన
లకు గజాళికి నసుఖముల్జరుగ వధిప!

కావున నేలిక శుభ ప్రయాణంబున కెల్లియ భవ్యదినము.

రాజు—మంచిది. మంత్రివరా! దుర్గరక్షణంబునకు నెవ్వనైన నియమించితివా?

మంత్రి—నియమించితిని రాజేంద్రా! సమస్తంబు నాయత్త పఱచితిని.

రాజు—అట్లైన సరే. రేప పయనమై పోవుదము.

(అని అందఱు నిష్క్రమించుచున్నారు.)

రంగము :—రాజమహేంద్రవరములో హైదర్జంగు కచ్చేరీ.

(బంట్రోతులు ప్రవేశించుచున్నారు)

బంట్రోతులు—సలామ్, హైదర్ జంగు మంత్రివరా! తాఖీదులను దమ సెలవు ప్రకారము శ్రీకాకుళము సర్కారులోఁగల జమీదార్లకిచ్చి వచ్చినాము.

హైదర్—మంచిది పొండు.

సభ్యులారా! పారావారంబు ఘూర్ణిల్లెడు తెఱంగునను కరించుచు ధ్వని వినవచ్చెడిని. నాగోజీరాయ ప్రముఖులారా! మనపై సంగ్రామం బొనర్చుట కేవ్వరైన వచ్చుచున్నారేమో? (భటులతో)

క. కాండంబునిండి భేరీ
డాంఢధ్వానంబు దిక్తటంబు లవియ ను
ద్దండత విన వచ్చెడి నరి
దండెత్తుటయేమొ? తెలియఁ దగు భటులారా!

నాగోజీరావుగారూ! అదేమొ మీరేగి చూచిరండు.

నాగోజీ—చిత్తము. మంత్రివర్యా. ఇదే పోవుచున్నాను.

(నాగోజీరావు పోవుచున్నాఁడు)

హైదర్—సిద్దిబిలాల్ ?

సిద్దిబిలా—జీ! సాహెబ్, మెహర్బాన్, సలామ్.

హైదర్—మీరందఱు మీమీ సేనలతో సిద్ధముగానున్నారా?

సిద్దిబిలా—తయార్ మహరాజ్.

హైదర్—మంచిది. (నాగోజీ ప్రవేశించుచున్నాఁడు).

నాగోజీ—గీ. చూచి వచ్చితి నరిసేనచూడరాదు
మిమ్ము దర్శించు నుత్కంఠ మీఱినృపులు
షటురయంబున వారిటువచ్చుచున్న

వారలేగాని మఱి యొండ్లుగారుసుమ్మ.

శా. సాహేబాగ్రణి ! బూసిదర్శన సముత్సాహోగతక్షోణిభృ
ద్వ్యూహోద్దగ్రపటుప్రతాప విశద వ్యాఘాయమాన స్ఫుట
వ్యూహావిర్భవగర్జితారవలసద్వ్యత్క్రియ్యమాణాంకృథ
క్కాహీనానక భీమవాద్య ఘననిర్హ్రాదం బదే మ్రోగెడిన్.

హైదర్—మంచిది. చమూపతులారా ! మీస్థానంబుల కరుగుడు.

సిద్దు—చిత్తము సలామ్. (అని పోవుచున్నారు)

హైదర్—రాజులన్న జ్ఞాపకము వచ్చుచున్నది. మనము తాఖీదులం బంపి నేటికి వారము రోజులైనదే. నేటిదినము 28 వ తారీఖు కూడఁ బ్రవేశించె. ఇంకను రాజులు రాలేదా ?

నాగోజీ—క. వచ్చిరికొందఱు రాజులు
వచ్చుచునున్నారు మిగులువారలు దూరం
బిచ్చటికి వారినెలవులు
క్రచ్చరరాఁజాలమి కిదె కారణమేమో ?

హైదర్—వారిని నీవు చూచినావా ?

నాగోజీ—చూచితిని మంత్రివరా !

హైదర్—వారందఱుఁ గచ్చేరికి వచ్చిరా ?

నాగోజీ—రాలేదు.

హైదర్—వారి నింకెట్లు తెలిసికొంటివి ?

నాగోజీ—క. రాజులనందఱఁజూచితిఁ
దేజోవైభవము లెంతొ దీపింపఁబురీ
రాజపథంబున రానే
రాజద్గతిమీఱి వారిఁ బ్రజలు నుతింపన్.

క. చతురంగబలసమన్వితు
లతులితవైభవ తిరస్కృతాఖండలు ల
ప్రతిహతబలబలభద్రులు
క్షితిపతు లాకొ్కకరె వచ్చిచేరిరి నగరిన్.

హైదర్—ఆలాగా ?

క. నీవట్లు చెప్ప నాకున్
భావంబున వేడుకయ్యెఁ బల్కుము వినఁగా
నావిభుల విశేషమ్ములు
నీవెఱిఁగినకొలఁది వారినెల్లెఱిఁగితివో !

నాగోజీ—అట్లైన వినుము. మొదటఁ గళింగాధిపుఁడగు విజయరామరాజు నిజబాహుశుండాదండవిరాజిత విజయగాండీవ సన్నిభ కోదండుండై యిరువంకల శంఖారావములు దేవదత్తారవ సన్నిభంబులుగాఁగ, నైరావత తిరస్కృత గజంబులు, నుచ్చైశ్శ్రవసన్నిభంబులగు వాజిరాజులును, నిరుపమానసంగ్రామ కళాధౌరేయులంబోని సైనిక నికాయంబులును, బలిసి రాఁ బద్ధ్వని మిన్నుముట్టి మాఱుమ్రోయ నొక్కపెల్లున నీరాజమహేంద్రవరపురంబుఁ బ్రవేశించె. అదే కదా యాధ్వని మీరు మమ్ముఁ దెలిసికొనిరమ్మంటిరి ?

హైదర్—ఔను అదే నా యాధ్వని. అట్టివారేమి వారు ?

నాగోజీ—సుగంధివృత్తము. ఆకళింగభూమిజాని యద్భుతంపువైభవం
బేకడిందిఁజెప్పనేర్తు నేను మీకు ధీనిధీ !
యాకుభృద్భిడౌజమూర్తి యాత్మవర్గయుక్తుఁడై
వీఁకమీఱ దర్శనంబువేడ్కమీఱ వచ్చెడిన్.

హైదరు—ఇంక నెవ్వరు వచ్చిరి ?

నాగో—మహాప్రభూ ! కాకర్లపూడివంశాంబుధి సోముఁడగు జగన్నాథరాయవరుండును సత్యవరపుర స్వామియగు రామభద్రరాజాగ్రణియును గాశీపతి క్ష్మాధవుండును జింతలపాటి నీలాద్రిరాయండును మఱికొందఱు నావిజయరామరాజుమ్రోల నే వచ్చిరి.

కం. ఆరాజవరాళిఁజూడఁగ
గౌరవమున మందపాటికలితకులజులౌ
శ్రీరఘునాథాగ్రణియును
వీరుఁడు బలభద్రరాజు విచ్చేసి రొగిన్.

హైదరు—కళింగదేశాధీశ్వరుండట్టి యింతటివాఁడేమి ? ఎందఱినో తురుష్కావనీపతుల నతులగతి న్దిలకించుచుంటిని గాని వీరింబోలినవారి నెందేనిఁ జూచియుండలేదు. అందుచేతనే గదా శ్రీకాకుళపు నాయబగు జాఫరల్లీఖాను వ ర్తాసుల నెవిరింపఁ

గోరి యీరాజును సహాయము చేసికొనె?

(బుస్సీ ప్రవేశించుచున్నాఁడు.)

(అందఱు లేచి సలాములఁ జేయుచున్నారు. వారియాజ్ఞనొంది యందఱు నాసీనుల గుచున్నారు.)

బుస్సీ—(శ్రవణమభినయించి) హైదరుజంగుగారూ! ఆధ్వనియేమి?

హైదరు.—నాగోజీరావుగారూ! ఆధ్వనికేమికారణము? చూచిరమ్ము.

నాగోజీ—(తొంగిచూచి) మహాప్రభూ! బుస్సీవర్యా!

చం. నలువదివేలకాల్బలము నాలుగువేలహయంబులెన్నొయే
న్గలును శతఘ్నికాచయముఁ గూడి ప్రభుత్వమహత్తుఁదెల్పఁగా
నలరుచు రాణ్మహేంద్రవరుఁ డాదట మాగధవార మెంతయుం
గొలుచుచుఁగూడరాఁగ నిదిగోచనుదెంచెడిమిమ్ముఁజూడఁగన్.

(విజయరామరాజు ప్రవేశించుచున్నాఁడు.)

విజయ—బుస్సీగారు! సలామ్. హైదర్ గారూ! సలామ్.

హైదరు—(లేచి) సలామ్ రాజా! దయసేయుము.

(అని కుర్చీని జూపుచున్నాఁడు.)

రాజు—ఆసీనుఁడగుచున్నాఁడు.

హైదరు—రాజేంద్రా! సేమంబె?

విజయ—మీయనుగ్రహమువలన క్షేమము. మంత్రివర్యా!

గీ. మీరు తాఖీదుఁజూడఁగ నాదుడెంద
మధిక మానందమును బొంది యలఘు గతిని
మిమ్ము దర్శించువేడుక మించఁగా ని
చటికి వచ్చితిమయ్య యోసాహెబేంద్ర.

హైదరు—మంచిది రాజాగ్రణి! మీదర్శనంబుచే మాకును సంతసమయ్యె. మీపరిపాల నావిశేషమ్మున జనుల కధికసుఖం బగుచున్నదిగదా! అమాత్యభృత్యవర్గంబు మీయిష్టానుసారంబు ప్రవర్తిల్లునే?

విజయ—మ. అరిదిం జూపరులు న్గనంగఁ బ్రజ లత్యంతంబు నాయాజ్ఞల
న్నౌరది న్స్వే శిరసావహింతురి సచివుల్ చోద్యంబుగా మద్వచ
స్సరణి న్జేయుచు రెల్లకార్యముల నశ్రాంతంబు భద్రంబు మీ

యురుకారుణ్యముగల్గుట మ్ముసలిమానుర్వీపతి గ్రామణీ.

హైదరు—రాజేంద్రా! మిగుల సంతసంబయ్యె. (లోలోఁగలకలము)

నాగోజీరావుగారూ! ఆకలకలంబేమి?

నాగోజీ—(తొంగిచూచి) మహాప్రభూ! మీసందర్శనంబునకుఁ దక్షిణ శ్రీకాకుళపు మహీపతులరుఁగుదెంచుచున్నారు.

హైదరు—సేవకా! కుర్చీలు వేయుము.

సేవకు—చిత్తముస్వామి! (అని యట్లొనర్చుచున్నాఁడు)

హాయి—సేవకా! హుక్కాయి నిటుతెమ్ము.

సేవకు—తెచ్చి యిచ్చుచున్నాఁడు.

హాయి—పీల్చుచు వింతహాయి ననుభవించుచున్నాఁడు.

రాజులు ప్రవేశించుచున్నారు.

రాజులు—సలామ్ బుస్సీవర్యా! హాయిదరుజంగుగారూ! సలామ్.

విజయరామరాజుగారు తాజీమిచ్చుచున్నారు.

నాగోజీ—ఇటుకూర్చుండుఁడు రాజవర్యులారా!

(అని వారల నాసీనులం జేయుచున్నాఁడు)

హాయి—అబ్బా ఖైనాగోజీ! వచ్చినవారెవరు? (అని కనుసైఁగ చేయుచున్నాఁడు.)

నాగోజీ—గీ. సాహెబాగ్రణివిను మీ రసావరుండు
వత్సవాయాన్వవాయుండు బాయకేశ్వ
రానుజుల్వీరు వీరునారాయణేశ
కిమిడిరాజన్య పుంగవు లమితయశులు.

గీ, వీరుగొలుగొండ భూజాను లారయంగ
సత్యవరరాజచంద్రుఁడీ సత్వఘనుఁడు
నీలభూధరరాయఁడీ నిర్మలుండు
కాశిపత్యభిధేయుఁడీఘనయశుండు.

వీరు కాకర్లపూడి జగన్నాథరాయవరులు వీరు మందపాటివంశాంబుధి సోములగు రఘునాథ బలభద్రరాజ పుంగవులు.

బుస్సీ—క్షమావరులారా!

క. మాయానఁ బూనిమీరిట

కైదే తెంచుటకు మోదమందితి మింకన్
జేయుఁడు విహితోద్యమముల
నాయతభుజులార! మీరలాయత్తపడన్.

విజయ—చిత్తము. ఫరాసువంశాగ్రణీ!

బుస్సీ—హైదరుజంగుగారూ! వీరితోఁ మనకుగల పనినంతయు జూటపఱచి వీరికి సెలవునొసంగుఁడు.

హైదర్—మహాప్రసాదము స్వామీ!

బుస్సీ—భోజన సమయమైనది పోవుదము.

(అందఱు నిష్క్రమించుచున్నారు.)

రంగము:—విజయరామరాజుబస.

రాజు మంత్రి నౌకరు మొదలగువారు ప్రవేశించుచున్నారు.

రాజు—మంత్రివరా! మనగ్రామముల విషయమైన సముజాయిషీ దివాణమువారికిఁ దెల్పుటకు మనకు వకీలు ముఖ్యంబుగదా!

మంత్రి—అవును రాజేంద్రా పిలిపించెదను. సేవకా! యిటురమ్ము.

సేవకు—చిత్తము స్వామీ! ఏమి సెలవు?

మంత్రి—నీవుపోయి యొకవకీలును బిలుచుకొనిరమ్ము.

సేవకు—మహాప్రసాదము స్వామీ.

(అనిపోయి వెంటఁగొని వచ్చుచున్నాఁడు.)

(వకీలు ప్రవేశించుచున్నాఁడు.)

వకీలు—నమస్కారము రాజేంద్రా! నమస్కారము మంత్రివర్యా!

మంత్రి—వకీలుగారూ! ఇటఁ గూర్చుండుఁడు. (కుర్చీని జూపుచున్నాఁడు)

వకీలు—ఆసీనుఁడగుచున్నాఁడు.

మంత్రి—మీరు మాకొక రాచకార్యము చేసిపెట్టవలె.

వకీలు—అట్లనే. మంత్రిగారూ దానికేమి? సెలవిండు.

మంత్రి—క. మీరాతురుష్కవర్యు హ
జారమునంజేరి వచన చాతురిమెఱయన్
మారాచ కార్యము నవి
స్తారంబునుదెల్పి సెలవు దగఁగొనిరండీ.

వకీలు—చిత్తము స్వామీ ! అట్లే చేసెదను.

మంత్రి—“ ఎప్పటికిని మాకళింగకు మోతాదుగ జమాబందీ ద్వాదశలక్షల కేర్పాటున్న ది. ఆసొమ్ములో సగమిపుడును దక్కినసగము మీరు గోదావరిc దిరిగి దాటులోగ ని య్యcగలవార ” మని చెప్పుము.

వకీలు—అట్లే మనవిచేసెదను. పోయివచ్చెదను.

రాజు—వకీలుగారూ ! ఒకమాట హైదరుజంగు సాహేబుగారితో నామాటగా నిట్లు మనవిcజేయుcడు.

క మీతోcగొంతc బ్రసంగముc
బ్రీతిన్నలుపంగ నాకు వేడ్కయ్యెడిసేc
బ్రాతఃకాలమ వచ్చెదc
జేతున్మీయిష్టమట్లు చెన్నలరారన్.

వేగc దిరుగ జవాబులc గొనిరమ్ము.

వకీలు—చిత్తము. పోయివచ్చెదను రాజేంద్రా !

రాజు—(స్వాగతము) నామనోగతంబగు నాలోచన నీమంత్రితోc జెప్పితినా వల దు డుగుమనునేమో ? హైదరుజంగు తనతో రహస్యమున ముచ్చటించుటకు సమయ మొసంగకపోవునా ? ఏలాగునసైన నీహైదరుజంగుం దోడ్కొనిపోయి యాబొబ్బి లి గడీపైదింపవలె (ప్రకాశముగా) మంత్రివరా ! హైదరుజంగు మిగుల మంచివాc డుగాc గన్పట్టుచున్నాcడు. అన్నిసంగతులు మన యిష్టమట్లే యొనర్చునుగా !

మంత్రి—మంచివాcడుగనే చూపట్టెడిని రాజా !

రాజు—మనకిచ్చట నింకనెన్నిరోజులు పనియున్నది.

మంత్రి—మనవకీలు పనినంతయును సానుకూలపఱచుకొని వచ్చిన మనకిcక నేమిపని యున్నది.

రాజు—మనముచెప్పినట్లు వాcడీకొనునో లేదో ?

మంత్రి—ఇయ్యకొనవచ్చును.

రాజు—క. జాగయ్యె మనవకీలటు
వేగి మరలిరాcడు మంత్రి ! యేమిది ? కార్యం
బేగతి సభలో నెఱపెడి
నోగద ! దప్పింత గలుగకుండ మనయెడన్.

మంత్రి—అటుచూచి మహాప్రభూ! వచ్చుచున్నాఁడు.

రాజు—ముఖము తేటగనేయున్నది. కార్యము సానుకూలపఱచుకొనియే వచ్చుచున్నట్లు గన్పట్టెడు (వకీలు ప్రవేశించుచున్నాఁడు)

వకీలుగారూ! ఇట్లు దయసేయుఁడు (కుర్చీనిచ్చుచున్నాఁడు)

వకీలు—కూర్చుండి సేదదీర్చుకొనుచున్నాఁడు.

మంత్రి—మేఖవిలసితవృత్తము. రాజేంద్రా! చతురతమెయి యవనో

ర్వీజానిన్గని విశదపఱచి స

త్తేజస్స్ఫూర్తిని దెగువమనవకీ

ల్రాజద్రూఢిని రయముగవచ్చెన్.

రాజు—అవును నీవుచెప్పినది నిజమే. వకీలుగారూ! ఏమిసమాచారము?

వకీలు—రాజాగ్రణీ! దేవగణ పరివేష్టితుండగు దేవేంద్రునిపగిది నిఖిలరాజన్య పండిత లేఖక భృత్యనివహంబులో నక్షత్రమధ్యంబుననున్న నిశాకరుండువోలెఁ గూర్చుండి యున్న హైదరుజంగుం గాంచితిని.

రాజు—తరువాత.

వకీలు—క. నేవేగఁజని కళింగ

క్ష్మావిభుని వకీలననఁగ సన్మానంబు

న్గావించి సేమమారసి

మీవచ్చిన కతముఁదెల్పుమీ మాకనియెన్.

రాజు—తగినమర్యాద సల్పినాఁడుగా! తరువాత.

వకీలు—ముందుగఁ గళింగసర్కారులోఁగల జమాబందీ విషయమైన సంగతులు తర్వాతఁ దక్కిన రాజకీయపద్ధతుల గుఱించియు వారడిగినవానికిఁ దగునుత్తరంబుల ముచ్చటించితిని.

రాజు—తరువాత.

వకీలు—క. ద్వాదశలక్షల రూప్యము

లేదగ నెపుడిచ్చుపన్ను. ఇందునగంబి

ష్టీఁదలఁచితిమిఁకఁ గొదువను

గోదావరి మరలదాటకుండఁగమీకున్.

ఇట్లంటిని

రాజు—హాయిదరేమనె.

వకీలు—వల్లెయనె. తారునుశ్రీకాకుళము వచ్చుచున్నారుగాన నచ్చట నియ్యవచ్చుననిరి.

రాజు—సరే! ఇంతమట్టుకు బాగుగనేయున్నది. మంత్రివర్యా! వారచ్చటికివచ్చి మఱలి పోవునంతలో మనము సొమ్ము నియ్యలేమా?

మంత్రి—ఇవ్వవచ్చును స్వామీ!

రాజు—తరువాత నానంగతి యేమైనది.

వకీలు—తోదకవృత్తం. సలలితమాగతి సాహేబుతోడ
న్బలికితినే మృదుభాషల నాతోఁ
దెలిపినవార్తలఁ దెల్లముగావాఁ
డలరినరేయని యానతినిచ్చెన్.

రాజు—గీ. నీవెభో వకీలన్నను నిముషయుక్త
మందుఁగార్యంబువారితోఁ బొందుపఱచి
వచ్చితివి నీదుచతురత మెచ్చవచ్చె
డిని నిశాంతంబునందెల్లి పనివినియెద?

నీవలనఁ గావలసిన కార్యమున్నది. హాయిదరుజంగుతో నేను మాట్లాడునప్పుడు నీసహాయము నాకుఁ గావలె నొక్కతూరి తప్పకరమ్ము.

వకీలు—అట్లే వచ్చెదను స్వామీ! ప్రస్తుతము సెలవుఁగైకొనియెదను.

రాజు—పోయిరమ్ము. (వకీలరుగుచున్నాఁడు)

(అందఱును నిష్క్రమించుచున్నారు)

రంగము:—హాయిదరుజంగు కచ్చేరీ,

విజయరామరాజు వకీలు మొదలగువారు ప్రవేశించుచున్నారు.

విజయ—సలామ్ సాహేబుగారూ!

హాయి—సలామ్ రండు కూర్చుండుఁడు. (కుర్చీలఁజూపుచున్నాఁడు)

విజయ—ఆసీనుఁడగుచున్నాఁడు. (వకీలునుఁ గూర్చుండుచున్నాఁడు)

హాయి—రాజేంద్రా! ఏమివిశేషములు?

రాజు—మీదర్శనముకంటె విశేషతరమైనవెవ్వి?

హాయి—గీ. మీవిషయ పరిపాలనా కోవిదత్వ
మంత నిర్విశేషంబుగా నాలకించి

మీవిషయమై నుడివె బుస్సి మెచ్చుకొనుచు
మీ వకీలంతయుంజెప్ప భూవరేణ్యా.

రాజు—నాయందుఁ బరిపూర్ణానుగ్రహ ముంచుటఁబట్టి మాక్షేమమారయుచుందురు.

హాయిదరు—నిన్నటిరోజున మీరు వర్తమానమంపి యుంటిరే?

రాజు—సాహేబుగారూ ! అవును.

క. పనులెల్ల ముగిసెఁ దగమీ
పనుపున యవనావతంస! పదఁపడి పో మీ
యనుమతివడయుటకంటె నిఁక
కనుపమసత్కీర్తిధుర్య! యధికం బున్నే?

హాయి—రాజులందఱుఁగలసి పోయెదరా యేమి?

రాజు—క. ఈరాజమహీశులందఱు
నో రాజితకీర్తిధామ! యురుదూరమునా
తో రా రందందుఁ బ్రయా
ణారంభమునందు మధ్య నాగెదరుసుమా.

క. అంతంబువఱకు వచ్చున
నంతాకాంతుండు రాఁ డనంతయశోవి
క్రాంతా! యింతదనుక మీ
యంతికమున కదియుమీకునవగతమె కదా?

హాయి—వారెవరు?

రాజు—వారా? బొబ్బిలిరాజుగారు.

హాయి—ఎల్లెట్లూ! రాలేదుగా! ఏమీ? ఎందుకురాలేదు? సేవకా! నాగోజీరావు గారిని బిలుచుకొనిరమ్ము.

సేవ—చిత్తము స్వామీ. (అనిపోయి తోడుకొని వచ్చుచున్నాఁడు)

నాగో—సలామ్ సాహేబుగారూ!

హాయి—అందఱురాజులు జమాబందీకరుగుదెంచిరా?

నాగోజీ—బొబ్బిలివారుతప్పఁ దక్కినవారందఱు వచ్చియున్నారు. వారితోఁగలపని సర్వము పూర్తియైనది.

హాయి—బొబ్బిలివారు రాలేదని యేల మాతో చెప్పలేదు?

నాగో—ఇఁక వత్తురేమో ?

క. ఇప్పుడె వచ్చునొ లేకిం
కప్పుడె వచ్చునొ యటంచు నాత్మఁ దలఁచి నే
జెప్పకయుంటిని మీతోఁ
దప్పని మదిఁ దలఁప కుండఁడ దగఁ బ్రార్థింతున్.

హాయి—వారికి మాతాఖీదు పంపితివా ?

నాగో—పంపియున్నాను మంత్రివరా !

హాయి—మంచిది పొమ్ము. (నాగోజీరావు పోవుచున్నాఁడు)

విజ—సాహేబుగారూ ! ఎందుచేత రాలేదో నేనెఱుఁగుదును.

హాయి—కారణమేమొ జెప్పుఁడు.

రాజు—శ్రీకాకుళపు సర్కారులోఁగల జమీదారులలో బొబ్బిలివారుతప్పఁ దక్కినవారందఱు నీదస్తులోనికి వచ్చియున్నారు. వారుమాత్రము రాలేదు. వారు రారు.

హాయి—ఏమి కారణము ?

రాజు—(తనలో) నాకిదేసమయము. బొబ్బిలిరాజు దివాణంబువారికంటె నెక్కుడువాఁడని చెప్పినంగాని యీతురుష్కాగ్రణికి నుగ్రమైన కిన్క పుట్టదు. వైరిరాజు నెక్కుడుగఁ జెప్పుట నాకుందగిన పని కాదు. అయినన్నట్లు జెప్పినంగాని నామంత్రంబు ఫలింపదు. కాని మేలైన సరే. (ప్రకాశముగా) సాహేబుగార్లూ ! పద్మనాయకశిఖామణియగు రావుకులాగ్రణి దుర్వాగ్రహచండదోర్దండ ప్రతాపప్రభూతగర్వావిలచేతస్కుండుగాన దివాణంబువారిని సరకుఁగొనఁడు. వాఁడెంత ధన్యుఁడోకాని యెంతటిఖాన్నిఖానులకుం జడియండు.

హాయి—గీ. సరకుఁజేయఁడె ? కానిమ్ము తురకదెబ్బ
చవిఁగొనుంగాక భూరిప్రచండకాండ
దోఃప్రభావాగ్నికీలల దొమ్మి గాఁగఁ
బడి సమయునప్పుడే మత్ప్రభావ మెఱుఁగు.

రాజు—ఇంతేగాక శిస్తుపడవనీయఁడు. దస్తుఁగానియ్యఁడు. నిజమాడిన నిష్ఠురము. ఎందుకు ?

హాయి—ఏమేమీ ? ఇంకనెటువంటివాఁడు ? ఇట్టిగర్వమునకుఁ గారణమేమి ?

రాజు—సాహేబుగారూ ! ఆరాజు బహుపరాక్రమశాలి. అదే కారణము.

హాయి—అంతపరాక్రమశాలియేమి ?

రాజు—శా. రంగారాయ వరాపరార్జునుఁడు దోఃప్రావీణ్యమేపారి తా
రంగత్తుంగదురాపగాండివనిభోగ్రాభీలకోదండ మా
భంగప్రౌఢిమఁ దాల్చి ఘోరరణభూభాగంబున న్నిల్వఁగా
గంగానందనుఁడైనఁ గావుమనుచుం గైచాపు లర్పింపఁడే ?

ఇంతేగాక పాండవేయుల భుజాబలంబును గార్తికేయుని పరాక్రమంబును విబుధాపగాసూనునిమహిమయు మహేశ్వరునిమాహాత్మ్యమును విక్రమార్కుని వీర్యాతిరేకంబును బరశురాముని పౌరుషంబును సంగ్రహించి విరించి మించి యీబొబ్బిలివెలమదొరల నిర్మించెనని తోఁచుచున్నది.

మత్తకోకిల. రంగదున్నిజఖడ్గరాహువు రాజమండలి మ్రింగ న
త్తుంగశౌర్యవిభావసుం డలదోర్బలాంధతమంబులం
భంగపెట్టఁ దదాజ్ఞకూలము పౌఁజుసంద్రము నట్టఁగా
సంగరంబున రంగరాయని సైఁచువా రెవ రుర్వరన్.

హాయి—రాజా ! ఈబొబ్బిలిరా జస్మదపారఘోరాభీలశతఘ్నీకారావంబెఱుంగఁడు సుమా ! ఈరాజులుగీజులు మదాగ్రహానలమునకు శలభమాత్రులుసుమా ?

పంచచామరము. అరాతివీరవారమెల్ల నాకులంబుఁబొందమా
ఫిరంగికాఱుచిచ్చు వైరివీరసైన్యవన్యముల్
దురంతరీతిఁ జుట్టుముట్ట దుర్మదంబు వీఁడి మా
పరాసుఁజేని శక్తియుక్తి పౌరుషం బెఱింగెడిన్.

రాజు—స్వామీ ! అరిరాజన్యపుంగవహిరణ్యాక్షులు బొబ్బిల్యుర్వీధవమార్తాండసహస్రతేజోవిరాజన్నారసింహులకుఁ దృణప్రాయులుజుఁడీ మీరెట్లూహించుచుంటిరో ?

హాయి—విజయరామరాజుగారూ! మీది వట్టిపిచ్చియూహ. మాఫిరంగిమండలంబుల ఘుటికానికాయంబునకుసిఖహాసరదారుగా రంతటివారే కాందిశీకులైపోవుచుండ నీబొబ్బిలిరాజన నెంతటివాఁడు ?

గీ. తురకదొరలము మాతోడి దురుసదేల ?
భూమిబ్రతుకంగఁగలయిచ్ఛ వోడమి యున్న
నస్మదాగ్రహవహ్నికీలాళి యందుఁ
బడక యుండఁగవలెనుసు పార్థివేంద్ర !

రాజు—కాని యీబొబ్బిలిరాజన్య మూర్ధన్యులు చిన్నతనమునుండియు శౌర్యమే యుగ్గుగాఁ ద్రావింపఁబడి పెంచఁబడినవారు. కాననేవారికింతశౌర్యము.

హుయి—మేముతక్కువవారమా ?

సీ. క్షణమాత్రమునఁగాదె జడిపించి విడిచితి మాళవచోళ నేపాళనృపులఁ
జేరుదప్తుకుఁగాదె జేర్చినవాఁడను శకసింధుఘూర్జరాశ్మంతపతులఁ
ఖయిదుఁ జేసితిఁగాదెఖాన్ బిరుదగుదార మరహాటకర్ణాటమత్స్యపతుల
శిక్షఁజేసితిఁగాదె శీలమేపారంగ నాంధ్రబర్బర పుళిందాధిపతుల

గీ. వీరికంటెను బొబ్బిలి విభుఁడు ఘనుఁడె
డక్కనుపఠాణి సేన నుద్దండ భీమ
ఖండనంబునఁ జెండాడు దండి తురక
బోరలమగుమాకు హిందువుల్బరమె ? రాజ !

రాజు—సాహేబుగారూ! మీకాగ్రహమువచ్చునని జంకుచుంటింగాని నాయూహాలో రంగరాయనికిఁ జాలిన రాజన్యగ్రామణు లెందునఁగానరారు.

గీ. అతనిఁజేరిన తృణమైన నతిఘనమ్ము
నమ్ము నామాట నిజముగ నమ్ము సేయ
రాదు రాజునకేగాదు రాజనమ్ము
జూడఁ దత్సేవకాళికిఁ గూడఁ గలదు.

ఇంతేగాక.

ఉ. బెబ్బులిమీసమైన వడిబెట్టియు నుయ్యెల లూగ వచ్చుఁ బె
న్నిబ్బరమైన నెమ్మది ఫణీంద్రుని కోరల నూడ్చవచ్చు లో
నబ్బురపాటుజెంద నిసుమందునఁ దైలముఁదీయవచ్చు న
బ్బొబ్బిలికోటపై విడిసి పోరఁగరాదిల నెట్టివారికిన్.

హై—ఇట్టిపిచ్చిప్రతాపంబులావర్ణించుట? మాసంగతిఁదెలిసియుండియుమీరిట్లువలుకనేల?

రాజు—అయ్యా ! మీరతనిఁజూచినంగాని నమ్మఁజాలరు.

హుయి—గీ. ఏల వాఁగెదవ వాకోట నేలకూలదె ?
వారిశౌర్యాతిరేకంబు వారిమహిమ
దెలిసియుండియు మావిభు తేజ మల్ల
మాశతఘ్నులవేగంబు మాబలంబు.

మాపరిభావం బాభూరమణుతోఁ జెప్పకపోతిరా?

రాజు—అతనినిబల్లకీయెక్కి నాకోట చెంతనైనఁ బోనియ్యనే! వానితోనెట్లు మాట్లా డెదను?

హయి—క. ఆరాజెప్పటికైనను
మాఱాటము బూను మదిని మారాముమెయి
న్బోరామిదేల నాకుం
బోరితమున వాని పొలుపుఁబొలియింతు నొగిన్.

వాని నూరక పోనిత్తుమే? రంగరాయనిదోశ్శక్తి యుఁ బరాసులపోని వీర్యాతిరేకం బుఁ జూతువుగాని.

రాజు—(తనలో) అదేనాయభీష్టము. వీనికి కోపానలము హెచ్చుచున్నది. చల్లా రకుండ నప్రియ వాగాజ్యధార గురియించితినా నాపని నెఱవేరును. (ప్రకాశము గా) ఒక రంగారావే యనుకొంటిరా? అతని తమ్ముఁ డన్నను మించిన పరాక్ర మశాలిసుమీ.

మత్తకోకిల. రంగరాయనితమ్ముఁడెంతయు రంగదాహవకేళిలో
నింగిముట్టఁగ నార్వఁగా నివినిద్రవైభవమేర్పడన్
భంగపాటొదవంగ మీపటుపారసీకపు సైన్యమా
సంగరంబున నిల్వనేర్చునె సాహెబాగ్రణి! ధీరతన్.

హయి—ఇదేమివెఱ్ఱి?

క. బూసిసమానులు మీలో
బాసాడన్గలరె? వారిబారాది బలు
ల్లానూఖానుని మొక్కని
శానలు వినినంతఁ గలనఁ బాఱరె చెపుమా.

గీ. ఇట్టిగర్వాతిరేకంబు నెదను బూని
మా కమానునమొనరించెగా కలుకక్కొ
మనదె మాయెద? జూతువు మాబలంబు
వానిబలమును బోరాడఁ బార్థివేంద్ర.

మ. స్ర. దండిం దద్బాబ్బిలిక్ష్మా ధపుల నిజభుజాదండ కోదండనిర్య
చ్చండాఖిల ప్రకాండచ్ఛదనగుణఘృణీచండరుక్కాండపజ్క్తిన్

శుండాలంబేర్చి కాన న్జొరబడి తరుపు ల్పుక్కఁ జక్కాడు రీతి
న్బిండింగావించి వైతు న్బిరుదుమగల బొబ్బిల్గడీ నుండ కుండన్.

రాజా ! వీరిద్దఱేనా బొబ్బిలిలోనున్నవారు?

రాజు—తురుష్కాగ్రణీ ! ఇంతేకాదు. రంగరాయాగ్రణి చెలికాఁడగు చెలికాని వెంకయ్య ప్రతాప మాధనదుని చెలికాని దోర్వీర్యంబును మట్టుపెట్టు ననుటకు సందియములేదు. అందఱిని మించినవాఁడొక్కరుఁడు గలండు.

హుయి—వాని పేరేమి ?

రాజు—వాని పేరా ? తాండ్రపాపయ్య. వాఁడొక్కరుఁడు బొబ్బిలికోటఁ గాయఁ బెరవీరుండచ్చటఁ గాలుమోపఁగలఁడా ?

క. ఊరురులకాసించిన నా
యనమాన ప్రతాపవంతుఁ డగునాతనితో
మనఁగుట పోఁబ న్నానుచు
మనలుటయే యెరికైన మానిత మధిపా.

హుయి—(వ్రేలుఁగఱచుకొనుచు నాగ్రహముతో) లాడూఖాన్, హసనల్లీఖాన్, లా, రాసు మొదలగు మేటివీరులఁ జూచియుంటిరి గాదా ? వీరిలో వా రెన్నవవంతు ?

రాజు—ఇంతటితో నేమైనది. దామర దమ్మన్న, కాకర్లపూడి వెంకటరాజ భూజానుల పరాక్రమంబా విన్వచ్చు నికెఱుక. ఇంతెందుకు.

గీ. తెల్వియుత్తేమ్ము లొకట హత్తించి నట్లు
బొబ్బిలి గడీని జేర్చెఁబో బెబ్బులితతి
నంతయున్ బ్రహ్మ వారెంత యమితపుణ్యు
లహహా ! బొబ్బిలి యెంత పుణ్యంబు సేసె.

హుయి—వీరందఱును గల్గిరను గర్వముచేతనే కాఁబోలు మదాజ్ఞోల్లంఘనంబా రాజు మూర్ఖుండొనర్చె. అందుకు ఫలమాతఁడనుభవింపక తీరదు. నీవును దుర్వార పరాక్రమశాలివే నే! ఏమియుఁ జేయలేక యూరకుంటివే ? ఆ వెలమ నీకంటె బలాఢ్యుండొకో ?

రాజు—క. వాఁడెంత నాకుఁ దలపం
బోఁడిమి మెయి నిముషముననె పాలియించెదసూ

కోడిగము కాదు పూనికఁ
జూడుమిపుడె వానిపురము చూరగొనియెదన్.

దివాణమువారి కారాజొనర్చు దుర్మార్గములఁ జెవివేయకుండ నేమియు నొనర్పరాదని యూరకుంటిని. సెలవిండు. ఆపైఁజూడుఁడు. వానినేమి సేతునో. దివాణమువారి నెదిరించిన దివాణమువారే దండింతురు. నీకేలనని జనులు నన్నుఁ దూలనాడుదురు. కాకున్న నాకెంత. నాకుజడిసియే కదా నాకోట గుమ్మమెదుర నడువనోడును ?

హాయి—అట్లయిన మాలావుఁ జూతువు గాని.

రాజు—ఏమిసేయ నెంచితిరి ?

హాయి—గర్విష్ఠియై మాయాజ్ఞలను లక్ష్యము నేయక తనలావుఁ జూపింపనేకదా బొబ్బిలిరాజు ముత్తిల్లి మమ్మవమానపఱచె ?

క. హల్లాచేయుదు బొబ్బిలి
ఖిల్లాలోఁగల్గుదొరలఁ గీర్తివహింతున్
జిల్లాబొబ్బిలి సూడని
యల్లాచరణంబులాన యదినీకిత్తున్.

రాజు—ఆత్మను మిగులహర్షించి (తనలో) నాపుణ్యము బాగుగ నున్నది. ఈపరాసులతేనికి నుగ్రమైన యాగ్రహముఁ దెప్పించితిని. వీరిమూలముగ బొబ్బిలి కోట నాశంబునొందించి యారాజ్యము నా వశంబు గావించుకొందును. ఈతురకలు ధనకాంక్షగలవారు. విశేషధనము నాసపెట్టితినా నాకీ యుపకారముఁదప్పక యొనర్తురు. (ప్రకాశముగా) యవనావతంసా!

క. అటులైన నిత్తుఁజూవే
పటురభసముతోడ మీకు బాళి తుదంటన్
దటుకున లక్షలు పదిరెం
డటె నా టెక్కియము సెత్త నలవఱచిన చోన్.

హాయి—మంచిది. ఆమాటలు నిలుపుకొనుము. (తనలో) ఈరాజు పన్నెండు లక్షల నిత్తునని వాగ్దాన మొనర్చుచున్నాఁడు. కానిమ్ము. ఆదేశము నీరాజువకిచ్చెదను (ప్రకాశముగా.)

క. నీకిచ్చెద నారాజ్యము

ప్రకటముగఁ దలను బుఱ్ఱ వాడక యుండన్
శ్రీకరుని జేతు నట గో
త్రాకాంతా! యనుము మగుడఁ దగ నామాటన్;

రాజు—రంగరావుని గెల్చి బొబ్బిలికి నన్నభిషిక్తునిఁ జేసిన మీకుఁ బన్నెండు లక్షల నుపాయనంబిత్తు.

హయి—మంచిది. నీయభీష్టానుసారంబుగ నిన్ను బొబ్బిలి కధికారునిగఁ జేతు నాతమాషా దేఖో!

రాజు—(సంతోషించి)

మ. అలఘుప్రాభవ శౌర్యశాలివగుదీ వట్లెంతయు న్నేడు నీ
కిలఁ దుల్యుండు గలండె ధైర్యమున నేఖిల్లాలఁ గన్గొన్న? నీ
తులువ న్గెల్చుటదెంత మీకుఁ దలఁప న్దండంబుచేఁ దుంగము
న్నల వీఁకన్నెకలించినైచు మదభూదారంబు చందంబుగన్.

పారసీకాగ్రణీ! నీవట్టివాఁడవేగాని వారు సామదాన భేదోపాయంబులచే నజేయులు సుమీ. చతుర్థోపాయంబగు దండోపాయంబే కర్తవ్యము. దానిచే తంగాని సాధ్యుండు గాఁడు.

హయి—మమ్ము సరకుఁగొనక తిరస్కరించు వానితోనా మాకు సామ దాన భేదోపాయంబులు. నేనన్నమాటఁదప్పక జరిపి తీరువాఁడ నానత్యసంధత నిరీక్షింతువు గాని.

రాజు—గీ. పలికి బొంకరు మీవంటివారు భువిని
నిగ్రహానుగ్రహంబుల నెలవుపట్లు
మీరు యవనావతంస! మీ మేటిగుణము
లెన్న వశమౌనె యావేల్పుమిన్నకైన?

అయిన నట్లుచేతుమని సమయం బొనరించుకొంటెందులకు మంచిది.

హయి—రాజా! సర్వదిఙ్మండలీ విభ్రాజిత యశోధారేయుండ నగు నాయట్టివానికి రెండునాల్కలు గల్గునా? అయిన నీవు కోరితివి గాన

మత్తకోకిల. కత్తిముట్టి చెప్పుచుంటిఁ గాన భీతిఁ దక్కుమా
రిత్తమాటగాదు భూవరేణ్యా! నమ్ముమింక నీ
చిత్తమందు సంతసంబు జేర్చు మల్ల బొబ్బిలిన్
పొత్తుగాఁగఁ జేతు నీకుఁ జూడుమా లఘుక్రియన్.

రాజు—(తనలో) నాకోర్కె నమకూరునట్లున్నది. బుస్సీ యేమనునో. (ప్రకాశముగా) హయిదరుజంగు సాహేబా! బుస్సీ యీకొనునా?

హయి—క. మేమెంతచెప్ప నంతయు
భూమాన్యచరిత్ర! జరుగుc బోడిమి మీఱం
గా మంత్రులు సెప్పcగ వినc
బోమనియెడి నృపులు గలరె భూస్థలినెందున్.

(రహస్యముగా) ఇప్పటి నరపతులను జూచుచుంటిరి గదా? వారు గొప్ప యుద్యోగస్థులన్నమాటయే గాని వ్యవహారవ్యక్తత పూజ్యము. వారు కచ్చేరీ మొగమే యెఱుంగరు. మేమెంతచెప్పిన నంత జరుగcగలదు. వారుగారు ఖామందులు నేను. నీకెందుకు?

రాజు—సత్యము. ఇcక నే ననుజ్ఞ వడయుదునుగాక.

హయి—మంచిది పోయిరమ్ము.

రాజు—(తనలో) ఈసంగతిని బూసీతో హయిదరుజం గీరేయి జెప్పును. అర్థకాంక్షcజేసి నాయుద్యమంబున కంగీకరించియున్నవాcడు. నేను ముందుగcబోయి పెద్దాపురమున నుండెదను. (ప్రకాశముగా) పారసీకాగ్రణీ! నాకీరేయిc బెద్దాపురముబోవ సెలవిండు.

హయి—అట్లనే జేయవచ్చును.

రాజు—సలామ్

హయి—సలామ్

రాజు—(నిష్క్రమించుచున్నాcడు)

(బుస్సీ ప్రవేశించుచున్నాcడు)

హయి—(లేచి) సలామ్. ఫరాసువంశాగ్రణీ!

బుస్సీ—సలామ్. మంత్రిపుంగవా! ఈమాకామున జమాబందీ పూర్తియైనదా?

హయి—స్వామీ! విజయరామరాజాదిగా శ్రీకాకుళంబునంగల సమస్తదేశాధీశ్వరులు వచ్చియున్నారు. వారితోడంగల కార్యము లన్నియు ముగిసినవి.

క. నీవడుగుకతనc జెప్పం
గావలసెను బొబ్బిలి భువికాంతుcడు దక్కం

గావసుధావరులందఱి
దే వచ్చిరి యాతఁడెట్టి దిట్టఁడొ తలఁపన్.

బు—అదేమి ? కారణంబారసితివే ?

హాయి—ఏమని చెప్పుదును. ఈజమీదార్లలో బొబ్బిలిరాజు ప్రతాప వీర్యాతిరేకంబుల ఘనుండఁట.

గీ. నిష్ఫలంబయ్యెఁ దాఖీదు నింద్యమయ్యె
వానియభిమతమేఁగంటి వాఁడె సర్వ
భూమిఁ బాలించునఁట నింకఁబూనిక్రౌ—తోడఁ
జెలఁగి రాపాడి పోరితములను మనల.

బు—ఏమీ ? ఆరాజునకిట్టి సామర్థ్యంబు కలదా ?

చ. ఎఱుఁగఁడొ ? రంగరావు నను నెల్లపరాసులతోఁడు బుస్సియం
చెఱుఁగఁడొ ? మాపరాక్రమము లెంతయుఁ బావకమూర్తులంచు వాఁ
డెఱుఁగఁడొ ? మాశతఘ్నిజలభృన్నిచయోర్జితరావమేర్పడన్
బరిగత ధ్వాంతమీ నినద ప్రస్ఫుటితార్భటి యాజిరాజిలన్.

హాయి—మన బాహుశక్తిఁ దెలియక యిట్టి వెఱ్ఱియూహంజేసి యున్నాఁడు.

బు—మనబలం బాతనికిఁ దెలియఁజెప్పిన వచ్చి మన పాదాక్రాంతుండగునేమో ?

హాయి—ఆసందేహమును విడిపోయినది. తనవలెనే భుజపరాక్రమశాలులగు తమ్ముఁడు లోనగు ననేక వీరులు చెంగటనుంటంజేసి సామాద్యుపాయంబుల వశుఁడగు నట్లు లేదు.

గీ. నమ్మఁగారాదు సుమి యిట్టి నరపతులను
జేతురెపుడైనఁ గూడని సేతలిపుడ
గరువమడఁగించినంగాని కాలమరుగ
సాధ్యుఁడగునంచు నేనెంచ సామి ! నిజము.

బు—హాఁ ? పరాసులజేని కోపాగ్నియందు
దైవప్రేరేపణముచేత రావు వంశ్య
శలభతతి మగ్నఁగానుండ జగతిలోన
నన్యథా యెట్లు జరుగఁగ నౌను చెపుము.
ఇందుకు నీవేమి యాలోచించితివి ?

హాయి—నేనును సామ దాన భేదోపాయంబుల సాధ్యమగువఱకు రణముఁ దప్పింప నెంచితినిగాని వ్యవహారసరళి మీఁదుమిక్కుటముగ వచ్చినది.

క. మన దార్ఢ్యం బీవెలమలు
గనఁజాలరు దిట్టతనము గలదంచును నే
రినిగాని జీరికింగొన
రనవద్యచరిత్ర! మన్నెయధిపులమనుచున్.

వీరును కేవలముదుర్బలులుగారు సుమా!

క. ఆమన్నీనిం గన్గొన
భీమభయంబొదవు మదిని వీరతతికిన్
సీమగలారికి నిక్కువ
మామన్నియ పులియటంచు నడరెద రధిపా.

వారు నిజముగ మనకుఁ జాలకున్న నితరులకు బెబ్బులిపాళ్ళియులనుటకు సందియము లేదు. వారిలోఁ దాండ్రపాపయ్య బహుబాహుబలశాలి.

బుస్సీ—ఆహా! ఇప్పుడేమిసేయుదము? నిన్నడుగనేల. దండోపాయమె కర్తవ్యము అది తప్ప వేఱేమున్నది? ఇట్టి గర్వగ్రంథుల గంధమడఁగించినంగాని మనకు క్షేమము లేదు.

హాయి—విజయరామరాజు ద్వాదశలక్షుల రూప్యంబుల బొబ్బిలిఁ దనకిచ్చిన నిత్తునని వాగ్దానము సేయుచున్నాఁడు. అట్లొసఁగిన నావీరుని గెల్చినవారమును బలవంతుని జేపట్టినవారము నగుదుము. ఇది యుక్తియుక్తముగ నుండునేమో?

బుస్సీ—బహుచక్కగనున్నది. పైగా ద్వాదశలక్షుల రూప్యంబులు గూడ సమకూడె. హిందుస్థానములోని పరాసుదొరతనమువారికీసమయమున ధనముఁగూర్చితిమా వారు బహుసంతసింతురు.

క. ద్వాదశలక్షుల రూప్యఫ
లోదయజయలక్ష్మి వలసి యూరక తనుదా
నాదటవచ్చిన మనమిఁకఁ
గాదని త్రోయంగఁ బురుషకారమె చెపుమా.

గనుక నీయాలోచన గణ్యమైనది.

హాయి—నేనైన నిప్పుడే తొందరపడనుసుమా. ముందుమహాముక్తైన వచ్చి సకారణముగ క్షమాపణఁగోరిన విడుచువాఁడనే.

బుస్సీ—అట్లు చేయఁదగినదే. అయిన నింకొక యుత్తరువునంపుము.

హాయి—అప్పుడును రాకున్న నేమి సేయవలె సెలవిమ్ము ?

బుస్సీ—అట్లైన మనమనుకున్నదే మార్గము.

హాయి—నాగోజీరావుగారూ ! ఇటురండు.

నాగో—ఏమి సెలవు? మంత్రివర్యా !

హాయి—ఆజ్ఞాపత్రికను వ్రాసి బొబ్బిలిరాజునకంపుము.

నాగో—అట్లనే చేసెదను స్వామీ. (అని వ్రాసి నౌకరుం జూచి) సేవకా ! నీవుపోయి బొబ్బిలిరాజునకీపత్రిక నిచ్చిరమ్ము.

సేవ—చిత్తము దేవరా ! (అనిపోవుచున్నాఁడు)

హాయి—బుస్సీగారూ !

గీ. విజయరామరా జగు నిల విజయరామ
రాజు సుమి రాజవరులలోరా జితండు

బుస్సీ—నిజము హైదర ! నీమాట నేనెఱుఁగుదుఁ
బాదుసాతోడఁ బోరెడిపట్లవాని.

హాయి—హిందూరాజులలో మిక్కిలి యౌదార్యవంతుఁడును శౌర్యశాలియు బలవంతుఁడును.

బుస్సీ—నిజము. (అని నిష్క్రమించుచున్నాఁడు)

హాయి—సేవకా !

సేవకు—దేవరా ! ఏమి సెలవు?

హాయి—నీవుపోయి చమూపతిం దోడ్కొనిరమ్ము.

సేవ—(పోయి వెంటఁగొనివచ్చుచున్నాఁడు)

చమూ—సలామ్ స్వామీ యేమి సెలవు?

హాయి—కొంతమంది సిపాయీలనంపి బొబ్బిలి నల్దిక్కులారసి వీథుల గొందుల సందులనెమకి జంగల్ ఝాడీ మైదానంబులఁ గలయంగనుంగొని కోటత్రోవలఁ బరీక్షించి బురుజుల సేనల ఫిరంగులఁ జూచి కానల కోనల సీమల నవలోకించి వేగరమ్మని చెప్పుము. పొమ్ము.

చమూ—మహాప్రసాదము స్వామీ. అట్లేయొనర్తును.

(అని పోయి సిపాయీలఁ బంపుచున్నాఁడు)

(అందఱు నిష్క్రమించుచున్నారు)

శ్రీ రంగారాయకదన సమవాకారము.

ద్వితీయాంకము.

రంగము :—బొబ్బిలిలోనివీధి.

(వెంకటసోమయాజులు, రామశాస్త్రి ప్రవేశించుచున్నారు)

వెంక—రామశాస్త్రీ! విశేషములేమి? దివాణములో వివాహములంట యెప్పుడు? నీవు వారి పురోహితకోటిలోవాఁడవేగాన నీకుఁదెలియకపోదు.

రామ—సోమయాజులుగారూ! ఈనెలలోనే ముహూర్త మేర్పఱచినాము.

వెంక—శాస్త్రీ! ఇదిగో. మహారాజవు. నామాట మఱచిపోకుసుమీ. ఈమధ్య యజ్ఞము చేసినాను నీవెఱుఁగుదువుగా.

రామ—జన్న మొనరించితిరా? ఇంకేమి? కాని మన మదృష్టవంతులముగాము. ఈ వైవాహికములలో మనదరిద్ర విచ్ఛేదనుగును గాని దైవము వేఱుగాఁ దలంచుచున్నాఁడు.

వెంక—నీమాటలవలన నేదో యాటంకము గల్గినటులఁదలంచెద. చెప్పుము.

రామ—ఇంకెందుకు. పుట్టెడాసపెట్టుకొన్నందుకు నిష్ఫలమైనది.

వెంక—నేనేరితోడను జెప్ప నదేమో సెలవిమ్ము.

రామ—మనదేశాధిపతులైన బుస్సీదొరవారు రాజమహేంద్రవరమువచ్చి జమీదార్లకం దఱకు వార్తలనంప నందఱికంటె ముందు విజయరామరాజుగారేగి పన్నెండు లక్షలు లంచమిచ్చి బొబ్బిలికోటం దనకుఁ గలుపుకొను విషయమై తనగిన యేర్పాటు హైదరుతోఁ జేసికొనెనఁట. ఈరోజుననో రేపో వారందఱిటకు యుద్ధసన్నద్ధులై వచ్చుచున్నారఁట.

క. కొండెములు సెప్పి మిక్కిలి
గండం డని రాజు మిగులఁ గార్పణ్యముతోఁ
జెందుకొని మొగము వారికి
గఁడువిరోధునిగఁ జేసెఁగాదే నృపతిన్.

ఏమిచెప్పను? ఈమాట వినినప్పటినుండియు నామనంబు స్థానంబు వాసె.

సోమ—క. నిర్భాగ్యుల మనఁదగుదుము
గీర్భామాధవుని వ్రాలు గెలియొనర్పన్
దుర్భరము. చూడుమీ రా
ట్సర్భూపతికెట్టికీడు సమకూడినదో?
విజయరామరాజే యొనర్చెనా?

రామ—సమస్తబాంధవులరుగుదెంచియున్నారు. కోటలోఁబెండిలిపనులు జరుగుచున్నవి. పురిజనులు నుత్సాహముమీఱియున్నారు. ఇంతలోనింతపుట్టినది.

వెంక—మనరాజుగారిమధ్య రాజమహేంద్రవరము చనుదెంచెదరని విన్నామే. ఏల పోలేదు?

రామ—ఈరోజుననే బయలుదేరనైయుండఁగా నీవర్తమానము యాతాయాత పథికజనవ్రజంబుచే జూచాయఁగఁ దెలిసి మనతేఁడు నాసికాగ్రంబునఁ గొనవ్రేలునునిచి యారాజానర్చిన యొగ్గుం బహుభంగుల నుగ్గడించుచుఁ బ్రయాణంబు మానినారఁట. నేను నాపాంథుల వలననే వింటిని.

వెంక—అయితే కార్యము లాపుదల కావలసినవేనా?

రామ—క. మునుమున్న పోరు సాఁగఁగఁ
గననెట్లగు నిఁకను బెండ్లికార్యంబులు నే
ననుకొంటి దైన్యమఱునని
మనభాగ్యము లిట్టులుండ మఱివేత్రెట్లా.

వెంక—ఎన్నిపెండ్లిండ్లు గాఁదలఁచియున్నవి కోటలో?

రామ—దాదాపునూఱు. అన్నియు వారివి వారిబంధువులవి.

వెంక—విజయరామరాజునకెట్టి యపకారమొనర్చె మనరాజు?

రామ—మనరాజన్న నాయనకెప్పుడు నసూయయే.

వెంక—ఇంతేనా కారణము?

రామ—క. గిరినిర్ఝరములనాఁగఁగ
బిరబిరమనవారు, వారుబిరుసుఁదనంబుం
బఱపిన, వారినిమట్టిరి
చురచురమనఁబోలు రాజచూడామణికిన్.

వారిదేశమునుండి పాఱుకాల్వల వారడ్డముకట్టికొనఁగూడదా?

రామ—ఇదివఱకు నాదినుండియు నూరకున్నహేతువుచేఁ దప్పసినరినైనది. ముందు

సందిచ్చినఁబర్యాయంబున "నేకుమేకైబిగియును" గదా.

వెంక—గీ. తనకుమాలిన ధర్మంబు దగునె యెట్టి
పనుల. మనకాల్వలేమి? యామనుజులడ్డ
గింత యదియేల? యాభూమికాంతుఁడెట్టి
కార్యముగిఁజేసెఁ గూడని కర్జమనక?

అటువంటివైరుధ్యకులున్న ముఖాముఖీని బొత్తుపఱచుకొనవలెఁగాని యిట్టిపనినా యారాజశేఖరుండు సేయవలసినది? పరశ్రేయము నోర్వవలదా?

రామ—సాధించు సాధనంబుఁ జింతించి చింతించి తుదకిట్టికార్యమాచరించె. కానిమ్మె మిజరుగునో చూతము. (అందఱు నిష్క్రమించుచున్నారు)

రంగము : బొబ్బిలిరాజుసభ.

(రంగారావు, బంధువులు, మంత్రులు, మిత్రులు నౌకరులును ప్రవేశించుచున్నారు)

రంగా—మంత్రులారా!

మంత్రి—మహాప్రసాదము స్వామి.

రంగా—చారులు వచ్చిరా?

మంత్రి—ఇదె తమదర్శనమునకరుగుదెంచుచున్నారు రాజేంద్రా.

(చారులు ప్రవేశించుచున్నారు)

చారు—జయజయమహారాజ! రాజన్యానేకపసింహా! మహావైభవదేవేంద్రా! రావు వంశ కలశపాథోధి సంపూర్ణసుధాకిరణా! రంగారాయ కుంభినీ వల్లభా! పరాక్.

రంగా—వార్తలేమిరా?

చారు—మహారాజా! ఏమనిచెప్పుదుము. నుడువుటకు నోరురాకున్నది?

రంగా—నాకు నిప్పుడే తెలియవచ్చినది. మీకుఁదెలిసినది వాక్రుప్పుఁడు.

చారు—దేవరా! సరకారులభారంబు వహించి బుస్సీదొరవారును, వారిమంత్రిపుంగవులగు హైదరుజంగును గడచిన డిశంబరు నెల 19 వ దినంబున రాజమహేంద్రవరంబుఁబ్రవేశించియున్నారు. అచ్చటికి విజయరామరాజాదిగాఁగల నరపతులునువచ్చిరి. ఆరాచమిన్న హైదరుజంగుతోఁ దమపైఁ గొండెములుసెప్పి యాఖానుద్దమకు బలవద్విరోధునిగఁజేసె. అంతేగాక యాతని వలన 12 లక్షలు లంచమొంది బొబ్బిలి కోట నిత్తునని విజయరామరాజుతోడఁ గత్తిముట్టి హైదరు వాగ్దానముఁజేసియున్నా

డు. వారందఱును బయలుదేరి మనకోటపై రేపో నేడో విడియనైయున్నారు. ఇది
య రాచకార్యము.

రంగా—ఏమిదురాగతము? చూచితిరా మంత్రులారా! మిత్రులారా! దీనినవలో
కించితిరా? చారులారా! వారెప్పుడెచ్చటనున్నారు?

చారు—స్వామీ! రేపు పెద్దాపురము వెళ్ళనైయున్నారు. అచ్చటనుంచి ఖాసింకోట
పోవుదురఁట

చె. వెంక—ఇట్టి క్రూరకర్మమూరాజునకుఁదగదు.

రంగా—ఉ. త్రాఁచువిధంబునం విజయరాముఁడొనర్చిన నీచకృత్యము
స్జూచితె తమ్ముఁడా! తగదుసుమ్మిది ఛీ యనకే తురష్కుఁడిం
తౌచితిలేక వాని విని యానని చేసిన యాప్రతిజ్ఞయున్
సైఁచెదరే యధర్మములఁ జచ్చినఁజత్తురుగాని యుత్తముల్.

నరస—పౌరుషశాలియౌ రంగారావు వెనుకదీయునని యెంచెఁగాబోలు.

పాప—నావోస్సామర్థ్యంబుసూపఁ గాలంబు తటస్థించినది.

రంగా—సభికులారా!

ఉ. రాజవినీతుఁడైనను బరాసులతోనికిసైనఁ గల్గదే
పూజితమైనబుద్ధి? తగుపాత్రా నరించుట మేలుగాని యు
వ్యాజముగాఁగ నిట్లుదగవా పగవారలతోడఁ గూడి యీ
యోజ మహోపచారముల నొప్పమి చేయుట? మెత్తురే జనుల్.

మంత్రి—కూడనిపని రాజా!

రంగా—అమాత్యశేఖరులారా!

గీ. చూడఁబోవుదమూఖాను జాడకను చుఁ
దగిన జతనంబుమీఱ నందఱముసుండ
నింతలో నెంతపుట్టెనో నేర్పరింపుఁ
డయ్య యటకేగుటది యిప్పుడగునో కాదో?

మంత్రి—రాజా! అట్లుపోవఁజనదు. వకీలునేరినైనఁబనిచి తెలిసికొనినంగాని పోరాదు. శౌర్యమున్నమనతోఁ బోరవలెఁగాని మసలిమానుతోఁ జెప్పకొనవలెనా? తనంతటఁ దాజయించినఁబౌరుషము పరాసులశరణు వేడుటేటినదువడి? ఏమిప్రతాపనిధి విజయరామరాజు! ఇంతతగవు మాలినయుద్ధంబునకుఁ దొడ్పడుటకాబుస్సీ యెట్లీకొనె.

గీ. తగవుఁదప్పకనీతివర్తనముచేత
మనల వారల సమదృష్టిఁగనిన సరియె
మనదివాణంబువా రట్లుమదినిఁబూన
రేని సమరంబుదప్పదుపో నిజంబు.

రంగా—అదినిజము మంత్రిపుంగవా ! మనమేనా తీసిపోవువారము. హైదరద్దుపడని మ్మ్ము పురారియడ్డుపడనిమ్ము. గెల్చిరావలె చచ్చిపోవలె. (మీసముపైఁజెయివైచికొని తలపంకించుచు.)

శా. రేచెర్లాంచితగోత్రసంభవులు నిర్నిద్రప్రతాపక్రియా
వ్యాచష్టాత్ములు రావువారు హరుఁడేనన్యాయయుద్ధంబునం
కోచంబొందకజేయవచ్చిన మహాఘోరాస్త్రవిద్యాధిక
ప్రాచుర్యంబునుజూపకే మగిడిపోవం జూడ రొక్కింతయున్.

కానిమ్ము కానున్నదికాకమానదు వట్టిబీరములిప్పుడేల ?

కం. వైవాహికకార్యములీ
సావి ననేకములఁదలఁపఁ జాగయ్యెనుగా
పోవంగనటకు సచివా !
యీవసుధాజాని యెట్టి యపకృతిఁజేసెన్.

ముందేదండోపాయమునకుఁ గడఁగుటకంటె మఱియొకరీతిఁజేసిన నాపరాసులకేఁ డిట్టియుద్యమంబుమాననేమో ?

మంత్రి—మొదటనేయుద్ధముకంటె సామదాన భేదోపాయంబులఁ గార్యంబుల సమకూర్చుకొనుట బహుశ్రేయోదాయకమును, రాజనీతియు గడుసుఁదనమును గాదా ? అదేమో సెలవిండు.

రంగా—అమాత్యవరా ? ప్రస్ఫుటధృత్యట్టహాసనిరస్తసురాలయ హిమవద్వింధ్యాద్రి రాణ్మందరుండును, పరాసుగోత్ర క్షీరసాగర క్షపాకరుండును, దేశరక్షక సైన్యాధ్యక్షుండు నగు గోరుదొరవారు బృందావనపురంబునఁ గలఁడు.

గీ. మున్నుపనివిని యీరాజుసన్నిధికిని
మావిరోధంబు లతనికి మనవిఁజేయఁ
గూర్చె సఖ్యంబు మాకిరుగురకు వైర
భావ మెంతయుఁగూడదని పనియటంచు.

మఱియును నన్నాదొరగారన్వయనామగోత్రంబులతోడ నెఱింగి యున్నవాఁడు ఇంతేగాక.

క. ఈరాజునకు న్నాకు
నో్బరాటము గలదటంచుఁ బుయిలోడమటం
చేరాయిడిలో్నైనను
గోరుం దొర యెఱుఁగుఁజుమ్మి కూరిమితోడన్.

గనుక హైదరుజంగుతోడఁ బ్రసక్తి లేకయే వారిచెంతకరుదెంచి వీరిపేరట నుత్తర్వు లవ్రాయించి పంపించుటమంచిది.

గీ. వారిపేరట లేఖలవ్రాయఁజేయ
హారికరంబుల నీహారమడఁగుకరణి
భూపుడుర్బోధ నీరదబుద్బుదం బ
టంచు బుస్సికిఁ దెలియక డక్కునొక్కు.

మంత్రి—రాజేంద్రా! ఇంతకంటె వేఱాలోచన యేమి? బాగుగనాలోచించితిరి.

రంగ— ఆపని కేరిని బంపినబాగుగనుండును?

మంత్రి—ఈపనికిఁబంతెన బుచ్చెన్నగారిం బంపిన బహు యుక్తియుక్తము.

రంగా—మంత్రివరా! మంచివానింబేర్కొంటిరి. బుచ్చెన్నగారూ?

బుచ్చె—మహాప్రభూ! ఏమి సెలవు?

రంగా—మత్తకోకిల. పంతెనాన్వయవార్ధిచంద్రమ! భవ్యరాజవరేణ్య కా
ర్యాంతరంబులఁదీర్ప నంచితమైన వాఙ్నిపుణత్వమం
దింతయంతని నిన్నునేనుతియింపనేర్తునె సాటి గో
రంతయేనియు నీకు నిజ్జనులందు నెందొకఁడుండునే?

గనుక నీవేగి యాగోరుందొరకును, వారి దుబాసీయగు మద్దాల రెడ్డినాయనికి నీయు దంతంబాద్యంతంబు విశదపఱచి వీరీయుద్యమంబు మానుటకుఁ దగిన యుత్తర్వుల వ్రాయించి బుస్సీదొరగారికిఁ జూపించిరమ్ము. నాకిదేయుపకారము.

బుచ్చె—గీ. ఈశరీరంబునీయది యీశ! యిట్లు
వేఁడగానేల? మీపన్పుఁ బేర్మిఁజేయు
కంటెఁ బరికింప ముఖ్యమౌ కార్యమెద్ది?
పనివి నెదఁగాక రాజేంద్ర! పంపుమిపుడ.

రంగా—మిగులసంతసంబయ్యె. బుచ్చెన్నా. అట్లయిన నీకిదే యాజ్ఞ.

బుచ్చె—మంచిది రాజేంద్రా! ఇదే పోయివచ్చెద. (అని నిష్క్రమించుచున్నాఁడు)

రంగా—మంత్రివరా! సైనికనికాయంబును దగిన యుద్యమంబున నుండఁబంపుము.

మంత్రి—చిత్తము స్వామీ!

రంగా—వెంగళ్రాయఁడా! చూచితివా. ఎంత జరిగినదో.

వెంగ—అన్నగారూ! కానిండెట్లుజరుగునో చూతము.

(బంట్రోతులు ప్రవేశించుచున్నారు.)

బంట్రో—సలామ్ మహరాజ్ మాయేలికయగు హైదరుజంగుసాహెబు తమకిమ్మని లేఖనిచ్చినారు ఇదిగో. (అనియిచ్చుచున్నారు.)

మంత్రి—(పుచ్చుకొనిచదివి) రాజా! మనలఁదక్షణమ వారివద్దకురమ్మని లేఖవ్రాసిరి. ఇదియవర్తమానము.

రంగా—మంత్రివరా! ఈబంట్రోతులకు బహుమతులనొసఁగి పంపివేయుము.

మంత్రి—చిత్తము స్వామీ! (అని గుప్పెడురూపాయీలఁ దీసియిచ్చుచున్నాఁడు.)

బం—సెలవుపుచ్చుకొనుచున్నారు.

రంగ—అమాత్యుఁడా! పత్రికధోరణియెట్లున్నది?

మంత్రి—లేఖఁజూపుచున్నాఁడు.

రంగ—(చూచి) నరసాగ్రణీ! ఈపత్రికఁజూడుము వ్రాఁతలోనేయింత దురాగ్రహము కన్పించుచున్నదే చూచిననెట్లుండునో? ఏమైననునరేపోవుదమా?

నరస—అంగుడుదుడిపి యగురాజన్నటఁజేరి మనపైకొండెములుసెప్పి ఖానునిమిగులనం కాపాంకముగలవానిగానొనర్చె. అట్టివానిచెంగటకెట్లు బోవనేర్తుము ఇంతేగాక.

గీ. ఖానుసర్వాధికారి నిష్కారణంబ
దిట్టినందిట్టఁగలవాఁడు ధీమసమునఁ
బూనిపోయినఁదొసఁగులు పుట్టునేమొ
వైరిరాజుండుటంబట్టి వారికడను.

గనుక నిచ్చటికి నొండువకీలునంపి తెలుసుకొనుటమంచిది.

రంగా—అట్లైన నేరిని బంపుదము?

నరస—క. భూమిప! బుచ్చెనకెన యా
దామర దమ్మన్న గానఁ దగునీపనుపున్

సేమముగఁజేయు నొరులిల
భూమహితచరిత్ర! వీనిఁబోలఁగలారే?

ఇదివఱకు బుచ్చెనను బంపియుంటిమిగాన నిప్పుడీయనన్బంపుట యుక్తమనితోఁచెడి ని. చెలికాని వెంకయ్యగారినిగూడ సహాయమిచ్చుటమంచిది.

రంగా—అవును చక్కఁగఁజెప్పితివి. సేవకా! దమ్మన్న వెంకయ్యగార్లనుబిలువుము.

సేవకు—మహాప్రసాదము రాజేంద్రా! (అనివెంటఁగొని వచ్చుచున్నాఁడు)

దమ్మన, వెంక—దేవా! ఏమి సెలవు?

రంగా—మీరు మాకొక్కయుపకారమొనర్పవలెను.

ద, వెం—అట్లు నుడువకుఁడు మేము తమ బిడ్డలము. తండ్రి తనయుల నిట్లనునె?

రంగా—సరసాగ్రేసరులారా! మీరేగి యీయుత్తరమును హైదరుజంగునకిచ్చినిష్కారణము వైరమూని వ్యధీకంబుల నాచరించుట పాటిగాదని పలసితిరేని యారాజిచ్చినదాని కినుమడుఁగుల రజతంబు సమకూర్తుమని, కాదంటిరా మమ్ములఁబోరనిచ్చి యాపైని జయమందినవారికి నేల నిచ్చి యనంబుఁబొందుమని యట్టి యటమటకాఁడు నుడువు టకుటొంకుమాటలచే మనంబున గాంతాళంబుబూని మాకు విప్రలంభమొనర్పఁజూచుటదెంతయు నన్యాకాండ్రపనిగాని మీవంటి వారికిఁ దగినది గాదనియుఁ జెప్పుము. మఱియు

గీ. న్యాయహీనంబుగా దినాణంబువార
లిట్లుచేయుట దగవుకా దిరుదెఱఁగుల
వారినొక్క సమముగ నిప్పక్షపాత
బుద్ధినరయుట మేలని బోధనెఱపు.

ద, వెం—అదెంతపని రాజాగ్రణీ! ఇదిగో పోయివచ్చెదము.

(అని వెడలి పోవుచున్నారు)

(అందఱు నిష్క్రమించుచున్నారు)

రంగము:—బందరు.

(గోరుంబొర, మద్దాల రెడ్డినాయఁడు, సేవకుఁడు ప్రవేశించుచున్నారు)

గోరు—రెడ్డివరా! లష్కరిప్పుడెచ్చటనున్నదో వర్తమానము వచ్చినదా?

రెడ్డి—రెండుమూఁడు దివసంబులలో ఖాసింకోటకుఁ బోవనై యున్నదఁట.

గోరు—వారచ్చటనుండి మరలివత్తురా? లేకింకను ముందునకేగెదరో?

రెడ్డి—పైకిఁబోవునట్లేయున్నది. ఇంతటిలో వెనుకకు వచ్చునట్లులేదు.

గోరు—కారణమేమి?

రెడ్డి—నాకును బోధపడకున్నది. దొరగారూ!

సేవ—స్వామీ! ఎవ్వరో తమదర్శనంబునకు వచ్చియున్నారు.

గోరు—సేవకా. ఇటుదోడుకొని రమ్ము.

సేవ—చిత్తము దేవరా! (అని తీసుకొని వచ్చుచున్నాఁడు)

(బుచ్చెనప్రవేశించుచున్నాఁడు.)

బుచ్చె—సలామ్ దొరగారూ!

గీ. నేనుబొబ్బిలికాశ్యపీజాని రావు
వంశనీరధిరాజుగోపాలకృష్ణ
రంగరాయవరుం డంప రయముమీఱ
వచ్చినవకీలు నయ్య! నన్బుచ్చెనందురు.

గోరు—అయ్యా! ఇటుకూర్చుండుము. (అని కుర్చీచూపుచున్నాఁడు)

బుచ్చె—కూర్చుండుచున్నాఁడు.

గోరు—రంగారావు సుఖియైయున్నాఁడే?

బుచ్చె—తమయక్షీణకటాక్షవీక్షణంబుల నతిక్షేమంకరుఁడై యింతవఱకున్నవాఁడు స్వామీ!

గోరు—ఏమి యట్లనెదవు? కంఠంబునఁబ్రాణంబులుండఁగ వానికి నసుఖం బొనరించువారుగలరా? (మంత్రింజూచి)

క. ఆతనిధైర్యస్థైర్యము
లాతనిశౌర్యాతిరేక మారయ గణనా
తీతములుగావె రెడ్డీ!
యాతనినీవెఱుఁగవొక్కొ? యలఁతియెచెపుమా.

రెడ్డి—ఉ. ఆయతశౌర్యహేళి సుగుణాయుతశాలి యశోస్తశాలి వి
ద్యాయనపాళి సంచిత మహాహవకేళి యరాతికీలి యా
ధీయుతరంగరాయనృపతి స్ఫుటవిక్రమ మెందు డాపనౌ
నాయినుతేజ మెవ్వరికినైనను మాయవశంబె తెల్పుమా.

గోరు—రెడ్డివరా! నీవుచెప్పినది బహుబాగుగనున్నది. పంతెనవంశాగ్రణీ! నీరాకకుఁగతంబేమి?

బుచ్చె—దొరగారూ! పరాసువతంసంబగు బుస్సీయను మంత్రిపుంగవుండగు హైదరు జంగును శ్రీకాకుళపు జమాబందీ నిమిత్తమై యరుగుదెంచి విజయరామరాజుదురుపదేశంబున ద్వాదశలక్షల శుభ్రములకు భ్రమించి బొబ్బిలికోటం గొట్టి యారాచపట్టికిఁగట్టిపెట్టు గట్టిపట్టున నున్నవారు. మారాజెట్టి దుష్కార్యంబు నాజ్ఞోల్లంఘనంబును వారికిఁజేసియుండలేదు. రంగరాయ విజయరామరాజ క్ష్మావల్లభులకుఁ గల దీర్ఘవైషమ్యంబులు దమరెఱుంగనివిగావు. అట్టియెడ నరనీరుని వెనుక వైచుకొని నిర్నిమిత్తంబుగ నిట్టియపకృతిని మారాజునకొనరించి దుర్యశోపంకిలంబునఁ బడసంకించుచున్నారు. ఇదియ వర్తమానము. మీతోఁజెప్పిరమ్మని రంగారావుగారు నన్నంపియున్నారు.

గోరు—ఆహా! (ముక్కుపై వ్రేలునుంచుకొని) ఏమిదురాగతము? ఆరాజు నీతురకయుంగలసి రావు కులాగ్రణియగు రంగరావుపై కరుగుచున్నారా? ఎంతపనికి రెడ్డివరా!

గీ. బుస్సియేమయ్యె నిస్సిరో భూధవులకు
నిందుసఖ్యంబుఁ జేయఁగా నేర్పులేక
కొసరు విమతక్ష్మాధవుంగూడి రంగ
రావుపైఁబోవ నిదియేటి రాజనీతి? మఱియును

ఉ. మానితకీర్తివంతు లభిమానధనుల్ ధరరావువారు దు
ర్మానవమానభంజను లమానుషవిక్రము లట్టివారితో
నానెఱి దండయాత్రల నొనర్చుట? సంధియెలెస్సగాని యు
ష్మానవనాథహైదరుల మాటలచే నటుచేయవచ్చునే?

రెడ్డి—మీరు సెలవిచ్చినది బహు న్యాయపథము. అయిన నా రాజునకేమి కొదువ? అన్యులసొమ్ములకాసించి యాముసలిమానుసనకు మనంబునఁగినుక వొడమ నెట్లతికెనో గదా! ఆహా యేమి యాతనితెలివి? ఇంతేగాక.

గీ. విజయరామోర్విపునకెంత వెఱ్ఱిబుట్టెఁ
గొఱవిఁజేపట్టి తలగోఁకికొన్నరీతి
రావువారలతోఁబోరి రాజవంశ
మెల్లనడఁగింపసమకట్టె నెట్టివింత?

గోరు—రెడ్డివరా! వెనుక శ్రీరంగరాయక్ష్మావల్లభుండును, విజయరామరాజుం దమ తమ వైరుధ్యంబుల నిచ్చటికివచ్చి నాకు నివేదింప వారికట్టివైరభావంబు తగదని వారిన్నివారించి కినుకలనణంచి మృదూక్తుల వారింగారవించి యనిచినాఁడ. ఆరాచవారిమహిమ నేనెఱుంగుదు వా రభిమానధనులు, చావం జంప వెఱచువారు గారు. అధర్మయుద్ధంబులకుఁ బోరు సుమా!

రెడ్డి—ఫరాసువతంసమా! సత్యము. నేనును వారిసంగతి నెఱింగినవాఁడనే. గర్వితారాతివీరవార కంఠలుంఠన నిర్గళితకీలాల ప్రవాహ మజ్జన వ్రతాక్షీణదీక్షా పరాయణులు రాచవారు. వట్టివారా?

గోరు—రెడ్డిగారూ! సత్యము వాక్రుచ్చితిరి. తమకావంతైన నపకారమొదఁ దలంచిన విమతులపైఁ దమదర్పంబులఁ జూపుటది యుత్తమమగు రాజనీతి. లోకులితరేతర వైషమ్యంబులంబూని కలహించునెడ నడ్డమువచ్చి కాచుటలు క్షత్రియధర్మంబులు.

సీ. వీరిపోరాటమునకేమి కారణంబు?
కలుగనేజూడు వారిద్దఱలమికలనఁ
ఘోరన్యాయంబు జయమందుఁ బుడమిలోన
వినమె "ధర్మోజయతి" యను వేదవాక్కు.

గీ. కాని బుస్సికి నిదియేటి మానితంపు
నడత? యెన్నంగ విమతుని గడకుఁజేర్చి
విదితకకుబంత విశ్రాంత విమలకీర్తి
శాలితోఁ బోరసమకట్టె సాహసించి.

రెడ్డి—నిజము. దొరగారూ! మీకుఁగోపమువచ్చునని జంకుచుంటినిగాని

గీ. తురకసరదారు లారయ దుర్మదు లిఁక
నర్థతృష్ణను నెవరిపైనైనఁగాని
కినుక వహియించి తెగువలఁ గొనఁగఁజూతు
రయ్య! చనదిట్టి యాఱడి కియ్యకొనఁగ.

గోరు—ఔనుగాని నేరమున్న నెట్టికూర్రాత్మునైనను వంచనఁజేయుట ప్రఖ్యాతిగాని నిరపరాధులగు నీరాచవారలతోఁ బోరుటెంతమాత్రము నీతియైనపని గాదు. అదటుండనిమ్ము.

గీ. రాచవారంప వెనుకీ పరాసువారు
రావువారిగడీమీఁద రభసమునను
నడచినారను దుష్కీర్తి వొడమకున్నె?
వారికేగాదు మాకునవారితముగ.

రెడ్డి—బాగుగ నాలోచించితిరి. అట్టి యపఖ్యాతి పుట్టకమానదు. జయించినను, జయింపకున్నను వారిశౌర్యగుణోపార్జితంబగు నఖండయశంబటుండనిమ్ము. నిష్కారణము పరాసులచేత నధర్మయుద్ధంబున నోడిరను నపఖ్యాతి మీకుఁజెందనై యున్నది. యిది వారించుటే యుక్తము.

గోరు—ఏమిసేయను?

రెడ్డి—ఇట్లు చేయఁగూడదని సకారణంబుగ నొక జాబువ్రాసి బుస్సీకి నేరిచేతనైనం బంపుము. అది లెస్స.

గోరు—అట్లే యొనర్తును.

బుచ్చె—చక్కఁగఁజెప్పితివి. నేను గోరెడిదియు నంతియ.

గోరు—అటులైన వ్రాతుంగాక. (అనివ్రాసి ముగించి)
సేవకా! లూయిమర్టెనును బిలువనంపుము.

సేవ—చిత్తము. (అని పిలుచుకొని వచ్చుచున్నాఁడు)

(మర్టెన్ ప్రవేశించుచున్నాఁడు)

మర్టె—సలామ్ దేవరా! ఏమిసెలవు?

గోరు—మర్టెనూ! నీవేగి యీయుత్తరమును బుస్సీకిచ్చిరమ్ము తత్క్షణమపొమ్ము.

రెడ్డి—మహాప్రభూ! తమరు వ్రాసినదివకీలుగారు వినెదరట చదివించెదరా!

గోరు—అట్లేచేయవచ్చును. మీరేచదివి వినుపింపుఁడు. (అని యిచ్చుచున్నాఁడు)

రెడ్డి—బుచ్చెన్నగారూ! చదువుచున్నాను వినుఁడు.

బుచ్చె—మంచిది. రెడ్డివర్యా! (సావధానముగ వినుచున్నాఁడు)

రెడ్డి—ఉత్తరము. దండకము:—శ్రీరస్తు. మాన్సీరు! బుస్సీ! వరా! మిత్ర! మీరా జమాబందిలోఁజేయు ప్రారంభముల్దేటతెల్లంబుగా వింటి. మాయావియౌ రాజు కొండెంబులంజెప్పి పండ్రెండు లక్షల్సమర్పింప మీమంత్రి హైదర్మదిన్నంతసంబందుచుంయుక్తియారీతి వ్రాకుచ్చి మీకెంతయున్నిక్క పుట్టంగఁ జేసెంగదా వార్కపై రావువారింతయుఁగా దోషముల్సేయలేదాయె మున్నెప్పుడా పూసపాట్యన్వయుల్

రావువారన్న లోవైరమే పూనియున్నారు. మీరాధరాధీశుతోఁ గూడుటల్లాన్యయమే? రావువారెన్న సద్ధైర్యమంథాంధ్రు లక్లాట వారిప్డు మిమ్మారకేపోవనీ రాజిఁకైపెచ్చు దుష్కీర్తిపాలౌదు మారాజుతోఁగూడి విధ్వంసమున్జేసిరా సాల ముఖ్ ఫ్రాంసువారన్నేకాంద్రించుఁదప్పున్న దండించుటల్యుక్తమే గాని నిర్దుష్టులౌ వారితోఁబోరభావ్యంబుగాదెంచగాఁ జాలియుండేనిసఖ్యంబు గావింపుమా వారికిన్ లేదా పోరంగనిన్సిద్ధులైన్ ముస్లమానాౖజులూహింప సద్ధర్మమున్వీడి రీపక్ష సత్యంబుసున్మింతయున్ వారుసెప్పంగ వింటేమియున్ లెస్సగాదింకనీయుద్యమం బాత్మఁదోఁయంగమేల్ వారలత్యంత రోషాగ్ని నేత్రుల్ ప్రతాపాగ్ని హేమాత్రుల్ స్ఫురద్దివ్యగాత్రుల్ జగద్వ్యాప్తకీర్తుల్ ప్రభామిత్రమూర్తుల్ భవత్ప్రేమపాత్రుల్ మదిన్నమ్ము.

మిక్లింతయున్వేడుచున్నట్టి,
మిత్రుండ,
గోరుందారన్.

మలుమకాము బందర్
* 7-1-1757.

బుస్సీ—అంతే నాకుఁగావలసినది. బహుచక్కఁగనున్నది. రెడ్డివరా! అపైని దైవగతి యెట్లున్నదో యట్లుజరుగక మానదు.

గోరు—లాసూ! నీవీవకీలుతోఁబోయి బుస్సీగారికి దీనిజూపింపుము.

లాసు—స్వామీ! ఆజ్ఞఁగొనెదను. (అని వెళ్ళిపోవుచున్నాఁడు)

బుస్సీ—(సెలవుఁగైకొని వానివెంటవే పోవుచున్నాఁడు)

రంగము:—ఖాసింకోట.

బుస్సీ కచేరీ.

బుస్సీ—మంత్రివరా! రాచకార్యములెట్లున్నవి? బొబ్బిలిరాజు పెద్దాపురసైన వచ్చియుండెనా?

హయి—పరాసు వంశాగ్రిణీ! ఏలవచ్చును.

బుస్సి—భళీ! ఈమకామునకైనవచ్చునా?

హయి—గీ. అట్టిసరసుఁడుగాఁడిప్పుడైన రా న
ధిపుడ! మన్నింప నన్హుఁడే తీవ్రరోష

* A probable date of the letter.

మోదను ఘటియించి రాఁడయ్యె మేదిని విభుఁ
డయ్యె! యిఁకనేమి సేయఁగా నా నాగాని.

బుస్సి—ఎంతపెంకివాఁడు రంగరావు ?

సేవ—స్వామీ ! బందరునుంచి లాసూమర్టెక్ వచ్చె.

బుస్సీ—సేవకా ! వెంటనే పిలువనంపుము.

సేవ— (పోయి వెంటఁబెట్టుకొని వచ్చుచున్నాఁడు)

(మర్టెక్, బుచ్చెన్న ప్రవేశించుచున్నారు)

మర్టెక్—సలామ్ పరాసుకులావతంసా! బుచ్చెన్న. సలామ్ స్వామీ !

బుస్సీ—ఇటుకూర్చుండుఁడు.

మర్టెక్—బుచ్చెన నాసీనుంజేసి తానునుగూర్చుండుచున్నాఁడు.

బుస్సి—మర్టెక్ ! గోరుందొరవారుసుఖులే ?

మర్టెక్—క్షేమము దొరగారూ !

బుస్సీ—నీరాకకుఁగతంబేమి ?

మర్టెక్—మీకిమ్మని గోరుదొరవారుజాబునిచ్చియున్నారు(ఇదిగోఅనియిచ్చుచున్నాఁడు)

బుస్సి—తిరిగితిరిగి చదివి చూచుకొని.

గీ. ఎంతవాఁడవు హైదర యిట్లుచేయఁ
దగవె యీపట్ల? నమ్మంగఁదగునె నిన్ను ?

హైద—ఏమి యిట్లంటిరయ్య ? నేనేమిజేసి
నాఁడ నపకార్యములువేగ నాడరయ్య

బుస్సీ—ఇంక నపకృత్యమేమనుచున్నావా ? ఇప్పడోనరించినదికాదే ?

హాయి—ఖిన్నుండై తల వాంచుచున్నాఁడు.

బుస్సి—మనస్నేహితుఁడును వయోబుద్ధి సామర్థ్యంబుల నెక్కుడువాఁడును ధైర్యమందరుండునగు గోరుదొర వ్రాసిన జాబు వినుము.

(అని చదివి వినిపించుచున్నాఁడు)

హాయి—(తనలో మాగుట్టుతెలిసినది. ఈపట్ల ధైర్యము వదలుట దగవుగాదు. అయిన దేమో యైనది. సమర్థించిగెల్చుట శక్తి. కానిమ్ము. నాతెల్వినంతయు నుపయోగించెదనుగాక).

బుస్సీ—ఛీ నీమాటవిని నేనుంజెడిపోతిని.

హాయి—అట్లు సెలవీయఁగూడదు. తమకాగ్రహమువచ్చినది. ఇప్పుడేమియుననఁజనదు. నిజమువల్కిన నప్రియముగఁదోఁచు. ఆగ్రహస్వభావంబట్టిదియెకదా ?

బుస్సీ—ఇంక నేమి చెప్పవలసియున్నది ? తలఁచినదాని నిదివఱకే చెప్పియుంటివిగదా?

హాయి—క. నుడివితినే బద్ధుల ? నే
గడుసుఁదనంబలరఁ బనులఁగావించితినే ?
యొడయని యానతి లేనిది
బుడిబుడి నన్నిట్లు పల్కఁబోఁబునె ? యధిపా !

అఖండధరాభారంబూని కార్యనిర్వాహకత్వంబున మీకావంతయు నొప్పిఁ దగులనీక చిరకాలంబునుండి యమాత్యకృత్యంబు నిర్వర్తించుచుఁ దప్పన నేమి యెఱుంగక కాలంబుగడుపుచుంటింగదా ! నేటికిట్టిది పుట్టె.

బుస్సీ—అపవాదము గలుగుకాలము సంభవించినది.

హాయి—బహుదూరంబునంగల గోరుందొరకీ శ్రీకాకుళము వృత్తాంతము తెలియవచ్చిన దఁట ! ఇచ్చటఁబని సేయుచున్న మనమవ్యక్తులమఁట.

క. మన మొనరించెడుపనులకు
జనులాంగ్లభ్యంతరముల సరవిని బెట్టన్
మనయధికారము చెల్లునె?
జననాయక ! యగడుగాక జగతిని నెందున్.

బుస్సీ—అది నిజమేగాని రంగారావును మన్నన సేయుట యుక్తంబనియును విజయరామరా జుదితక్రోధబద్ధుండై యోర్వకఁ జేయు కుయుక్తి నీగదబుద్ధ్యదంబనియు మనకిట్టియుద్ధంబులఁ బ్రవర్తిల్లుట యపకీర్తియనియును వ్రాసి యున్నాఁడుగదా. అతని హితోక్తి మెచ్చవచ్చు.

చ. హితుఁ డనుజన్మసన్నిభుఁ డహీనగుణార్జవకీర్తిశాలి సం
తతము మదీయగౌరవనిధానము కెట్టనుగోరు వాఁడిదో
హిత మొనరించు టెంతయును హెచ్చుటుచేయక యున్న నాపయిన్
మతిసలుకల్జనించును సమాహితసైన్యవిభుత్వవర్తికిన్.

హాయి—అట్లైనఁ దమయిష్టమువచ్చినట్లే చేయవచ్చును.

బుస్సీ—మనకింక బొబ్బిలికేగఁ బనిలేదు. శ్రీకాకుళము మీఁదుగ మనరాజధానిఁ జేరుదము.

హయి—గోరుదొర వ్రాసినంతమాత్రమున మనప్రయత్నంబు నూని పోవలసియున్నది అధికారుల యెడలఁ దాబేదారులొనరించు నక్రమంబులు సహింప మీరోర్తురుగాని మావంటి తురక బిడ్డలమోర్వఁజాలము.

బుస్సి—ఏమట్లంటిరి ?

హయి—గీ. ధీరులన్నను వారెపో ధీమసమున
ఖాన్నిఘాలను ఖాదరుఖైకొనకను
జంకుఁబొందరు మదిలోనఁబంకమూని
యట్లుజేయఁగలారె ? యెయన్యనృపులు ?

తెలియుచునేయుండఁగా వేఱుజెప్పనేల ? జమాబందీకి రమ్మని యుత్తరువు జేయ ల త్ష్యముచేయరైరి. పోనిమ్ము దివాణమువారిప్రాంతములకరుదెంచి చాలాకాలమైనను దర్శనమైనఁజేసిపోరైరి. పైగా మనమన్యాయము గావించుచుంటిమని బందరులోఁ బిలూరీచేసిరి.

బుస్సి—అవును. నీవు నుడివినదియును సబబుగానే యున్నది.

హయి—గీ. రాజునేనును బహుళదుర్మార్గులమఁట
బొబ్బిలివిభుండుమాత్రమె బుద్ధిమంతుఁ
డఁట విశేషధనముగొని టక్కుమాట
లాడు నారెడ్డి మాటలఁ బాడిగలదె ?

క. ఆరెడ్డినాయకుండిదె
యారంగారాయనృపతి యద్భుతగుణవి
స్ఫారుండని యెటుదెల్పెనొ ?
గోరుందొరగారితోడఁ గూరిమి పుట్టన్.

బుస్సి—ఆరెడ్డి లంచము దినెనేమి ? కనుకనే చక్కఁగనతుకునట్లు చెప్పి మనల నందఱి ను దూలనాడించె. కావున్న సర్వాధికారిని నేనుండ గోరుందొరకేమి ? శ్రీకాకుళము వ్యవహారమేమి ?

మర్టై—(బుస్సీచదువ నుత్తరమును సాంగముగవిన్నవాఁడేగాన సంగతినంతయుందెలిసి) తమ రట్లాలోచింపఁజనదు. ఈవిషయమై సైనాధ్యక్షునికందఱికంటె నెక్కుడు దెలియునను టకు సందియమ్ములేదు.

హయి—ఎఱుఁగుదుననినం గాని మన నోరు మూయుటకవకాశమునుండదు. ఏమెఱుఁ

గుదురు? దేశముపై సర్వాధికారమూని వచ్చి పనిచేయుచున్న మాకింక నీ మనుష్యుల యానుపానులు బోధపడలేదుగాని సౌధాంతరంబున హుక్కాఁ పీల్చుచుఁ బొద్దెఱుంగక పోతుటీగకైనఁ జొరరాని పారాలోనుండి తనయొడలే తానెఱుంగని గోరుందొరగారికిఁ దెలియునఁట మనకుఁదెలియదఁట. ఎంతపిచ్చిమాట.

బుస్సీ—అవును. లాలోశీపసగానే కనుపించుచున్నది.

గీ. నిజము నీమాట హైదర! సేలతేఁదు
బహుళ దుర్వారగర్వ సంప్రాప్తవైర
భావమెదఁబూని యున్నాఁడు వానిగర్వ
మడఁపఁగావలె నెట్లైన నాఁగఁజనదు.

మర్టె—పరాసువంశాగ్రణీ! మీధీసవిభుని యాలోచన నీపట్ల వినఁబాడిగాదు.

హాయి—మీరెడ్డి నాయకుఁడు మెచ్చుకున్న మాకుఁజెడునది లేదు.

మర్టె—ఒకరికొక్కనివలనఁ గీర్త్యపకీర్తులు జెందఁగారణమగును.

హాయి—ఆలోచించి మాట్లాడుము లేకున్న నీగౌరవముంచువాఁడనుగాను.

మర్టె—నీకేమి. యశంబపయశం బాయనివిగాని.

హాయి—ఎవ్వరికి నపకీర్తి జెందనీయకుండ నీవుంటివి చాలదూ?

మర్టె—"అధికారాంతమునందుఁ జూడవలదా యాయయ్య సౌభాగ్యము" లన్నట్టిప్పుడుతెలియదు తరువాత మీరేయనుభవింతురు. మేము పోయివచ్చెదము బుస్సీ దొరగారూ!

బుస్సి—మంచిది.

(మర్టెను, బుచ్చెన్న వెడలి నిజనివాసంబుల కరుగుచున్నారు)

హాయి—బుస్సీదొరగారూ!

క. మీకుపకారముఁ దలఁతునె?
యాకాశ్యపినాథుచెయ్వు లవిసరియగునే?
యాకరము గొనరె దొర లిల
నీకైవడిఁబనులు సేయ నెచ్చటనైనన్?

ఆరాజానర్చినది సరియేనా? మనకు వీరితోఁగల పనికై యెన్నిరోజులు కనిపెట్టుకొనియుండవలెను. మనయందింతపాటి గౌరవమైననుంచకున్న మన యుద్యోగము లేల? తాఖీదునైనను లెక్కచెయ్యనిచోట నుద్యోగము చేయుటకంటె హైన్యములేదు.

గీ. ఛీ ! నిఘాలేని నౌకరీచేయుకంటె
నడుగు టడిమేలు చూడ నీయుర్వియందు
నధిపుగౌరవమొందని యపుడుకొల్వఁ
గొలుచుకంటెను మడిదున్నుకొనుటమేలు.

ఇదిగో మీమొహరు. నాకీయుద్యోగమక్కఱలేదు. (అనిబుస్సీకాళ్ళవద్దఁ బాఱ వేయుచున్నాఁడు)

బుస్సీ—సచివాగ్రణీ! తొందరపడకుము. గోరుదొరవారి ధోరణి నీతోఁజెప్పితిం గాని నీవు సేయుపని తప్పని యంటినా? నీయిష్టమువచ్చినట్లొనరింపుము

(సైనికులు ప్రవేశించుచున్నారు)

సైనికు—మహాప్రభూ! చచ్చిపోతిమి

హాయి—ఏమది? ఏమది?

సైని—మహారాజా! తమరంపఁగనేగి సమస్తముం గలయఁజూచుచుండ వారి ప్రదేశమం దొండు వనంబునఁగొంతసేన హఠాత్తుగ మామీఁదఁబడి నలువదిమందిని హతులంజేసె, కొంతమందికాయంబులు గాయంబులుగాఁగఁబలాయనులైరి, మిగిలినవారలమీవార్త మీకుంజెప్పఁబఱతెంచి వచ్చినారము.

హాయి—దొరగారూ! చూచితిరిగదా యారాజుసేసినపని? సైనిక నికాయంబుల కాయంబులు గాయంబులుచేయుటయేగాక కొంతమంది ఫరాసులఁ బరాసులఁ జేసిరఁట సైఁచెదరా!

బుస్సీ—ఆవనమెవరిది?

హాయి—బొబ్బిలిరాజుది, సందియమేల? విజయరామరాజిట మనవద్దనే యుండియున్నాఁడుగదా!

బుస్సీ—అబ్బా! ఎంతపని జరిగినది! నలువదిమందిని జంపించెఁగా! వీనిపొగరడఁపవలసినదే, ఇఁకజాలిఁదలఁపరాదు,

హాయి—ఎంతక్రూరకార్యమొనరించెనో చూచితిరా?

బుస్సీ—అవును. ఇట్టిదుర్మార్గుని నేమిచేసినను జేయవచ్చును నేనుపోవుచున్నాఁడు.

(అని నిష్క్రమించుచున్నాఁడు)

హాయి—సైనికులారా! నేనాసంగతిఁ గనుఁగొనెద. మీరు భీతిదక్కియుండుఁడు.

(సైనికులు నిష్క్రమించుచున్నారు)

సేవకు—స్వామీ! ఎవ్వరో తమదర్శనంబునకు వచ్చియున్నారు.

హాయి— (కోపముతో) రప్పింపుము.

(దమ్మన్న, వెంకయ్య ప్రవేశించుచున్నారు)

దమ్మన్న—వెంకయ్యా! ధూమ్రాక్ష, విరూపాక్షాది రాక్షస వీరాకృతిగల యీపాశ్చాత్యుండెగాఁబోలు హైదరుజంగు? ఊరకనే కన్నులనుండి క్రోధాగ్నికీలావిస్ఫులింగంబులెగయునిట్టి వీనితో నెట్లుపలికి సమాధానంబులఁ గొననగు?

వెంక—గీ. వీనిఁజూడంగ భయ ముద్భవిల్లుచునికి
యమునితో మాటలాడుట యని దలంతు
వీనితో నాడ నైనను వీఁడుమనల
నేమి సేయు నడుపుదము సామరీతి.

దమ్మన్న—కానిమ్ము. ముందు నేనే మాట్లాడెదను. సలామ్. సాహెబ్ మెహర్బాన్! బొబ్బిలినుంచివచ్చిన వకీళ్ళము. దమ్మన్న, వెంకయ్య యను పేర్లుగలవారము.

హాయి—మా సేనంజంపించెనుగా మీరాజు? జాగ్రత.

శా. ఏలారాఁడు భవత్ప్రభుండు మదిలో నేమంచు భావించెనో!
జ్వాలోత్తీక్షణ మత్ప్రతాపహుతభుక్చండస్ఫులింగార్భటిన్
ఖాలిచేయుచుఁగోటఁ బొమ్మనుచు మీఖామందుతోఁ జెల్పు పో
వేళాకోళమె ఖాన్నిహాలిల హుసేన్వారాది సంబాధముల్.

దమ్మ—స్వామీ! కొంచెము శాంతింపుఁడు. తమ్ము నే దైవముగాఁ దలంచుచు రంగారావుగారు మీకెట్టియపకారమును జేసినవారుగారు, కోటవదలి వెళ్ళిపొమ్మను టేటి సబబు?

హాయి—ఎట్టిసబబా? కోటవెడలఁగొట్టి చెప్పెదను.

దమ్మ—అంతనేరమేమిచేసినాము? తురుష్కాగ్రణీ! తమదయకుఁ బాత్రులము.

హాయి—మాసైనికులఁజంపుటదేమి దురాగతము? (అని కత్తితో జళిపించుచున్నాఁడు.)

దమ్మ—గీ. ఇట్టిపని నెన్నఁడును జేసి యెఱుఁగమయ్య
వాదులాడుట మేలె మీపాదమాన
వైరిరా జిట్లుజేసి మావారిపైని
గ్రోసెనో గాని మీకిట్లు దోఁచఁదగునె?

మీసైనికుల కంటఁజూడనైన లేదు. మారాజట్టితో వలఁబోవువాఁడుగాఁడు

హాయి—మేమా యట్టి తోవలఁ బోవువారము? (పండ్లు పటపటఁ గొరుకుచున్నాఁడు)

దమ్మ—గీ. నిరపరాధుల మమ్మిట్లు నిందపాలు
సలుపఁగా రాదు మీవంటివార లహిత
రాజుపలుకులకలుకూని రాయిడించి
పక్షపాతంబు బూనుట పాటియగునె?

హాయి—మాయాగ్రహము సంగతి నీకెందుకు? మాయెడల నంతభయభక్తి యుక్తులుగాకే

దమ్మ—ఉ. రాదొకయింతయైన నపరాధము మీయెడ నాచరింపఁగా
మీదగుదర్శనంబునకు మేకొని రానయియున్న యత్తఱిన్
మేదురవైరిభూమిపుఁడు మిమ్ములఁజేరిన దానఁజేసి కా
దే దురమావహిల్లునని దేవరఁజూడఁగరామి రావుకున్?

కాఁబట్టి మాయందట్టి తక్సీరు మాఫుచేసి యెప్పటియట్లు బొబ్బిలిని రంగారావుగారికిఁ గవులు దయచేయింపుఁడు. ఇప్పుడ రంగారావుగారికి మీదర్శనంబునకు రాఁగ బురుపంపెద.

హాయి—ఏమీ? అట్లయినంగాని రాఁడుగా? మాయుమపలి మాతోఁ బోరఁగా నున్నాఁడు. మాకుఁదెలిసినది బహర్ బిత్తర్ జల్లీల నెందు నిట్టిరాజునిం జూచియుండలేదు.

దమ్మ—అట్లుగాదు. మహాప్రభూ!

హాయి—గీ. మేము కౌలును వ్రాయము మీదొరయును
రానవసరంబులేదు. పౌరయమెసంగఁ
బోలుసై ల్వెళ్ళి జాగాను బూటలోన
ఖాలిఁజేయింపుమని చెప్పు ఖండితముగ.

దమ్మ—ఎంతనుడివిన దాఁబట్టిన కుందేటికి మూఁడే కాళ్ళని చెప్పుచున్న నేమనఁగలవారము. మీయిష్టము వచ్చినట్లొనరింపుము.

హాయి—అట్లే జేసెదములే.

దమ్మ—మీకిట్టి దురాగ్రహవృత్తి మాయెడల నేల కలుగవలె? స్వామీ!

హాయి—మీకీ పెంకిబుద్ధి యేలా?

దమ్మ—మావల్ల గోరంతయుఁ దప్పులేదు. ఖాన్ వర్యా.

హాయి—గీ. భూమిఖామందులము మేము పోటులాట
దగునె మాతోడ నిలదుత్త దారులకును?

బుద్ధిహీనపుఁ బోకిళ్ళ బోవఁజనదు
గ్రుడ్డు పిల్లను భ్రమియింపఁగోరినట్లు.

గనుక తక్షణము బొబ్బిలివిడిచి లేచిపొమ్మని మీరాజుతోఁచెప్పు. పో.

వెంక—(తనలో) ఏమిది వీఁడు కోట విడిచి లేచిపొమ్మనును ? (ప్రకాశముగా) తమకీ దురాగ్రహమేల ? రమ్మని తెల్పెడు కొలుఁజూచినఁ దక్షణమే రాజు రానై యున్నాఁడు.

హాయి—రానక్కఱలేదు. లేచిపోవునా లేదా ?

వెంక—గీ. రావువారలతో మీకు రావుగలదె
యెప్పుడైనను ? సాహేబ ! యేటికింత
వింత కార్పణ్యమూన ? మేమెంతవార
మయ్యమీరల్కఁజేసిన నాఁగఁగలమె ?

హాయి—అవును. కార్పణ్యమే ?

వెంక—క. నడిచితిమే దుష్పథముల
ముడిచితిమే పరధనముల మూర్ఖతతోడన్
విడిచితిమే నయగతులను
గడిచితిమే యాజ్ఞ తతులగంధము మీఱన్.

ప్రోలువిడనాడి పొమ్మనుటేటి నడువడి తురుష్కాగ్రణీ ?

హాయి—గీ. తప్పుగల్గియు మఱుమాటఁ జెప్పఁదగునె ?
రష్యనంగనురాని పరాసు పార
సీకులెంతయు ద్రోహవిచింతనులని
చేరిబందరు చెప్పుటల్జేయుపనులె ?

అన్నిటికంటె నెక్కుడుగ మాసైనికులఁజంపుటేల ? చూడుమిమ్ములనేమి సేతునో ?
మీవిషయమై యింతయుఁ జాలిఁదలఁపరాదు.

వెంక—క. మీకపకారము గాదట
మా కుపకారంబుగాని మాన్యవర ! మహా
సీకమును జంపనెఱుఁగము
మీ కేటికిఁ గోప ? మేల మిథ్యావాక్కుల్ ?

ఇపుడూ మీయాగ్రహకారణంబులు. ఎంత తప్పుజేసితిమి ?

హాయి—వట్టి పరిహాసము చేయకుము. జాగ్రత. (అని కత్తితో జళిపించుచున్నాఁడు.)

వెంక—మీవంటి సాహేబుసుబాలవద్ద శేబాసు గేలుపొంది యుంటిమి. కౌలుగావలె నన్నఁ గంటకమే ?

హాయి—అట్టివారైన నిట్టి యవ్యక్తులేలయ్యెదరు ? అందుకు మీరు దగరు. ఒక్క నిముషమైనను మాపట్టణంబున నుండఁజనదు.

వెంక— క. మీరట్లువాంఛజేసితి
రా రాజును వీడిరండు రభసము మీఱన్
పోరామినేగెదము పాలు
పాఱన్ వసియింత్రుగాని హైదర! వీటన్.

హాయి—మమ్మాజ్ఞపెట్టు దార్ఢ్యముకూడఁ గలదా? నాయిచ్ఛవచ్చినట్లు చేసెద. అతనికే యిచ్చివేసెద. ఏమిసేతువో చూచెదను.

వెంక—“ మీరులేచి పొండి. మీవిరోధులను బ్రవేశపెట్టెద” నన్నమాట మీరనరానిది మావంటివారు వినరానిది.

హాయి—మీపౌరుషము తెలియ బోవుచున్నదిగా.

ఉ. చూచెదఁగాక మద్బలము చూళికలంగొని చెంపవేత్రలన్
బీఁచమడంచువేళ నిఁకపేలుటమానుము భీతిదక్కయా
నీచుఁడు మాబలంబు గననేర్చునె దొండముగల్గినంత సం
కోచములేక నేనుఁగును గోడిగమాడెడి దంశమట్టులన్.

వెంక—ఉ. ఎంతబలంబుచేకురిన నెంతటి పౌరుషమున్నఁ గాలము
త్యంతము చెంతతమైనఁ గనఁబోలునె మీబలపౌరుషంబులున్ ?
దంతి యఖండవిక్రమము దార్కొనఁ గానఁ జరించుచుండఁగా
నంతమునందుఁ బట్టువడునోఁగద జాలరిపన్ను తాళ్ళకున్.

హాయి—ఏమా కాయిప్రేలాపన ? నోరుమూయింతుఁజుమీ నౌకర్. నికాల్.

వెంక—మాప్రాణంబులనైనఁ గోల్పోదుముగాని బొబ్బిలిమాత్రము విడువము. అన్యాయయుద్ధమునకు రాము. న్యాయయుద్ధంబునకు వెఱువము. ఇప్పుడు మీరు రణంబు దప్పదన్న వెనుకదీయము. దైవము వ్రాసిన రీతిగ జరుగఁగలదు. మీతోవాదమెందుకు ?

ధర్మ—ఖాన్ వర్యా! మేము చెప్పినదానిం దూరమాలోచింపుఁడు. చేయిజారినఁ జేయునది లేదు.

హుయి—అట్టిది మీరే యాలోచించుకొనుఁడు.

దమ్మ, వెంక—సెలవు గైకొనెదము. సాహేబుగారూ! సలామ్. (అని నిష్క్రమించుచున్నారు.)

(అందఱు నిష్క్రమించుచున్నారు.)

రంగము:—బొబ్బిలి రాజు సభ.

రంగా—తమ్ముఁడా! వెంగళ్రాయఁడా! మనమా గోరుం దొరవారివద్దకంపిన బుచ్చెన్నగారురాలేదా?

వెంగ—అగ్రజా! ఇదెవచ్చె.

బుచ్చె—మహాప్రభూ! తమరాకకై నిరీక్షించుచున్నాఁడ.

రంగా—మీరేగినపనియేమైనది?

బుచ్చె—మహారాజా! పయనంబై పోవునాటి దినంబునఁ బెద్దాపురంబునవిజయరామతాౙుంజూచి ముచ్చటించితిని.

రంగా—ఏమనిముచ్చటించితివి?

బుచ్చె—గీ. మాటలాడితిఁ బ్రక్కతోద్యమంబుసరణి
విముఖుఁడై రాజుగన్పట్టె వెల్లబాఱి
మనమున నసూయ యెంతయు మానుకొల్పి
నట్లుగనిపెట్టిపోతి నేనలఘుగతిని.

రంగా—చూపోపమింజేసియే గాని యిట్టియధర్మంబున కొడిగట్టుకొనుటకుఁ గారణమేమి? అట్టివాఁడు భూతలంబున బాగుపడునె?

గీ. పూసపాట్యాసురాన్వయాంభోనిధిబడ
బానలనిభ విజయరామ పార్థివదశ
లపనుఁ డిలఁబరక్షేత్రప్తి లంపముఁగనఁడె
రంగరాయుని నిశితశస్త్రాళిఁ గలన?

తరువాత

బుచ్చె—దేవా! తరువాత నచ్చోటు వాసి మునలమానుని చిత్తవృత్తి నరయఁగోరి రాజ్మహేంద్రవరపురంబుఁ బ్రవేశించి తురుష్క పరాసు దుష్టజనాభ్యంచిత సభాంతరంబున గుడమిళద్ధూమనిచయఫూత్కార వక్త్రసంగుండును, కాదంబరీ పానావేశ దురంతనితాంతాగ్రహారుణ కరాళ వదనోదిత గంభీర వాఙ్నిర్ఘోష పరికంపిత సభ్యాంతరంగుండు నగు హైదరుజంగుంగాంచితి.

రంగా—వానితో ముచ్చటించితివా ?

బుచ్చె—మనకును వారికిని పుత్రజనకభావంబుఁ గల్పించి యనేకభంగుల మనవలనఁ ద ప్పొకించుకైనను లేదని ప్రియవాక్కులఁ బ్రార్థనపూర్వకముగ మనవి చేసితినిగాని

గీ. రంగరావిప్డు మముఁజూడ రా నవసర
మెంతయును లేదు మేమయే లెంతుమటకు
నంచుఁ జెప్పెనుగాని యొకించుకైన
సంధిమార్గంబు నోటితో జారదయ్యె.

రంగా—అట్లనెనా ? కానిమ్ము. తురకల శౌర్యంబును రావువారి శౌర్యంబును జూచునుగాక. తరువాత.

బుచ్చె—దేవా ! నిజమార్గంబువట్టి కతిపయదివసంబులకు బందరు పట్టణంబునకుం బోయి చిరత్నరత్నసూత్నాయతనంబునఁ బేరోలగంబున్న గోరుంబొరను జెంగటముచ్చటించుచున్న మద్దాల రెడ్డినాయనిం గాంచితి.

రంగా—వారేమనిరి ?

బుచ్చె—గీ. వారును మనపక్షముననే వాదమొనరఁ
జేసి బహుభంగులను వారి సేఁతలుగ్గ
డించి యొకలేఖ వ్రాసిపంపించిరటకుఁ
గూర్మిమీఱంగ నిటుచేయఁగూడదనుచు.

ఆమట్టైనాహ్వాయునితో నేనుగూడ నరిగితి.

రంగా—ఆహా ! నాయందలి వాత్సల్యత. గోరుంబొరయంతపనిఁజేసెనేమి ? బుచ్చెనా ! నావిషయమై యెంతపనిఁజేసితివోయి. తరువాత నేమైనది ?

బుచ్చె—వానివెంటఁగొని యెట్టకేలకు ఖాసింకోటఁబ్రవేశించి బుస్సీకిఁజూపింప

" గీ. దొసవు దొరలె నీకతనను దొరయఁజేయఁ
దగునె యెగ్గుల ? నావెల్మ ధరణిపతికి
దొరకు దొరకొన దొరలకు దొరలు దొసఁగు
లనుచు హైదరుఁ దూలంగనాడె దొరయు."

రంగా—తూలనాడఁడో ? బుస్సీ యింటులో నిరపరాధి. దీనికంతకుఁ గారణమా హైదరు. వీఁడు రాకున్నను బుస్సీ యీకొనకున్న నిట్టి కథకవసరమే లేదు గదా. తరువాత.

బుచ్చె—హైదరేమి విరుగుడులఁ గల్పించి వాక్రుచ్చెనోగాని బుస్సీ వానికెదురాడ లేకపోయె.

రంగా—ఇదంతయు నీనివలనఁ బుట్టినదేగదా. వాఁడు సౌఖ్యములఁబొందలనీఁడు.

గీ. రాజు దుర్బోధనలచేతఁ జాఁడుపారి
యెవరుచెప్పిన వినకుండె నెట్టిమూర్ఖు?
తొల్లి వినలేదె తురకలు దుష్టవర్త
నులను సామెత నల్కూట యిలవకీల!

బుచ్చె—అటుతరువాత మర్రైనాహ్వాయుఁడును గొంతవడి ముచ్చటించెను గాని వినఁడాయె. ఇంతెందుకు? యుద్ధంబు కర్తవ్యంబు.

రంగా—పాపము నీకు వృథాప్రయాసము గల్పించితినే. ఈతురక సంధి పొసఁగనియ్యఁడని తెలిసియుండియు వెఱ్ఱిపాలైతిని. ఎట్లైనను సంధియగుడు భూజనులకు సౌఖ్యము గదా.

గీ. మేముమేమును బోరాడ మేదినిగల
ప్రజలకత్యంత మసుఖంబు ప్రాప్తమౌ న
టంచుమది నెంచి సంధిపాటించినాను
గాని వినఁడయ్యెను మొఱకు కఱకు తురక.

బుచ్చె—ఇంతియ నావర్తమానము రాజేంద్రా!

రంగా—వెంగళ్రాయఁడా! ఏమి యీతురుష్కాగ్రణి దురాగతము? ఆబుస్సీ యెట్టి బుద్ధిహీనుఁడో.

గీ. గొప్పవారనుటే గాని గొప్పదొరలు
మంత్రులాడించు కీలుబొమ్మలు నిజంబు
నిజపరిజ్ఞాన శూన్యులై నెగడుకతన
వారిమహిమంబు భువి నేతిబీరకాయ.

వెంగ—అన్నయ్యగారూ! అది నిజము. ఇంతేల? యుద్ధంబునకుఁ గాలు దువ్వుచు సంధిమాటలన్నఁ జెవిఁబెట్టక పరిపంధిరాజు దుర్బోధనా క్రోధావేశ పరవశత్వంబున మిన్నుమన్నెఱుంగక యూపరాసు రాయనైనం జీరికింగొనక పైపై రానెంచుచున్నాఁడు. మనము భయపడుదుమని యెంచెఁగాఁబోలు.

రంగా—బుస్సీ బుద్ధిమంతుఁడనియు స్వతంత్రశక్తియుక్తుండనియు నామది నెంతయనం తసించితిని గాని హైదర్జంగాభిధేయ పాపిష్ఠ గ్రహవేళ శరీరుండౌట యెఱుంగను. అట్టిది గాననే గురూపమానుండగు గోరుందొరను నిరాకరించి వాని మాటలఁ బెడ చెవింబెట్టె.

వెంగ—క. ఎవరేవిధమునఁ జెప్పిన
నపునంచును దలను ద్రిప్ప నధిపతిగలుగన్
భువిజనులకెట్లు గల్గును
బ్రవిమల న్యాయంబు దీనిఁ బాటింపఁడొకో.

అయిన నిట్టినీతి యిక్కాలంబున నేదొరలయందుఁ గలదు. ఇప్పటి యధికారు లంద ఱట్టివారే.

రంగా—గీ. న్యాయయుద్ధంబుచేకూర వదియులెస్స
వ్యాజహీనంబు కలహంబు ప్రాప్తమాట
యహితరాజందుఁ జేరి యప్రియములాడు
టయునుగూడంగ నెటువారి డాయనగును ?

వెంగ—అగ్రజా ! అయిన నేమి ? అన్యాయయుద్ధంబున రాజునకుఁ బరశు రాముఁడ గ్రిహోత్రుఁడు శివుఁడు తోడ్పడనిమ్ము మనము యుద్ధముఁ జేయకుందుమే ?

రంగా—మాననేల ? అట్టియపఖ్యాతి వారికే చెందుఁగాక. కీర్తికామ్యంబులనొందనా ర్యధనంబును డాచుకొందుమే ? గాని రాజన్నివిధంబుల సంపన్నుఁడై యున్న వాఁడు.

వెంగ—శా. అన్నా ! యుద్ధమటన్న సందియము లేదావంతయున్వారి సం
పన్నాంధత్వము మత్ప్రతాపరవిరుగ్వ్యాప్తిం బటాపంచలై
బన్నంబొందదె ? ఘోరవీరరణభూభాగంబునం జైత్రరా
ట్సాన్నిధ్యంబునకంపనే రిపుల ? మత్సామర్ధ్యమేపారఁగన్.

రంగా—అట్టిసందేహ మెంతయును లేదు.

వెంగ—కానిమ్ము దైవ మెట్లూహించెనో యట్లు జరుగకమానదు కానజరుగుదాని క్రో పాటించుట మనపని. అనుమానించుట వెఱ్ఱి.

రంగా—అవును బాగుగఁజెప్పితివి. మనము దివాణమువారి కడకంపిన వకీళ్ళిద్దఱును వచ్చియున్నారా మంత్రివరా ?

మంత్రి—వచ్చినారు రాజా !

ధర్మన్న—మహాప్రభూ ! వచ్చియున్నాము. తమసందేశమును ఖానుతో వాక్రుచ్చినాము.

రంగా—వాఁడేమనె ?

ధర్మ—వాఁడెంతయు రోషభీషణ నేత్రాగ్నికీలల నేరిసైనను దహించురీతిం గన్పట్టె.

రంగా—వాఁడట్లుంటకుఁ గారణమేమి ?

ధర్మ—గీ. వారిసైనికులిటకు రా వైరమూని
యందుఁగొందఱ యమియించిరఁట యితరులఁ
గాయములు గాయములుపడఁ గాందిశీక
తనువెసంబాఱఁగా మీరుతరిమితిరఁట.

రగా—తమ్ముఁడా ! మంత్రులారా ! సఖులారా ! చూచితిరా ? ఈదుష్కృతమును మనమెఱుంగముగదా. ఇది మన విరోధిరాజు పన్నినపన్నాగముగాఁ దోఁచుచున్నది. ఆహా ! ఎంతకార్పణ్యము వహించియున్నాఁడు. మనభూమిలో జరిగినది గాన మనమే చేసినామని తలంచుటకు వీలుగనున్నది కదా.

వెంక—వాఁడెన్నిటిసైనం జేయును. మనమొనర్చితిమని వారితోఁ జెప్పను. మనమేమిచేయఁగలము ?

రంగా—వాఁడేమనె ?

ధర్మ—క. అర్థాపేక్షను హైదరు
స్వర్థక్ప్రోల్బ్వడి మనలఁ జనుమనియెనుగా
వ్యర్థాలాపములేటికి
సార్థకవాహులమె ? పోవఁ జయ్యన ననుజా !

రంగా—మనల బెదరించుటకు నిట్లాడుట వారికి నైజమే.

వెంక—మనమట్లింతయుం దలఁపఁగూడదు.

శా. అన్నా ! యెంతటివెఱ్ఱివాఁడవు. గడీనన్యాయమే వీడిపో
మ్మన్నాఁడాతఁడు ఖానుఁడిష్టు మనలన్ మర్యాదలేకింతయున్
ఖిన్నంబౌగతి నెంచఁగూడదు సుమీ భీమాహవక్రీడకే
సన్నాహంబుదలంచె హైదరెద నిస్సందేహమేపాఱఁగాన్.

రంగా—కోరిన ధనమిత్తుమంటిమి. మనవలన నపరాధమేమి ? పిల్లల మేకలతోనున్న మనలను లేచిపొమ్మనుట మాటలా ? అట్టిపని వారేల చేయుమందురు ?

వెంగ—క. ఉత్తమధార్మికులగు మీ
రిత్తెఱంగున నాచరింప నీకొనరు. కృపా
చిత్తుఁడగు హైదరిత్త ఱి
నెత్తెఱంగునఁ బాటిఁజేయు నీధర్మంబుల్.

వెంకయ్య—వెంగళార్యుగారు సెలవిచ్చినది నిజము. మనము వేఱుగాఁ దలఁపఁగూడదు ఆఖానుండెన్ని మాటలఁ జెప్పిన యుద్ధమను మాటయేగాని సంధిమాట నొక్కటైన నుడువలేదు.

వెంగ—సోదరా! మీరింకను బెడత్రోవ సేయుచున్నారు.

మత్తకోకిల. వైరిభూపతి దుష్టవాక్తతి బాడబాగ్నిజనింప లోఁ
బారసీకపు సైన్యకంధియపారమై మనభూమి దు
ర్వారమౌగతి ముంపవచ్చెడి రావువంశ్య భుజాబలా
ద్ధారుణీధరరాజినడ్డము దార్చనక్కఱలేదొకో.

రంగా— మనమిప్పుడేమి చేయవలసియున్నది?

వెంగ—గీ. భానుక్రమింగఁగవచ్చు స్వర్భానుపగిది
హైదరుగ్రుఁడై సంగ్రామ మాదమెసఁగ
నున్నవాఁడింకఁ దగుప్రయత్నోత్కరంబు
మెఱయ సిద్ధముగానుంట మేలు మనకు.

రంగా—ఎందుకైనను మంచిదే. తమ్ముఁడా! అలాగే చేయుదము.

వెంకయ్య—గీ. సమరమిఁకమీఁదఁ దప్పని సరియొగాన
రేకపల్లివనాళిలో డాపకడనె
వనజవదనల నభిమానధనల నెల్ల
దాచ మేలగునని యెంచెదను విభుండ.

వెంగ—గీ. అడవిపాలు సేయుటది యెంతయును క్రూర
కర్మమెంచ వారుకడను లేని
దుఃఖమాత్మలోన దురటిల్లు మఱికొంత
యట్లు సేతకొప్ప నాత్మలోన.

రంగా—అరి రాజును వెంటఁగొని పరాసులతేఁడు మనపైఁ గ్రుమ్మరు నెడ మనము పాఱిపోయి దాగియుండుట మంచిపనియే? మేటిమగంటిమిగల పోటరుల సేకులు మనకుండ నిట్టి భయములే?

శ్రీరంగారాయ కదన సమవాకారము

గీ. సమరమునఁబోరి యాసూర్యచంద్రముగ న
ఖండవిజయముఁ బొందుట ఖ్యాతిగాని
గత్వరంబగు ప్రాణముల్ గాచికొనఁగఁ
గాన దాఁగుట తగవేది ఖ్యాతియగునె ?

వెంగ—అన్నయ్యగారూ ! బాపురే ! బాగుగఁజెప్పితిరి.

మ. స్ర. వెంగళ్రాయోగ్రదోర్భృత్పృథులవిశిఖదర్వీకరంబాజిహైదర్
జంగాఖిలాయుధీయోచ్చయహృదయనభస్స్వాంతముల్జగ్ధిగాఁగన్
గ్రుంగన్ రంగప్రభుండున్ త్రిభువనములనిర్నిద్రశుంభత్ప్రతాపా
భంగశ్రీమించఁడే? నాబలము నెఱుంగవే? చూపనున్నాఁడఁగాదే ?

పాపయ్య—నేనుండమీకెట్టిసంశయముగలుగఁగూడదు. ఏలనన

గీ. వైరిదుర్వారగాంభీర్యవారివాహ
పంక్తిఁజెల్లాకుచెదరుగాఁబాఱఁదోలు
తాండ్రపాపయ్యకల్పాంతధార్ష్ట్యజంఝ
యబ్ధులనుదాటిమాయమౌనట్లుగాఁగ.

చె. వెం.—గీ. మున్నురాజాముకోటనుముట్టడింప
బాదుషాయంతవానినిబాఱఁదోలి
జయము చేకొంటిహాయిదరుజంగనంగ
భీతిదేనాకుఁ? గరము సంప్రీతి గాని.

దమ్మన్న—గీ. గోత్రనాయక ! దమ్మనగోత్రభిదుఁడు
గోత్రమరుదందదామెరగోత్రమఖిల
యశముబొందఁగ నిజశితాస్యశనిధార
శత్రుగోత్రాచలంబులశాత్రవమునఁ
జెండిచెండాడునుద్దండభండనమున.

రంగా—మేటిజోదులారా ! మీపరాక్రమముల వర్ణింపనలవిగాదు.

వెంగ—మీకుమేమందఱముకావలెనా? మీబలంబుమీరెఱుంగరు. అనిమొనకుమీరొక్క
రేగిన రిపుసైన్యములు పంచబంగాళమైపారిపోవే?

రంగ—ఇట్టిదుర్గ మిట్టిసైన్య మిట్టి వీరులుఁ గలుగఁగనాకుభయమేల?

మత్త కోకిల. ప్రాణముండిన నేలెదక్ భువి రాజ్యమెల్లనుభోరునక్
ప్రాణమేగిన నేలెదక్ దివి రాజ్యమెల్లనుభోరునక్
జాణనైనకుటుంబి నాచును శాశ్వతంబగుకీర్తి చే
రాణువన్నను జంకనేల దురంబుచేయఁగఁబోవుచుక్.

వెంగ—సోదరాగ్రణీ! నిజము. చావునకు రెండు చావులుగలవా? జయాపజయంబులు దైవాధీనంబులు వారికెంతబలముండిననేమి?

రంగ—తమ్ముఁడా! సంధియొనగూడునేమోయని యాలోచించుచుంటినిగాని సంగ్రామంబునమకూడ వెనుకకడుగిడెదమా?

వెంగ—మీరుచెప్పినదే పౌరుషము.

రంగ—బంధువులారా! మిత్రులారా! మాతోపాటుయుద్ధముచేయ నిష్టమున్నరండు. లేకున్నమానుఁడు. ఏదోయొకవిధముగఁగృతనిశ్చయులరగుఁడు.

వెంగ—రాజా! మీరేసంగ్రామంబున కరుగనొకరింటివద్ద హాయినసుభవించువారలుగలరా?

వెంక—అందఱముమీవెంట నరుగుదెంచువారమే రాజేంద్రా.

రంగ—మంత్రివరా! అట్లయిన సంగ్రామసన్నద్ధులమైయుండవలయునుగదా! విజయరామరాజునకెదురొడ్డగు రాజాంకోటను ముందు సంరక్షింపవలసియున్నది. ఏమి మీయభిప్రాయము?

మంత్రి—నిజమురాజాగ్రణీ! రాజాముకోటబహుబలశాలి యురుబలంబుతో నుండవలసినస్థలము.

రంగ—ఎవ్వరినటకుఁబంపినబాగగు?

మంత్రి—మనతాండ్రపాపయ్యకంటె సమర్థులెవ్వరు స్వామీ!

రంగ—అవును. పాపయ్యా! మీరువెంటనేచతురంగబలసమన్వితులై చని రాజాంకోటను సంరక్షించుచుండుఁడు. ఆకోటపోయిన మనసర్వమునుబోయినదేసుమా.

పాపయ్య—మహాప్రసాదము స్వామీ! పాపయ్యనారసింహమచ్చటఁ గావలియుండఁబెరజంతువువచ్చి ప్రాణముతోఁ బోవనేర్చునే? ఆకోటపూచీనాయది కాని యిక్కడ బహు జాగ్రతతోనుండుఁడు. మఱియు.

గీ. మిమ్ము విడిచిపోవనేకొనకున్నది
నాదు డెందమహహ! నరవరాజ్ఞ

దప్పినడచుటయు నుదగవుగాదియ్యెడ
నేమి సేయువాఁడ నీశ్వరాజ్ఞ.

రంగా—పాపయ్యా! మాయందుఁగల ప్రేమాతిశయము కొలందిని మమ్ము విడనాడుటకు నీ మనసొల్లమి నేనెఱుంగుదు. ఆపనియైన నాదే గదా!

పాప—అయినను మిము వీడిపోవుటకు నా డెందెంబు గడుఁ గుందుచున్నది, నా మనంబున గల విచారలహరి వెల్లువయై పాఱుచున్నది. నే నేఁగఁజాల.

(అని కంటఁదడి పెట్టుకొనుచున్నాఁడు)

గీ. ఇప్పుడేమమ్ము నెడబాపనెంచి లేకట
దైవమా! యెంతపాపిష్ఠి జీవినైతిఁ
బ్రాణములతోన రాజును బాయవలసెఁ
జేతనగు దానిఁ జేయలేనైతినింక.

రంగా—ఏమి యీ వెఱ్ఱి పాపయ్యా! ఎందు కిట్టి సంతాపము. ఇప్పుడు నీకుఁ గల్గు భయమేమి?

శా. రంగారాయ నిశాతఖడ్గ మరివీరారణ్యమున్ జెండ స
త్తుంగాభీలరిపు ప్రతాపజలముల్ దుర్వారకల్పానిలా
భంగప్రౌఢిని మత్కరాసి మెఱయన్ బాపయ్య! నీ కిప్పుడే
భంగిన్ జేకురునయ్య యాపదలు? సద్భావంబుతో నుండుమా.

పాప—చిత్తము మీ గంభీరవాక్కులచేఁ గొంత ధైర్యము గల్గుచున్నది. ఏమైననసరే. పోయి వచ్చెదను. (అని సేనతోఁ గదలిపోవుచున్నాఁడు)

రంగా—మంత్రివర్యా! భూనభోంతరాళంబులు భోరుకొల్పుమునలిమానులొసంగినమన నిశానీ నౌబత్తును బజాయింపుమని నియమింపుము. మఱియు మనగడీలంగము చుట్టును దగు సైన్యముల ఫారాయుంచి గస్తుతిరుగఁ బంపుము. బురుజులపై మన శతఘ్నికాసంతతిని గుదురుపఱుపుము. బిరుదువస్త్రాదులఁ గొందఱిని రాజామదారిలో గొందఱిని గోటగుమ్మమువద్ద గొందఱిని బురుజుల సన్నిధిని గొందఱిని బురీద్వారంబున నుండఁ బంపుము.

మంత్రి—అట్లనే యొనర్చెదను రాజేంద్రా! (అని పోయి యట్లొనరించి వచ్చుచున్నాఁడు)

రంగా—శూరాగ్రేసరులగు దమ్మన్నప్రభృతి మిత్రవరులారా! మీరందఱును బాహువులను సారించుకొని జన్యంబునకో హటింపుఁడు.

దమ్మ—సిద్ధముగనున్నాము స్వామీ.

రంగా—సచివాగ్రణీ! తక్కిన సేనలకు యుద్ధంబు దెలిపి సిద్ధముగనుండఁబంపుము. పరశుపట్టిసముసలకుంతతోమరభిండివాల ముద్గరంబులకుఁ గరకువెట్టింపుము. బాణములఁ జికిలీచేయింపుము.

మంత్రి—మహాప్రసాదము భూవరా.

రంగా—శా. కల్పాంతోద్భవమేఘగర్జితమహాగాఢారవాఖీలమై
కల్పవ్యాకులరోదసీకుహరమై క్ష్మాస్థైభబాధిర్యసం
కల్పానల్పసమర్థమై భయదమై ఘంటారవాక్రాంతమై
పొల్పొందన్ వినవచ్చెడిన్సచివ! యాభూరిస్వనంబేమొకో.

మంత్రి—ఆలకించుచున్నాఁడు (అందఱునద్భుతపడుచున్నారు)

(చారులుప్రవేశించుచున్నారు)

చారు—రాజేంద్రా పరాక్. రావువంశ క్షీర పారావార రాకా సుధాకరా! పరాక్. వార్ధిగంభీరా పరాక్. గోపాలకృష్ణ రంగారాయక్ష్మావల్లభా పరాక్.

రంగా—ఏమిరావార్తలు?

చారు—పారసీకసైన్యమపారమైవచ్చుచుండఁగా నేమనియడుగుచున్నారా?

రంగా—వచ్చినదా? ఎచ్చటనున్నారురా?

చారు—వచ్చినదిస్వామీ ఇచ్చటికిక్రోశద్వయదూరమునున్న కాసారతీరంబున విడిసినారు.

రంగా—మంత్రిపుంగవా! మనమువిన్నధ్వనియిదేసుమా. ఏదోయనుకొంటిమి.

మంత్రి—వేఱేలగు? వారుయుద్ధముచేయఁగట్టితలంపునవచ్చినారు రాజా!

రంగా—చారులారా! వారిసేననుజూచితిరా?

చారు—మాఱువేషంబునఁబోయి చూచివచ్చినాము రాజేంద్రా.

రంగా—అద్దిరా! చారులారా! ఎంతపాటిది?

చారు—దేవా విజయరామరాజుసేన పదునొకండువేలజోదులు.

రంగా—మంత్రివరా! చూచితే! మనసేనకు మూఁడురెట్లదేయున్నది.

మంత్రి—రాజేంద్రా! వీరందఱు సేవకులుగాని సైనికులుగారు సారములేనిది గంపెడేల?

రంగా—చారులారా! బుస్సీసైన్యమెంత.

చారు—రాజాగ్రణీ! ఇన్నూటయేబండ్రుగుఱ్ఱపురౌతులు నాలుగుఫిరంగులు, ఏడువందలయేబదిమ్మంది లా, రాసు మొదలగు తెల్లవారును. బుస్సీసైన్యము మహాప్రభూ!

రంగా—అబ్బా! రిపుసైన్యార్ణవంబుదీర్ణంబై వెల్లువ్పెడిని. మంత్రి పుంగవా! మనసైన్యమెంత?

మంత్రి—రాజేంద్రా! మనబలము నాలుగువేలు మాత్రమే.

రంగా—ఈకొద్దిబలముచే రిపుల నోర్వఁగలమే?

మంత్రి—అదెంతపని? మనలో నొక్క శూరునికి వారందఱుఁ జాలుదురా?

రంగా—గీ. భారమంతయునిల్పి దైవంబునందె
గెల్చినను గెల్వకున్నను నిల్చియుండి
యాలమందున శత్రుల నోలమాన
గొనకపోరుటయే లెస్స కొంకులేక.

చారులారా! ఇంకను విశేషములేమి?

చారు—రాజేంద్రా! అచ్చట సేన విడియఁగానే మన నౌబత్తానా హైదర్జంగు కర్ణపుటభేదనంబుగావించినది.

రంగా—ఆపైని

చారు—ఆమీఁద హైదరుగ్రుఁడై విలయకాల రుద్రుని పగిది దండతాడిత వ్యత్యువుకరణి జగజ్జాలంబులొక్కుమ్మడిఁ గబళింపగమకించు కాళరాత్రివలె లేచి రోషభీషణానల కణంబులు నేత్రంబులఁ బొటపొటరాల రోషంబు గ్రక్కుచుఁ బండ్లు పటపట కొరుకుచు నొకరుతో నిట్లనె

రంగా—ఏమనెనో చెప్పుము.

చారు—గీ. "రణితభీషణ రోదోంతరాళకంబు
ప్రళయదిస్తాబ్ధి నిర్ఘోషవారకంబు
భీమవీరారి హృద్గ్రంధి భేదకంబు
భీమనాదంబు వినవచ్చెఁ బెలుచనెచట?" అని.

రంగా—నొకరేమనె?

చారు—మహాప్రభూ! నౌకరా.

గీ. "అయ్యా! సాహేబువర్యా! మీరాలకించు
నాఘనాఘన భీమగర్జారవంబు
రణముసాగింప బొబ్బిలి రంగరాయ
ఘనుఁడు మ్రోగించు నౌబత్తునినద" మనియె.

రంగా—ఆపైని ఖానుండెట్లనె.

చారు—రాజేంద్రా! సేవకునితో నిట్లనె. "సాహేబు సుబా యిచ్చటకనతిదూరంబున దండు దిగియున్నాఁడు. నీవిట్లెంతయును భయంబులేక నౌబత్తును బజాయించుచున్నావు. ఈపని మాని వెంటనే కోటవిడిచి లేచిపోయెదవా? లేదా? లేనియెడల తేపుదయమున యుద్ధప్రారంభమగునని చెప్పు" మని పంపియున్నాఁడు.

రంగా—మంచిది. చారులారా! మీరు పోయిరండు. (చారులు నిష్క్రమించుచున్నారు)

(హసనల్లీఖానుఁడు ప్రవేశించుచున్నాఁడు)

హస—రాజేంద్రా! సలామ్. మాయేలికగు హైదరంపఁగా వచ్చిన హసనల్లీ యనువాఁడ.

రంగా—మిగులసంతసంబయ్యె. ఖానుఁడా! యిట్లుకూర్చుండుము. (అని కుర్చీయిచ్చుచున్నాఁడు)

హస—భూమివరా! క్షేమంబే?

రంగా—మీదయచే నింతవఱకు సేమమే.

హస—రాజా! మీవంటి యౌదార్యసద్గుణగరిష్ఠుండు గలఁడె? మీప్రఖ్యాతి నేము వినుచుంటిమిగదా. అట్లనియెదరేల?

రంగా—మంచిది. ఖానవర్యా. నీరాకకుఁ గతంబేమి?

హస—భూకాంతా! మీరు మ్రోగింపఁజేయు నౌబత్తు మానివేయుమని బొబ్బిలివిడిచి లేచిపొమ్మని మీతో మా ఖానుండు చెప్పుమనె. ఇదియ సందేశము.

రంగా—గీ. పాదుసాగారు మున్ను మాపౌరుషమ్ము
మెచ్చియిచ్చెను నౌబత్తుమేలవింప
దొంగతనముగ మ్రోగించుదుమె యిటాడఁ
దగునె నాగుమటంచీరు ధర్మమెఱియ?

ఇంతేగాక. బలవంతముగ నితరులందరిమి యీసాలంబుఁ బట్టికొనియుంటిమా? మా తాతముత్తాతలు మొదలీస్థలంబున బంధుమిత్రకళత్రంబులతోఁ గాపురములఁ జేయుచుంటిమిగాని నిన్న నేఁడువచ్చినారమా? వెళ్ళిపొమ్మనుటేటిన్యాయము?

హస—గీ. నిజమరి వినుఁగాని యిటుల నిజమరి యిపు
డెటుల విననేర్చు హైదరు చటులదురుప

దేశమును బొంది యీనుండె దేశికునకు
దేశరూపంబు వోనాడి దేశమెల్ల.

రాజు—ఖానువర్యా! వానిమాటలు విని యిట్లనుట తగునా?

హస—మాసైన్యములో ముప్పదిమందిని జంపితివని మిగుల రోషావేశపరవశుండై యున్నాఁడు. అదేమి?

రంగా—నిజము దైవమెఱుఁగు. నీవెట్లనుకొన్నను సరే. ఆసంగతి నేనెఱుంగను.

హస—రాజా! అట్లే కావచ్చును. సముద్రమేఖలాపరీత భూమికధిపతియయ్యును దుర కబిష్ఠుఁడయ్యును నీవైరిరాజు కొండెములు విని నిప్పుద్రొక్కిన క్రోఁతివలె మండిపడుచున్నాఁడు. నేనేమిచెప్పినను వినఁడు.

రంగా—పంద్రెండుల్లక్షల శుభ్రములు లంచము గొని కాకిని గొట్టి గ్రద్దకు వేయుట మంచిదియే?

హస—రాజా! ఆతురక యట్లుచేసెదనని కత్తిముట్టి సమయంబానర్చెనఁట. ఎట్లు మానును?

రంగా—గీ. మమ్ము యుద్ధమందు మార్కొని జయమొంది
పురముచేకొనంగఁబోలుఁ గాని
తరమె పోరకుండఁ బురమును జేకొన
హరునికైన గోత్రహరునికైన?

హస—అదిన్యాయమే రాజేంద్రా! వలదని మేమెంతజెప్పినను వినఁడు

రంగా—పోనిమ్ము. వినకున్న నేమి? నలువదివేల సేన వారిది. నాలుగువేలు నాది. చూతువుగాని బలాబలంబులు పౌరుషాపౌరుషంబులు.

హస—రాజా! నామాట వినుము. ఎట్లైనను వారు దివాణమువారు. మీరుజమీందారులు. అధికారము వారిది. అహంకారము మీది. ఈపట్ల నామనవి వినఁదగు.

రంగా—అట్లంటివేని.

క. ఆరాజును నన్నిప్పుడు
పోరామి యొనర్పనిమ్ము పోడిమి మిగులన్
మారాజ్యము మాకొసఁగుము
మీరట్లానరింప మాకు మేలౌదవుఁగదా.

హస—అది నిజమే. అట్లీకొను నాథుఁడేఁడీ?

రంగా—అట్లుగాదేని !

గీ. జనులకెల్లనీతి సత్యమాడుటగాని
తురకదొరలనీతి దుడ్డెగాన
కొనుము వలయునంత కూర్పుము నాకిల
విజయరామరాజు వీడు ఖాన !

హాస—ఇంతెందుకు. వాఁడట్టి నీతుల వినువాఁడుగాఁడు. నీవు వినినను వినకున్నను నేను జెప్పవలసినదానిం జెప్పెద. తురకననుకొంటివేమో జాతిందురకనుగాని మనస్సున నట్లుగాదు. పలువర్ణంబుల తెఱంగే నెఱుంగుదు. దయాసత్యశౌచంబుల హిందువులంబోలినవారు లేరు. అందులో బ్రాహ్మణు లగ్రగణ్యులు.

రంగా—చెప్పుము ఖాన్ వర్యా వినెదఁగాక.

హాస—దండకము :—శ్రీరస్తు శ్రీరాఘు వంశాగ్రణీ ! రంగరాయక్షమావల్లభా ! సావధానుండవై విందువంచెంతయున్నమ్మదన్ గైకదుర్బోధచేఁ దండ్రిపంపంగశ్రీరామచంద్రుండరణ్యస్థలింబెక్కుకాలంబు కష్టంబులన్బొందఁడే ? ధార్తరాష్ట్రుండుగల్పింప నిక్కట్టులన్ బెక్కులంబొందఁడే ధర్మసూనుండు ఘోరాటవిందమ్ములంగూడి ? యయ్యో ! నలుండుగ్ర కాంతారసీమన్ బ్రియంబాసి దుర్బాధలంజెందఁడే ? గాధిసూనుండువెట్టన్ హరిశ్చంద్రభూపాలకుండొందఁడే చెట్టలన్ ? భూమిలోనెంతవారైన దుష్కాలమానన్నమా వేళఁ గష్టంబులం బొందఁగాలేదె ? తర్వాతసౌఖ్యంబులంజెందరే మంచిరోజుల్సమీపింప ? నారీతినే రాజచంద్రుండ ! యీదుష్టుఁడౌ ముస్లమాన్ ఖానుతోఁ బోరఁగా రాదు. ధర్మంబుశూన్యంబు నీతెన్నఁగాసున్న యేమంచుభావించితో ముస్లమాన్సీజనంభూతులన్ ? బ్రాహ్మణద్వేషమే ధర్మమన్యాంగనాసక్తియే యాత్మసంశుద్ధి యన్యాయమే నిష్ఠ దుర్వర్తనంబే తపం బెంచఁగా క్షోభమే నిత్య కర్మంబు సద్ధార్మికవ్రాతమున్గస్తిపాల్జేయుటే సద్వ్రతం బిష్టదైవస్తుతుల్ దుష్టభాషల్ గనన్ మ్లేచ్ఛగోత్రోద్భవశ్రేణికిన్ వారిలో ఖ్యాతిఁగన్నట్టి దుర్మార్గుఁడీమంత్రి యాదుష్టుతోఁబోరుటల్మానుటేయుక్తమౌ నిత్తఱిన్ బొబ్బిలిస్వీడి యెందేనిఁ గాలంబు సంప్రాప్తమౌదాఁక నుంటే కడున్ శ్రేయ మామీఁద మీయిష్టమౌనట్లు రాజ్యంబునర్వంబు మీవౌను నిక్కంబు నామాటపాటింపుమీపట్ల రాజన్యచంద్రా ! యశస్సాంద్ర ! రంగాధిపేంద్రా ! జయమ్.

రంగా—ఆహా! ఎట్టి సలహా జెప్పితివి? అరాతిభూపతి స్వోదరంబున కరుదెంచు చుండ నన్నడవులఁ బ్రాణంబులు దాచుకొనుమనుచున్నావా? ఇంతకంటె రావు వారికి దుష్కీర్తి కలదా?

హస—అట్లైన మీయిష్టమట్లు మొనరింపుఁడు.

రంగా—క. ఇంతిమ్మని చెప్పిన ధన
మంతయు నీఁగలము విడువ మావాసపువీ
డంతయుని పురముజేరు ట
డెంతయు మేల్మారు బిరుదు నీఁగుటకంటెన్.

పోనిమ్ము క్రీస్తుశకమునందు బదునేడువందల యేఁబదియేడవ సంవత్సరమున జనవరి నెల నిరువదినూఁడవదియగు నీదివసంబ నాయాయుష్కాలంబునకుఁదుది రోజని యనుకొనియెద. అర్థమంతైననిత్తు నక్కఱలేకున్నఁ బ్రాణముల విడుచువారమే కాని యిట్టిపౌరుష హీనంబులగు పనులొనర్చువారముగామని చెప్పుము ఇంత కంటె నేననవలసినదిలేదు.

హస—అట్లయిన రేపుదయముననే యుద్ధము ప్రారంభమగునని హైదరు మీతోఁజెప్ప మనె. తయారుగనుండుము రాజా!

రంగా—మంచిది హసనల్లీఖానుఁడా! మేమీరోజుననే నౌబత్తును మ్రోగింపఁజేయించు చుంటిమిగదా!

హస—రాజేంద్రా నేనుబోయివచ్చెదను.

రంగా—మంచిది పోయిరమ్ము.

(హసనల్లీ నిష్క్రమించుచున్నాఁడు).

మంత్రివరా! వింటివిగదా? రేపుదయమున నేయుద్ధమారంభమగునని హసనల్లీచెప్పి పోయె మనమును దయారుగనుండవలెను సమస్తమును సిద్ధముగనుండెనా?

మంత్రి—సర్వసిద్ధముగ నున్నది రాజా!

రంగా—అట్లయిన నేనుముందుగ సంగరంబునకేగెద మీరందఱును వేఁకువలేచిపోయి బురుజుల సంరక్షించుచుండుఁడు.

మంత్రి—ఆయేర్పాటంతయును జేసెదను స్వామీ!

రంగా—ఇప్పుడేబొబ్బిలిరాజ్యమున వెంగళ్రాయనికిఁ బట్టముగట్టి యుద్ధంబునకుఁ బో యెదను సఖివా! సమస్తమంగళ ద్రవ్యంబులఁదెప్పింపుము!

మంత్రి——జాగ్రత చేసెదను రాజేంద్రా! (అని సమస్తమును దెప్పించుచున్నాఁడు)

రంగా——వెంగళ్రాయని సింహాసనంబునందునిచి.

గీ. ధరణి నేలెద వాచంద్రతారకముగ
రిపులనోరిచి తమ్ముఁడా! విపులకీర్తి
నందఁగావుత రావువంశాంబురాశి
నీదురాజత్వమహిమచే నిక్కువముగ.

(అని యాశీర్వదించి యక్షతలఁ జల్లుచున్నాఁడు).

వెంగ——(కన్నులనీరునిండ) అన్నగారూ! మీరిట్లేలచేసితిరి?

గీ. అన్న నీవిట్లు చేయుట యిదియమంగ
ళముగఁదోఁచెడి నాకిట్టిసమయమునకు
నీదుపట్టుశెపనుదెంతు నేనుగాని
రాజటంచును నన్నీడరాదుసుమ్ము.

రంగా——తమ్ముఁడా! రాజుసంగరంబున కరుగుతఱి సింహాసనంబున నేరిసైన నునిచి పోవలె. అట్టిదరాజ్యనీతి గనుక నిట్లుఁజేసినాఁడఁ గానిసంగ్రామ రంగంబున భంగంబునకు మదిఁగలంగి కాదుసుమీ.

వెంగ——అట్లయిన సరే. (అని కన్నీరు దుడుచుకొనుచున్నాఁడు)

రంగా——సేవకా! చినరంగారావు నిటుల నెత్తుకొని రమ్ము.

సేవకు——చిత్తము స్వామీ. (అని పోయి తీసికొనివచ్చుచున్నాఁడు)

రంగా——(పిల్లవాని నెత్తుకొని) తమ్ముఁడా వెంగళ్రాయఁడా! ఈపిల్లవానిని నీయధీనము సేయుచున్నవాఁడ. వీనిని నీయన్నగా భావింపుము.

వెంగ——దుఃఖమాపుకొనలేక దుఃఖించుచు.

గీ. అన్నగారని యాపిన్నయన్న నెంచ
నేల యన్నయ్య! నీకేమి యెగ్గుగలుగు
యుద్ధమందున? నట్లైన నుర్వియేల?
రాజ్యమేలయ్య? నాకిట్టి ప్రాణమేల?

రంగా——తమ్ముఁడా! సంగరంబున జయాపజయంబులు దైవాధీనంబులు గదా. ఎటువచ్చి యెటుబోవునో! గనుక యిట్లుచేసితి. విరుద్ధమేమి? అని

(వెంగళ్రాయనిపై మంగళాక్షతలఁ జల్లుచున్నాఁడు.)
మంత్రివరా ! నే నిదే యుద్ధమునకుఁ బోవుచున్నాఁడ.
(రంగారావుపై దేవతలు పుష్పవృష్టి గురియుచున్నారు)

ఆకాశవాణి— (శబాస్. భూమియందు రంగారావే వీరుఁడు. జగద్విశ్రాంత కీర్తి గ బడయును గాఁత)

రంగా— బ్రాహ్మణుల కనేక దానంబులఁ జేయుచున్నాఁడు
(అందఱు నిష్క్రమించుచున్నారు)

FOR REFERENCE ONLY
శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషానిలయము
సుల్తాన్ బజార్, హైదరాబాద్. 1.

శ్రీరంగారాయకదన సమవాకారము.

తృతీయాంకము.

విష్కంభము.

(నాగోజీరావు లక్ష్మన్న ప్రవేశించుచున్నారు,)

నాగో—లక్ష్మన్నగారూ! వింటిరా. రాత్రిసమాచారము? హసనల్లీఖానుఁడు రంగారావు సన్నిధానంబున కేగి తనమాటలయందు నమ్మకముపుట్టించి తనపంపుఁజేయింప నెంచి యసంగతంబగు నాత్మీయ కులదూషణంబు నరాతి కులభూషణంబును గావించి నిజముట్టిపడునట్లునటించి పోల్విడియేగుమని యనేకవిధంబులవాక్రుచ్చ నారాజు కోట వదలనని సౌబత్తు మానని యన్యాయంబుగఁ బైనెత్తివచ్చినఁ బ్రాణముతోనైనఁ గోల్పోవ నిశ్చయించుకొన్నారమని వర్తమానమంపఁగ హైదరుగ్రుడ్డై విలయకాలదహనునిభంగి మండిపడుచు వారినీక్షణమునఁ బ్రోలుపైవెళ్ళఁగొట్టెదనని గర్జిలు చేయుచుండఁగా నెంతధైర్యశాలియోగాని మన హసనల్లీయెదుర్కొని హైదరుతో "ఇట్లునీతిలేక మాట్లాడుట న్యాయంబుగాదు. అడిగినంతపైకంబీయమని యనిరా? రావువారు దివాణముపై నయముదప్పి ప్రవర్తించిరా? రాజు దుర్బోధనచే మీరిట్టిదుర్ణయమునకొడిగట్టికొనుట న్యాయంబుగాదు. రావువారభిమానధనులు. శౌర్యాన్వితులు. ఆపైని నిరపరాధులు. వారిపై నిష్కారణము దండెత్తుటలధికార మదోన్మత్తతావిశేషములు. గాని వేఱుగావు. తప్పులేనివారిపైఁదప్పు సంఘటించి సమరంబు చేయనెంచితిరి. వారెందఱిని మట్టుబెట్టెదరో యోచింపుఁడు. తాతలనాటినుండి గ్రామము వదలక కనిపెట్టుకొని శిశుబాలవృద్ధులతోఁ గాపురమున్న వారి కొంపలకగ్గిముట్టింప నెంచితిరిగదా! ఆపైని ఖుదా మిమ్మెట్లు చేయనున్నాఁడో? ఎదిరిచావును దమచావు నెఱుంగక పోరు రావువారల నెదుర్కొను వెట్టులుగలరా? ఆబుస్సీ యెట్లేకొనె. ఇప్పుడైన ధర్మంబుదప్పక నడచుట మంచిది. అడిగినంతధనము నిత్తుమనుచుండ వారిని జంపనుంకించుట మిక్కిలి పాపకృత్యము. ఆపాపము మనలఁ గట్టికుడుపక పోదు. న్యాయము చెప్పితిని. మీరేమి చేసినను సరే" యని యనేక విధంబుల నధికారియని యింతయుసందేహింపక మిగుల ధైర్యముతో వాక్రుచ్చ వాఁడలిగి ఖానునిమాటలు లక్ష్యముచేయక వానిం జేయునదేమియు లేక

బుస్సీతో రహస్యముగ ముచ్చటించి బొబ్బిలిరాజుపైఁ గొండెములు నూరిపోసి యెట్టకేలకు యుద్ధమునకు సెలవిచ్చునట్లు చేసె. బుస్సీయు నుదయముననే సమరంబునకుఁగడంగుఁడని యాజ్ఞనొసఁగె. ఇదియసమాచారము. మనమును యుద్ధసన్నద్ధులమై పోవలెను. పద. సమస్తము దైవాధీనముగాని మనవలన నయ్యెడు నదేమియులేదు. కానిమ్మెట్లుజరుగునో చూతము.

(అని నిష్క్రమించుచున్నారు)

రంగము :—యుద్ధరంగము.

(ఉదయముననే యిరువాగుసేనలు నెదురుగ దార్కొనఁగా)

హైద—లాసూ! మీసైన్యముతోఁ బోయి బురుజుల స్వాధీనము చేసికొనుము. వీరభటులారా! మీధైర్యంబులఁజూపుటకిదే సమయము.

భటు—ఖాన్‌వర్యా! మాకు రంగారావన నెంతటివాఁడు? ఇదేపోవుచున్నాము.

రంగా—వెంగళ్రాయఁడా! మీరందఱెచ్చటనున్నారు?

వెంగ—మహాప్రభూ! మేము తక్కిన మూఁడు బురుజులమీఁద నున్నారము కొంతమంది కోటక్రింద సమగంబునకుఁ దాఁగియున్నారు.

రంగా—మంచిది జాగ్రతగ నుండుఁడు.

(రణభేరి మ్రోగుచున్నది. యుద్ధమారంభించుట. ఘంటానాదముప్రవర్తించుచున్నది)

(రంగారావు లాడూఖానుల యుద్ధము)

లాడూ—ఓరీ! మాతో నేలబోరెదవురా? ప్రాణములపై యాశలేదా? నీవా మమ్ములను గెల్చువాఁడవు?

రంగా—శా. ఓరీ మూఢుఁడ! క్రూరచిత్త! విను జన్యోర్వీస్థలిన్ బోరి నీ
దారాపుత్రులు శోకమంద మడియందర్పించుచున్నావు రం
గారాయోగ్ర నిశాతమార్గణ భుజంగంబేచ్చి యుగ్రాకృతిన్
గోరల్గీరుచునున్న దిప్పుడిటగో గ్రోలున్ భవత్ప్రాణముల్.

లాడు—పట్టిదంభములనేల పేలెదవురా? చూతువుగాని నాశక్తి.

(అని తుపాకీ కాల్చుచున్నాఁడు)

రంగా—తప్పించుకొని వానిపై బాణవృష్టిఁ గురియించుచున్నాఁడు.

(లాడూ మృతి. పారసీక సేనాకలకలము)

సైని—(హయిదరు వద్దికిఁబోయి) మహాప్రభూ! మన లాడూఖానుండు రంగరాయని

నిశితబాణపరంపరల కోర్వఁజాలక కాలధర్మంబునొందె. తత్సైనికనికాయంబును గాందిశీకులై పాఱిరి. ఏమిసెలవు ?

హైద—గీ. ఊడెఁగాలాడు! రంగరాయోగ్రనిహతి
లాసూ! నీవేగి తత్క్షణంబ రిపులనోర్చి విజయంబుఁ జేకూర్పుము.
నీవుగలుగఁగ నాకిల నిర్భయంబు
మున్ను జరిగినయుద్ధములలో నీవలననేకదా మాకుజయంబు చేకూరె.
రంగరావెంత నీకుసంగ్రామ సీమ
జయముగైకొనిరమ్ము నీజవము మెఱయ.

లాసూ—అదెంతపని ? స్వామీ ! చూడుము నాబలము. (అనిపోపుట)

(రంగరాయ లాసూఖానుల యుద్ధము.)

లాసూ—గీ. లాడుఁజంపితి నంచు నీవాడఁబోరు
షంబె? నసైల్వ మింక నీశక్తితెలియు.

రంగా—గంతుగొనియెదు నాశ్రాండ కాండములను
నిల్చిపోరుము నాతోడ నిముష మీచెట.

లాసూ—ఓరిరాజన్యాధమా! ఏమీ డంబములురా! ఏదీ! నిలువఁబడితి. చూపుము నీశక్తి ?

రంగా—ఓరీ పారసీకాధమా! నీకుఁ గాలావసానంబగుటనే నాతోయుద్ధంబు సంభవమైనది. ఇదెకాచుకొనుము (అని బాణమును వదలుచున్నాఁడు)

లాసూ—సైనికులారా! బురుజెక్కుఁడు. ఎక్కుఁడు. ఇదేసమయము. పైనుంచి యీ రాజాధముఁ డపరిమిత కాండములనేయుచున్నాఁడు. ఎక్కి—నంగాని వీనిమట్టు పెట్టఁ జాలము.

సైనికు—ఎక్కుచున్నాము. ఎక్కుచున్నాము. (అని యెగఁబ్రాకుచున్నారు)

(రంగారావు బాణములచేఁ గొందఱు నేలఁ గూలుచున్నారు)

లాసూ! ఎక్కడనున్నావు? నీవెక్కవేమి ?

లాసూ—ఇదే నేనును వచ్చుచున్నాఁడ. (అని సైనికుని భుజములపైఁ గాల్మోపిచి యెక్కుచు రంగారావు బాణహతిచే నేలఁగూలుచున్నాఁడు.)

సైని—(హాహాకారంబులు సెలంగ హాయిదరుంజేరి)

సాహేబా! సైన్యమంతయు నంతంబునొందె. లాసు గతాసుండయ్యె. ఇంకేమి

సేయుదుమయ్యా?

హుసే—ఓహో! ముకురల్లీఖాన్! సిద్దిబిలాల్! జానుఖాన్! హుసనల్లీఖాన్! ఏలచూచెదరు? పాదుషాలాసులను మట్టుపెట్టి రంగారావుకుక్క మిగిలియున్నాఁడట. తక్షణము మీరేగి యాశూరుని బరిమార్చిరండు.

ముకు—తమసెలవుకొఱకు నిరీక్షించుచుంటిమిగాని యిదెంతపని?

(అని రంగారావునెదుర్కొను చున్నాఁడు)

రంగా—గీ. ఓరి! నెయ్యుర లాడుఖానాళిఁగూడఁ
బోవనున్నాఁడవే? భళీ! నీవస్నేహి
తుండ వన్నఁగో నిస్ఫురదుర మదీయ
యాజివంజవ బాణౌఘు మనుచు నటకు.

ఇదేమదీయమాయుగము ప్రవర్తిల్లెడిని. (అని వదలుచున్నాఁడు)

ముకు—బాదుషాలాసూలనుకొంటివేమో కాదుసుమా. నేను ముకురల్లీఖానును జాగ్రత్త.

(అనియొక తుపాకీని గాల్చుచున్నాఁడు)

రంగా—(తప్పించుకొని మూఁడుబాణముల నేయుచున్నాఁడు)

ముకు—బిలాల్! రా. జానూ! ఎక్కవేమి? హుసనల్లీ! చూచెదవేల?

జానూ—ఎక్కుచున్నాము. గాని.

క. పైనుండి దేహమెటిఁయఁగఁ
గోణంబుననిల్చి రాజు కోపోద్దీప్తిన్
బాణానలంబు గురియఁగఁ
బ్రాణంబులఁ జిక్కఁబట్టి ప్రాకఁగ నెట్లా?

కాని! ఏమానో ఎక్కివచ్చుచున్నాము.

రంగ—ఉగ్రుండై (తనలో) ఆహా! వీరు బురుజులపై కెక్కుచున్నారు.

శా. ఓరి! మిమ్ములనెక్కనిత్తునె? గడీ నోహో! యముంజేరి మీ
పీరాలాంబరములుగ్గడించి పరము ల్పే పొందిరం డిమ్ములన్

(అనుచు నిస్త్రింశోత్రయముఁగొని వారివెడందయురంబులపై గురికొనియేయ నేల గూలుచు)

బిలాల్—ఓరంగావనిభర్త! చంపితివె మమ్ముగ్రాశుగౌఘంబుచే
దారాపుత్రులకేమిదిక్కగుఁక ఖూదా! ఖాతేయి నల్లానబీ.

(అని ప్రాణములు వదలుచున్నాఁడు. ఈకేకలువిని సైనికులాక్కడ్డమిడిఁ దెగువఁ దెచ్చుకొని పైకెగఁ బ్రాకుచున్నారు)

బుస్సీ—యోధవీరులారా! ఘటికాద్వితయంబు కాలంబు సమరంబుచాలింపుఁడు.

(అందఱు నాయుధములు నేలవైచి శ్రమలఁ దీర్చుకొనుచున్నారు)

రంగా—(తొందరతో) ఆహా! నలుమొగంబులం దురకలు దండోపతండంబులుగ నెగఁబ్రాకి పైకెక్కుచున్నారు. అదె కొంతసైన్యమిదివఱకె యెక్కివచ్చె. ఓహో వెంకయ్యగారూ! వెంగళ్రాయఁడా! దమ్మన్నగారూ! ఎక్కడనున్నారు? వేగ యిటురండు.

వెంక—చిత్తమేమిసెలవు? అందఱమిక్కడనే యున్నాము.

రంగ—వీరు లగ్గలకెగఁబ్రాకిరి. వీరినాంచుట శక్యముగాఁ గన్పించుటలేదు. అందఱు నెక్కిరా కోటఁదీసికొన్నవారే. కోటపోయెనా వైరిరాజు దుర్వృత్తివల్లనైననేమి మఱేకారణమువల్లనైననేమి స్త్రీల నమానుషపఱతురు. గనుక

గీ. ప్రాణములకంటె నెక్కుడుపౌరుషంబు
గాన శుద్ధాంతకాంతల మానుషము
నిల్పఁగాసాధనంబీరు నేర్పుమీఱఁ
జెప్పఁడిప్పుడలేకున్నఁ జేటుబుట్టు.

వెంగ—అన్నా! మునుమున్న వారియభిప్రాయంబెఱింగి తదనుకూలముగఁ బ్రవర్తిల్లుట మనకావశ్యకమైయుండ నిప్పుడాలోచనకేమున్నది.

గీ. సంభవించెనుమనలకు సంఘమరణ
కాలమిప్పుడు శంకింప నేలయన్న!

రంగ—సత్యమదితమ్ముఁడా! యింక సంశయింప
నేల కృత నిశ్చయుఁడనైతి నికనేను.

చెలికాని వెంకయ్యా! కోటబురుజులపై వేనవేలు యవనులు పారసీకులెక్కి, నాదిక్కున కదెవచ్చుచున్నారటు జూడుము. మనము యుద్ధము తిరిగి ప్రారంభము సేయునంతలో వీరందఱును బైకివచ్చెదరు గాన నీవుతత్క్షణంబేగి శుద్ధాంతకాంతల నబంధుమిత్రంబుగ శిశుబాలవృద్ధులతోఁ గరవాల నికృత్త కంఠల నొనర్చి వేగ రమ్ము. ఆలోచించినం బ్రయోజనము లేదు. త్వరగాఁబొమ్ము. ఆలోచింపకుము.

వెంక—కత్తిదీసికొని పరుగెత్తుచున్న సమయంబున సైన్యభూమి కంపమొందుచున్నది. తారలు డుల్లి నేలవ్రాలుచున్నవి. (తనలో) ఆహా! దైవమా! ఎట్టిపాపిష్ఠ జన్మ మెత్తితిని? ఎట్టిపాపకృత్యము నావంతు జేసితివి? పురాకృతంబున నెట్టి దుష్కృతం బొనర్చితినోగదా! కేవలము కటికివానిపనికంటె నెక్కుడు పాపకార్య మొనర్పవలసి వచ్చినదే? ఇట్టిపనికి ముజ్జగంబులఁ దగినవారు లేక నన్నారసితివా?

శా. ఆహా! దైవమ? యెట్లుచంపుదును నేనంతఃపురస్త్రీతతిన్
బాహాసిన్ హరిణాంక బింబముఖులన్ బద్మాక్షులన్ బాపము
త్సాహంబెంతయు మీఱనుండు నజపోత వ్రాతముంబోలె స
ద్గేహంబందున నుండువారి కెటులన్ గీడెంతు నే నక్కటా!

గీ. ఆడువారిని జంపుట కూడదంచుఁ
దెలిసి యపకృత్యమున్ జేయవలసె నాకు.
నిట్టిపాపిష్ఠ కార్యంబు నెఱపు కొఱకె
జన్మమెత్తితిఁగాఁబోలు జగతియందు.

ఇందుకై సిద్ధముగానున్న యీబాహువును ఖండించుకొనిన బాగుగనుండును.

(అని తెగవేసికొనఁ బోవుచున్నాఁడు).

కంచుకి—(చేయి బట్టుకొని) వలదు. వలదు. ధైర్యమూనుము. (అనియాపుచున్నాఁడు)

వెంక—ఛీ! భార్యయనక బిడ్డలనక రాణియనక వృద్ధులనక యందఱిని జంపుట కెట్లు చేయివచ్చును? హా! దైవమా!

ఉ. ఎంతటివాఁడ వైననగు దీవిదె దైవమ! నీదుచేతలున్
వింతలు ముజ్జగంబున దివిన్ భువి నీతలక్రిందు సేయు సా
మంతము మెచ్చవచ్చును సుమా యపరాధము లేని వెల్మస్త్రీ
కాంతులఁ జెట్టుకాయవడి ద్రుంచెడునట్లుఁ జేయ నెంచితే?

అనుచుఁ బరుగెత్తి దూరమున మల్లమాంబదేవింజూచి

ఉ. మల్లమదేవి! సర్వజనమాన్య చరిత్రి! సుశీల! సాధ్వి! సం
సల్లలితాంగి! దీనజన పాలక కల్పకవల్లి! లోకులన్
జల్లని చూపుచూచు విలసత్కృప గల్గినతల్లి! నీక య
బ్బల్ల! పొసంగుటిట్టి దురవస్థ? యిదెక్కడి కర్మమక్కటా!

(అని గోలుగోలున నేడ్చుచు వెంకయ్య మల్లమాంబదేవి చెంతకరుగుచున్నాఁడు)

రంగము :—రాణివాసము.

(మల్లమ్మాదేవి కూర్చుండియుండఁగా వెంకయ్యయేడ్చుచుఁబ్రవేశించుచున్నాఁడు)

*మల్లమ్మ—వెంకయ్యా! నీవువచ్చినపని నాకుఁదెలిసినది. చెడువార్తలు చెవినిబడకుండఁగనే నీకత్తి నాచేతికొక్కసారి యిమ్ము. (అని లాగిపుచ్చుకొని చెంతనున్నదానిం జూచి) దాయీ! నీవీపిల్లవానిం గొంపోయి సామర్లకోటలోఁ బినతల్లివద్ద దిగవిడిచి రమ్ము. (పిల్లవానింజూచి)

హా ముద్దులకుఱ్ఱా! చిన్ననాటినుండి యింతవఱకు నాచనుబాలఁ బెరిగితివి. ఇంక నీకుఁ బాలియ్యనోచనైతినా తండ్రీ? నీజనకుండు రణరంగంబునంగల్గిన యధైర్యముచేత శుద్ధాంతకాంతావ్రజంబు నాబాలగోపాలమ్మను జంపుమని యిదే పంపియున్నాఁడు. అమానుషముకంటె నిదేమంచిది. కాని

శా. కట్టా! ముద్దులపట్టి! చెట్ట చెడుగుల్గానంగలేకున్నని
న్నెట్టీ పట్టునడించిపోయెదను? నీకేదిక్కు? ఇంకెవ్వరి
క్కట్టుల్ ద్రోయుదు? రేమిసేయుదు? నిదేకర్మంబా నీపాలికిన్
బుట్టెన్ దైవముకంటికింతబరువైపోతే కుమారోత్తమా?

ఇంకను యువరాజ్య పట్టాభిషేకముఁ బొందెదవు. బొబ్బిలినేలెదవనుకొంటింగాని దాదికినొప్పగించి ప్రాణముల దక్కింతునని యనుకొనలేదు. హాపుత్రా! నాభాగ్యరాశీ!

ఉ. తెక్కలురావు. ఆకలినెఱింగెడివాఁడవుగావు. మిక్కిలిన్
బొక్కెదు తల్లియొక్కక్షణమున్గనిపింపనిపట్ల. బిడ్డ! యిం
కొక్కెడఁబాలుద్రావ, వెటులుండెద, వెవ్వరుపెంచువారు, ని
న్నక్కట దిక్కుమాలిన దురాగతుఁజేసెనె? దైవమిత్తఱిన్.

హా ముద్దులకుమారా! తల్లిలేక యెంతయేడ్చెదవో. పాలులేక యెంతపొగిలెదవో. హా కుమారా! ఈశ్వరుఁడు నీయెడల నెంతదారుణము వహించెనురా! కన్నబిడ్డా! చిన్నిపుత్రా! చినరంగరాయా!

ఉ. చిన్నికుమార! వెల్మకులశేఖర! యోచినరంగరాయ! మా
యన్న! యనుంగుఁగుఱ్ఱ! లసదానన నిర్జితచంద్రబింబ! వి

---

* The Ghosha of Mallamma Devi should strictly be observed by placing a screen in front of her so that her person alone may not be seen by the audience.

ప్రపన్నుత ధైర్యధుర్య! సముదారగుణోదయ! తండ్రి! యేలరా!
చిన్నతనంబునందె పలుచిక్కుల పాలయిపోతి వయ్యయో.

నావంటి నిర్భాగ్యురాలికి నిన్నుఁజూచి యానందించు భాగ్యమెక్కడిది? దిక్కుమాలిన పక్షివై తివే? (అని పలుమారు మూర్ధాఘ్రాణ మొనర్చుచు)

ఉ. మామక శత్రుసంతతి యమానుషమున్ గని చావబుద్ధియౌ
నీమొగమున్ గనుంగొనిన నిక్కము చావఁగబుద్ధిపుట్టె దిం
కేమి యొనర్చువాన విధి యెట్లుఁ జేయఁగనున్నవాఁడొ? నిన్
భూమిని నొంటిగా విడిచి పోవుచునుంటి నిబుత్ర! నిర్దయన్.

కుమారా! చినరంగరాయా! తండ్రిశౌర్యము నిలువఁబెట్టుము. తొల్లి శ్రీరామచంద్రుండడవికిఁ జనుచున్న తఱిఁ గౌసల్యామహాదేవి తనతనయునకిచ్చిన దీవనలే నీకగుఁ గాత. తొల్లి తల్లిచెరఁబాపనమృతంబునకై మాహేంద్రపట్టణంబునకుఁ జనునప్పుడు వైనతేయునకు వినతామహాదేవి యొసంగిన వరములే నీకును మేలొనగూర్చుఁగాక. సవతితల్లిచేఁ బెక్కుకట్టులంబడి ధ్రువుండడవికిఁ జనుతఱిఁ దల్లి యాబాలున కిచ్చిన యాశీర్వచనములే నిన్నేలుఁగాక. సూర్యచంద్రాది గ్రహంబులు భూగగనంబులు త్రికాల సంధ్యలు త్రిమూర్తులు నిన్నాచంద్రార్కము రక్షింతురుగాక. ఇంకొకసారి ముద్దిమ్ము

హా తనయా! హాకోటిసూర్యప్రకాశా! హాసుకుమారా! హాబొబ్బిలిశౌర్యాకారా! హాపసిబిడ్డా!

ఉ. కాలము పోయెఁ గా పశమె? కన్నులనిండఁగఁగన్నబిడ్డ! నీ
మేలును గాంచి మోదమున మించెడి ప్రాప్తము లేదు నా కికన్
బాలక! చాలవృద్ధిగని పౌరుషకీర్తులఁ జెంది లోకమున్
బాలనఁ జేయు మనయునఁ బ్రస్తుతి సేయుఁగఁ బెద్దకాలమున్.

హా! కుమారా! (అని గోలుగోలున నేడ్చుచు ధైర్యము తెచ్చుకొని) దాయీ యిప్పుడు బానిని క్షేమముగఁగొనిపోయి యొప్పగించిరమ్ము. వెంకయ్యా! నీకాలస్య మగుచున్నదా? (మొఖము వంచుకొని యేడ్చుచున్న వెంకయ్యంజూచి) బొబ్బిలిబెబ్బులి యింతపఱదు సేమంబుగ నున్నాఁడా?

వెంక—ఏడ్చుచు క్షేమముగనున్నాఁడు తల్లీ!

మల్లమ్మ—అట్లయిన బహుధన్యురాలను. అతివలకు భూతలంబున భర్తృవియోగంబు కంటె హీనస్థానము బతికియున్నఁ సంభవించు మరణంబుకంటె భాగ్యమును లేదు. పురాకృత

జన్మసుకృత పరిపాకంబునంగాని పుణ్యస్త్రీమరణంబుసంభవింపదు. చిరకాలము కలియుగదేవేంద్రుఁడైన రంగారాయోర్వీపతికి భార్యనైయుండి వీరబొబ్బిలికిరాణినై మల్లమాంబదేవియనిఖ్యాతినొంది తుదకు శత్రురాజుల యమానుషంబునకులోనుగాక చెడుమాట చెవినిబడకుండ నాభర్త చిరాయుష్యకాముఁడైయుండ నేనుముందుగా స్వర్గపథంబువట్టి పోవుటకంటె సుకృతంబేమిగలదు ? వెంకయ్యా ! నీకాలన్యమగుచున్నదా ? సూర్యచంద్రాదిగ్రహంబులారా ! అష్టదిక్పాలులారా ! జాయాసహిత త్రిమూర్తులారా ! బొబ్బిలిపురీవాసా ! యీశా ! ఈదివసంబున వీరబొబ్బిలి రాణి యగు మల్లమాంబదేవి విజయరామరాజు తురకలంగూడి యొనర్చునమానుషంబునకు వెఱచి నిశితకరవాలధారచే బ్రాణంబులఁ దొఱంగుచున్నది.

ఉ. ఏను బతివ్రతామణినయేని ధరాసురభక్తిలోనఁ బెం
పూనితినేని సచ్చరిత నొంది చరించితినేని నావిభుం
డేనయశౌర్యశాలియగునేని దురాగతి మెంచినట్టి దు
ర్మానితుఁడైన యావిజయరామునివంశము భ్రంశ మొందుతన్.

అనిపాడుచుకొని భూమిపై నొరుగుచున్నది.

(ఆకాశవాణి) “ఇమ్మహాపీరపతివ్రతాశాపంబున నట్లకాఁగలదు. ఆధాత్రీకళత్రుండు సపుత్రమిత్ర కళత్రంబుగ మల్లమాంబదేవి శాపవశంబున మూఁడవదినంబున గంతుగొనఁగలవాఁడు. (ఘోరమగు కలకల్లము) *

వెంక—(తక్కినవారినిజూచి) అయ్యో ! పెనుభూతమువలె నన్నెట్లుచూచుచున్నారు! (వడంకుచు నేడ్చుచున్నవారినిజూచి) హాదైవమా !

ఉ. మాటలురానిపిల్లలను మాటికిలేవఁగలేనిపెద్దలన్
నీటులుమీటుబోటులను నిక్కుపుఁబోటరిబోలెఁజంపనే
నేటికిఁబుట్టినాఁడనొకొ యీశ్వర ! యక్కటికంబులేక యె
ప్పాటున మేకలన్గటికివాఁడుదలల్దునుమాడునైపడిన్.

మత్తకోకిల. తప్పునేయ రెదుర్ప రెవ్వరి దోష్యమింతయుఁజూప రొ
క్కప్పుడేనియుఁ బిల్లదంబులనాడఁబోవరు వీరి నే

---

* The screen to be removed covering the corpse of the Queen with a cloth.

నిప్పుడెట్టులుఁజంపఁబోవుదు నీశ్వరా ! యిదియంతయుఁగా
ముప్పుఁదెచ్చె సమానుషంపడి పోదమంచను బుద్ధియే.

భార్యయుఁ బిడ్డలును వగఁగూరి నిశ్చేతనులైయుండ

గీ. ప్రాణనాయక ! నాముద్దుబాలులార !
నేటితోఁ దీరె మీఋణం బేటికింక

హా! సఖీమణీ ! హితనయులారా ! చిరకాలమునుండి మీతోడఁగలసి మెలసి మెలంగిన ప్రేమానుబంధము నిదె నిర్దయుడను ఖడ్గధారఁ గరినహృదయుఁడనై తెగవ్రేయుచున్నాఁడ. నాకంటెఁ గ్రూరతముఁడుండునా? హాతరుణీమణీ ! పుత్రులారా !

ఇట్టిగతిమీకువచ్చునంచెప్పుడేని
స్వప్నమందైనఁ దెలియఁగఁజాలనైతి.

(అని యందఱిని దెగవ్రేయుచున్నాఁడు) తరువాత మూర్ఛిల్లి కొంతవడికిఁదెలిసి హా! మల్లమ్మాదేవీ ! ప్రతివ్రతాశిరోమణీ ! నీవేయంతశయ్యాపాలుగాఁగ మేమందఱమెందుకు ? అంత వీరబొబ్బిలికి రాణివైయుండి ప్రాణములం దావంతయైన నాసఁజేయక కత్తిపాలైతివే ! తల్లీ ! నీకేమిదురవస్థ తటస్థమైనది ? దైవమెంతయు నీయైశ్వర్యముంజూచి సైరింపలేకపోయెనే ? నిన్నటిరోజునఁ గలకలనాడు బొబ్బిలిసాలంబు నీనివేషంబున నిర్మానుష్యంబగు శ్మశానవాటికగా మార్చివేసితివే. నీకెట్టియపకారంబొనర్చితిమి దైవమా? హాప్రారబ్ధమా ! ఎంతసేసితివి ? ఛీ ! నాబ్రతుకుకాల్ప నే ! పుత్రమిత్రకళత్ర బంధు వర్గంబు, నందఱికంటె నెక్కుడుగ రాణిని నాశంబునొందించి యీజన్మమును గాపాడుకొననా ? (అని తెగవేసికొనఁబోఁగా)

నౌకరు—అయ్యా! వెంకయ్యగారూ ! రంగారావుగారు తక్షణము మిమ్ముఁ దీసికొనిరమ్మనె వేగరండు.

వెంక—అయ్యారె! అచ్చట నేమినింతలు బొంతమయ్యెనో ? పోయి రాజునకీవధప్రాకారంబు సెప్పిమఱి చచ్చెదను గాక. (అని రాజువద్దకుఁ బోవుచున్నాఁడు)

రంగా—పనిజరిగినదా ?

వెంక—(కన్నుల నీరునిండ) అయినదిరాజా !

రంగ—హా దేవీ ! హా ! తనయా !

చ. అనికరుడెంచువేళ మిమునందఱఁజూచినదెంతొగాని నేఁ
గనుఁగొననోచనైతిఁగద కన్నులనిండఁగ, నిన్ను ! హా ! ప్రియా

మణి! మురిపెంపురాణి! సుకుమార! కుమార! యిఁకేమిసేతు? నే
మనియనువాఁడ? దైవగతి, యక్కట! యెంతటిపాట్లుగల్గెనో!

బుస్సీ—యుద్ధము ప్రారంభము సేయుట కపవాదమొసంగుచున్నాఁడ:
(అని భేరీమ్రోగింపఁ జేయుచున్నాఁడు. అందఱును సంగరంబునకుఁ గడఁగుచున్నారు.

అల్లీఖాన్—సుగంధి. చాలు, చాలు, బీరమింక శాత్రవప్రతాపముల్
డీలుసేయఁజాలువాఁడ డీకొనుండుమమ్ములన్
గేలిగాదు పోరిలోనఁగెలుకొన్ననెపుణిఁ
గాలుద్రువ్వియేయుచుంటిఁ గాచికొండుప్రాణముల్.

(అని యనేకుల సైనికులంగూడి శతఘ్నికాసంతతిం బఱపుచున్నాఁడు)

రంగా—(విచారమును దిగమ్రింగి ధైర్యము తెచ్చుకొని క్రోధావేశుండై రెట్టించినశౌర్యంబు పైఁగ్రాల) ఓదుష్టులారా! చండాలులారా! మీపిరంగులరంగులు నేనెఱుంగుదు. నన్నేమియుంజేయఁజాలవురా! నాబాణములఁ గాచికొండు. (అని యంపవానఁ గురియించుచున్నాఁడు)

జంద్రాల్—హుస్సేనూ! ప్రళయకాలరుద్రునివలె యవనకాసీకసైన్యముల నొక్కపెల్లునద్రింగవచ్చు మహాశక్తివలె నీతురష్కఖరాసు వరూధినీమహారణ్యంబును గాల్ప ననేకజిహ్వలతోవచ్చు దావానలంబుకరణి నీరంగరాయండొప్పారెడి. వీనితోమనము గెల్వఁగలమా? పోరకుంటిమా హుయిదరుచేతిలోఁజావవలె. అంతకంటెనిదేమేలు. రంగరాయఁడా! ఏల ప్రాణంబులఁ గోల్పోయెదవు? మాశక్తి యెఱిఁగియుండియు నిట్టివెట్టిపాలేలయ్యెదు. ఇప్పుడైన మాతోనిశరణువేడుము. అట్లయిన మేలగు.

రంగా—వట్టిబీరముల నేలపల్కెదవురా! ఇదె నాయాశుగంబు నీశరీరంబుఁద్రెళ్ళ నేయుచున్నది. (అని వదలుచున్నాఁడు)

జంద్రా—(తప్పించుకొని) అల్లీఖానుఁడా! రాజుకోటపైనుండి బాణాసారంబుగురియ మనవరాసులు పరాసులై నేలఁగూలుచున్నారు. మనమెన్నిపిరంగులఁ బఱపినను వానినింతైన గాసిచేయవుకదా! కానిమ్ము మనమందఱము బురుజులపై నెక్కవలె. (అని యెక్కుచున్నారు)

రంగా—వారియుత్తమాంగంబులపై గురివెట్టి హురులం బఱప జంద్రాల్ నేలఁగూలుచున్నాఁడు.

హుస్సేన్—శౌరా! రాజాధమా! నికారణంబుగావించితివిగదా! ఇంకఁజూడుము నాశక్తి. నిన్నింతవఱకుఁ జులుకనగా భావించుచుంటిని. ఇప్పుడనిన్ను యమసన్నిధానంబున కంపుచున్నాఁడ.

రంగా—ఓరీ. ని న్నవమానంబు గావించినంగాని నేనేగనురా.

(అని యమ్ముల్లవాన గురియింప)

హుస్సేన్—(క్రిందఁబడుచు)

శా. ఓహో సైనికులార! కూలితిని మీరుద్వేగుక్తైపినితో
బాహాబాహినిబోరిపట్టుఁడితనిన్ బంధించి హింసింపుఁడో
హోహో హైదర! దుష్టవర్తనుఁడ నీహోదా మముఁ జంపెరా
ఛీ! హీనప్రభుఁగొల్చువారికరుదేచెట్టల్ ధరిత్రిస్థలిన్?

సైనికులు—(ఆమాటలువిని ధైర్యస్థైర్యంబు లినుమడింపఁ దెగువఁదెచ్చుకొని వేనవేలభియాలి వీరవరుల నద్గళప్రజ్ఞావిశేషంబున నొక్కుమ్మడి బురుజులపైకి నలుప్రక్కలనుండియెక్కి సంకులసమరంబుగావించి “పట్టుడు! పట్టుఁడు కొట్టుఁ” డంచు బీరంబువల్కుచు రంగారావుంబొదివిరి.

రంగా—ఓ హోతమ్ముఁడా! వెంకళాద్రియఁడా! ఎచ్చటనున్నావు. వేగరా!

(అని కేకవేయుచున్నాఁడు)

సైనికు—(ఇంతలో రంగారావును వధియించుచున్నాఁడు.)

(సేనాకలకలము. హాహాకారంబులెసంగుచున్నవి)

బుస్సీ—సైనికులారా! ఇరుదెఱఁగులవారు నీరోజు యుద్ధంబు చాలింపుఁడు సాయంత్రమైనది. (అందఱు నాగుచున్నారు.)

వెంక—(సైనికులవలన రంగరావు తెఱంగెఱింగినవాఁడై పరుగెత్తుచువచ్చి)

శా. అన్నా! పోవుచునుంటివేదివికి? నన్నా! తమ్ముఁడాయంచునీ
వన్నా! సోదరుఁబిల్చుచుంటివె? తగన్ వాక్రుచ్చి పోవంగనా?
(అని యన్నశరీరంబుజేరి సోదరుఁడు దివికేగెననికృతనిశ్చయుండై)
అన్నా! రంగనృపాలశేఖర! ధరిత్రాఖండలా! శౌర్యసం
పన్నా! మమ్ములవీడిపోయితివె! భూపా! రంగరాయాగ్రజా?

శా. అన్నా! మున్నుడో వైరులంగెలిచి వీవత్యున్నతిన్ బొబ్బిలిన్
జెన్నారంగనుగన్నులారఁగనఁజేతోముదంబందఁగా

నన్నాఁడఁ గారణరంగమందుఁబడఁగా నన్నాఁడవంచెన్న లే
దన్నా! భారవి! యస్తమించితివె? వప్రాస్త్రాద్రిపైనగ్రజా!

శా. అన్నా! సోదరవత్సలా! పురుషసింహా! ధైర్యమంథాద్రి! యో
పున్నాగా! శతభాస్కరాభ! ధరణీభూభృజ్జయా! యిస్సిరో
యన్నా! యెంతటిభాగ్యహీనుఁడను నేనన్నన్న! నానోటితో
నన్నాయంచును బిల్వనోచనయితిఁ హారంగరాయాగ్రజా!

(అన్నశరీరముపైఁ బ్రాలి)

గీ. అస్తమించెను బొబ్బిలి యస్తమించె
నవనిశూరత్వమంతయు నస్తమించె
నపురవెలమకులంబెల్ల నస్తమింప
రావు రంగావనీనుండు ప్రతిభఁదక్కి.

సోదరా! యీయటమటకాఁడు చేయఁబూనిన విప్రలంభమునకు వెఱచి యీలుపు గోల్పోవుకించ చేఁదూపిల్లి గోడాడి ప్రాణంబులఁదొఱంగిన నీప్రియామణి మాకు రాణి యగు సాధ్వియందుఁగల మోహంబు విడనాడఁజాలక యన్యాయయుద్ధంబున మెలంగుతలంపుఁజాలించి దివంబున కరిగితివే! మమ్మేమిమొనర్చిపోతివి? నీవులేని బొబ్బిలి చంద్రుఁడులేని రాత్రి. జ్వాలలేని యగ్ని. జలంబులేని కాసారంబును. గదా! నీమృత్యువుని నలుదెఱంగులఁ బోరుచున్న యోధవరులెల్లరు నిఁక నేరికై పోరవలెనని నిజకరపరికర కరవాలంబుల నసురులఁ దొఱంగుచున్నారు. వీరిని జూడుము. అయ్యో! చూడలేవా?

(అనియేడ్చుచు)

గీ. పవిత్రుఁడెన్నంగఁదాఁగర్మసాక్షియయ్యు
నాజిలో నీవు రంగరాయాగ్రజన్మ!
తెఱుగఁజూడఁగలేక నోచరమగిరికి
నరుగుచున్నాఁడు కాఁబోలు ఖరకిరణుఁడు.

(అని దుఃఖించుచున్నాఁడు)

దమ్మన్న—(చూచి) వెంగళ్రావుగారూ!

గీ. మీరె ధైర్యంబువదలినమీఁది కార్య
మెట్లు నెఱవేరుఁగష్టముల్ మించుతఱిన
ధైర్యమున్విడకుండుట చేతగవుసుమిత్ర
లవినఁగాలేదె? సాహసే లక్ష్మియనఁగ.

తమవంటి ప్రతాపశాలురే యిట్లు వెఱ్ఱిచింతపాలౌట యుచితమా ?

వెంగ—(విచారించుచు) ధర్మన్నగారూ! నిజదారాపుత్రాదులు నశించినను సోదరుండు సజీవుండైనచో నాకు విచారములేదు. అట్టియనుజన్ముండు తరుగఁగ నెంతకఠిన హృదయుండనోగాని ప్రాణముల విడువఁజాలనైతి.

ధర్మ—అయ్యా! ఇప్పట్ల ధైర్యమువదలుట పనిగాదు. మేమందఱమింకను బ్రతికి యుండ మీకు విచారమేల? ఎట్లయిన నాయశత్రువర్గంబు నొంచుట పౌరుషంబుగాని యీరీతిం ధైర్యంబువోనాడుట కూడునే ?

వెంగ—క. జగదేకవీరుఁడంచును
జగతిని బ్రఖ్యాతిఁగన్న చటులోత్తేజుం
డగు సోదరుఁడే గతియిం
పఁగ నేటికి భూమినాకు? భాగ్యమదేలా?

(అని వెండియు దుఃఖించుచున్నాఁడు

ధర్మారా—ఊరడిల్లుము రాజా! విచారించినఁ బ్రయోజనమేమి ?

వెంగ—(కొంతవడికి ధైర్యముఁదెచ్చుకొని) అవును. దుఃఖించి యన్నను దేఁగలనా? అయినదానిగుఱించి చింతించుటేల? నాశక్తికొలఁదిని బోరెదనుగాక. మీరందఱును మీమీధైర్యంబుల నినుమడించికొని యెదిరింపుఁడు. దైవవంచనకు మనమేమి సేయఁగలము?

ధర్మ—అదియ పౌరుషము. రంగరాపుగారు కాలధర్మము నొందిరిగాన గెలిచితిమని విజయరామరాజును హయిదరును విఱ్ఱవీగుచున్నారు. వారిపొగ రణంచి విఖ్యాతిఁ గాంచుఁడు.

వెంగ—అటులనా నేనున్నానని యనుకొనలేదా ?

మ. అలఁతిన్ బోఁవగనిత్తునే రిపుల? నన్యాయంబుగా నగ్రజున్
బొలియింపన్ బగఁదీర్పనే? వెఱతునే బోరంగ? భీతిల్లి బొ
బ్బిలికోటన్ విడనాడియేగెదనె? మద్వీర్యాతిరేకంబు వ
ర్తిలనాజిన్ విమతాళిఁగూల్పనిది యుర్విన్ బౌరుషంబే తగన్ ?

ధర్మ—భళి! నీదేపౌరుషము. ఆపరశురామునిదే పౌరుషము. ఉభయసైన్యములను గోటబురుజులపైని యుండుటంబట్టి బాణయుద్ధం బసంగతంబు. తూణీరకోదండ

కాండంబుల నొక్కెడ గుప్తంబుగావింతము. అగ్నియంత్రశస్త్రధారంబుగ నెదిరింతము. కాకున్న సంకులసమరంబు దప్పదు.

వెంగ—అట్లనే తోఁచుచున్నది. దమ్మన్నగారూ! కుక్కుటంబులు దిక్కులు పిక్కటిలురవంబున మొరయుచుండుట విన నిశాంతంబగునట్లు తోఁచెడిని.

ధర్మ—రాజువెడలం బుండరీకంబులు తేజోవిరాజమానంబులగుక్రియఁ బుండరీకంబులు కాండనిధులనిండె సజ్జనకార్యంబులకుఁదోడ్పాటువడుట మిత్రకృత్యంబనుకరణిఁ బ్రభాకరుండు పూర్వాశాభాగంబునఁ దేజరిల్లె. మనమిఁక జన్యంబున కుద్యమించుట కర్తవ్యంబు. (అదె బుస్సీవచ్చుచున్నాఁడు)

బుస్సీ—యోధవీరులారా! యుద్ధంబు ప్రారంభముఁజేయుఁడు.

(రణభేరీమ్రోగుచున్నది. అందఱును యుద్ధమునకుఁ గడంగుచున్నారు)

కుప్పి—ఓరీ! దమ్మనా్నీచా! హిందువా! ఇదె నాకరవాలంబు నీశిరంబుఁ దెగ్ర్వేయుచున్నది. (అని కత్తిఁ ద్రిప్పుచున్నాఁడు)

దమ్మన్న—ఓరీ! బుద్ధిహీనుఁడా!

ఉత్సాహ. బిరుదులెన్నియేనిఁబల్క బీరమే? రణంబునన్
దిరముగాఁగనిల్వు నాదుతీవ్రభిందిపాలన
త్వరముఁజూతుగాని యేలపారనీకప్రేలెదా
నిరయమొందఁజేతునిన్నునీచ! చూడుమిత్తఱిన్.

(అని గుదియఁద్రిప్పి వైచుచున్నాఁడు కుప్పి కూలుచున్నాఁడు)

కుప్లాము—ఛీ! నీచేతనేమౌనురా. పలుయుద్ధంబులలో జయంబంది మించిన నాతోనా నీవుపోరెదవు? ఇప్పుడైనను మరలిపొమ్ము.

దమ్మ—హనుమంతునిముందటనా కుప్పిగంతులన్నట్లు కుప్పిగంతులువైచి గంతుగొనె. ఎఱుఁగుదువా? నీపనియంతియ. మూర్ఖ! నీగర్వమణంచెద. (అని ముద్గరంబును వైచుచున్నాఁడు)

కుప్లా—(తప్పించుకొని పరిఘాతంబును గిరగిరంద్రిప్పి వాని యుత్తమాంగంబుపై వేయఁగా దమ్మన్న కూలుచున్నాఁడు)

వెంకయ్య—నీచా! నీపొగరిట్లున్నదిరా! (అభిగమనంబుగావించి కృపాణంబుచే వాని కంఠంబుఁ దెగనరుకుచున్నాఁడు)

లా—ఓరీ. నీపీఁచంబణంగించెద జూడుము. (అని కరవాలికం ద్రిప్పుచున్నాఁడు)

వెంక—ఓరీ ! పలుగాకీ ! ఇదెవచ్చె. కాచుకొనుము. (ఘనంబును ఘనంబుగఁద్రిప్పి వైచుచున్నాఁడు. లా కూలుచున్నాఁడు)

రాసు—నీబ్రతుకెంతరా ! దురాత్మకుఁడా ! (అభిషేణనంబుగావించి. కుఠారంబుగైకొని గురికొని యేయుచున్నాఁడు. వెంకయ్య నేలగూలుచున్నాఁడు)

ధర్మా—హా దురాత్మకుఁడా ! చండాలుఁడా ! నీపొగరడఁగించెద. నిమేషమాత్రమునిల్వుము. (శతఘ్నింబేల్చుచున్నాఁడు కొందఱుసైనికులును రాసును గతాసులగుచున్నారు.)

హసనల్లీ—ధర్మారాయనితో సంకులసమరంబుఁ గావించుచున్నాఁడు. యిద్దఱును భూమిపై నొరగుచున్నారు. పారసీకపుసేనాకలకలము. (హైదరుప్రవేశించుచున్నాఁడు)

హైదరు—ఆహా ! ఎంతపుట్టినది. నిష్కారణమనేకులు పారసీకధీరాగ్రేసరు లుసురులంబాసిరి. ఇస్సీ !

వెంగళ్రా—ఏఁడీ ! పారసీకాధముఁడు. ఏఁడిరాజు ! నానిశితకరవాలంబున వారిశిరంబుఁదెగవేసి తద్రక్తప్రవాహంబున మజ్జనంబుఁగావించి కీలాలధారల మదగ్రజునకు దానాదిక్రియలఁ గావించుచున్నాఁడ.

చామరము. ఎక్కడన్ మొరంగియుంటివేదినీదుశౌర్యమున్
దక్కలేక జూపుమింకఁ దప్పదోరి పోరుపెం
పెక్కనన్నుగెల్వనీవుబీరమున్నరాజవే
నిక్కచుంటివిప్డునీదునేటుశక్తిఁజూపరా.

హైద—ఏమిది సైనికులారా !

మాలిని. ఎంతటిభీమవిరామమదెచ్చుటనేర్పడుఁగర్ణకఠోరమునై
చింతమనంబునఁగ్రాగెడిభూమిప ! చెప్పుము వెంగళరాయఁడోకో ?
యింతకుఁగారణమీవసుమీ యిదియిట్లగునంచుఁదలంపక నే
నెంతయుబుద్ధివిహీనతఁజేసితినీకొనిపాపపుఁగృత్యమిలన్.

విజయరామరాజా ! మహాశూరులగు వారనేకులుసమసిరి. నీమాటలువిని యిట్టి యుద్ధంబునకుఁ దలపెట్టితి.

క. రా. విరాజితము. కొదుగకనీదగుమాటలనేవిని కొండెముగాఁదలపోయకయున్
బడపడివారునసేకవిధంబులఁబ్రార్థనఁజేయుచు సంధినివే

డందలఁపకెంతయుయుద్ధముఁజేయబలంబుబలంబులడంగెనుజే
వదరిగిశూరులుబోయిరికాలునివద్దకరాతిశరాతిహాతిన్.

కనుక యిప్పుడన్న వచ్చెను రోషావేశంబునఁ బ్రళయకాలరుద్రుని భంగినింగిముట్ట నార్చుచు రాజేఁడి? రాజేఁడి? యంచు వచ్చుచున్నాఁడు. నీవే యుద్ధంబునకుఁబొమ్ము జయించితివా సరే. లేకున్న నిందపాలగుదుము.

విజయ—(తనలో) తురక కఠినముగమాట్లాడుచున్నాఁడు. నాకు జన్యంబుసేయక దప్పనట్లున్నది. ఇప్పుడు వెనుకదీయుట పౌరుషముగాదు. కాని.

మత్తకోకిల. భానుఁబట్టఁగవచ్చు రాహువుభాతిఁ గానదహించు దా
వానలక్రియఁ గాలమృత్యువువన్నె వెంగళరాయఁడెం
తేని రోషవిభీషణాకృతిఁ దీవ్రమాగతి డాసెడిన్
వీనినోర్వఁగ నెట్లునాకగు వెట్టికార్యమొనర్చితిన్.

(కొంచెమనుమానించుచున్నాఁడు)

హాయి—ఏమిట్లనుమానించుచున్నావు?

పంచచామరము పౌరుషంబెరాజ నీకుఁ జారిపోవు టెంతయున్
వీరులేర్చి పైకిరాఁగ బీరమేది భీతిచేఁ
బోరిబుచ్చినన్ యశంబె పూరుషాళికాజిలోఁ
జారుకంటె హైన్యమెద్ది పాటిజేయభూస్థలిన్.

విజయ—(తనలో) ఎట్లయినంగానిమ్ము. శత్రుసముదాయంబుతో సముదాయంబొనర్తుఁగాక (ప్రకాశముగా) ఇదె చూతము ప్రతాపము.

వెంగ—(తనలో) నేనొక్కఁడ మిగిలినాఁడను. మిగిలినవారలయ్యయిచోట్లఁగలహంబొనరించి వీరులంజంపి తాముసు గతాయువులైరి. అధైర్యమువలనఁ బ్రయోజనమేమి? ఆయోధులతో నాయోధనంబొనర్చి మఱిచచ్చెదఁగాక.

(ప్రకాశముగా) వనమయూరము. హైదర! నరాధమ! మహాకలుష! దుశ్శీ
లా! దగునె? నీకిది ఫలంబనుభవింపన్
గాదనెదు మద్రిపుని కైతవపుమాటల్
భేదమును నీకు గలిగించ కెటుదప్పున్.

హాయి—ఓహో! విలయకాల దహనుని కైవడి నీవచ్చువాఁడు వెంగళరాయఁడే కాఁబోలును.

వెంగ—ఓరీ! పారసీకాధమా! క్రూరచిత్తా! నావిరోధిరాజు మాటలువిని యన్యాయంబుగ మాపై యుద్ధమునకుఁ బూనితివికదా! ఇంకెక్కడికేగెదవు. నీబ్రతుకు వంటింటఁ గుందేల్జొచ్చిన చందమయ్యె మిమ్ముల నిద్దఱి నిప్పుడే లోకాంతంబున కనుచున్నాఁడ, అచ్చటికేగి మాయన్నగారిని శరణువేడుఁడు. అట్లుగాక మీయాత్మలకు జన్మాంతరంబునందైనను సుఖంబు కలుగనేరదు. (శతఘ్నిం గాల్చుచున్నాఁడు)

విజ—అట్టి వృథాప్రలాపంబులనేల పల్కెదవు? చూడుమిదే. (అని స్వధితిం ద్రిప్పి వేయుచున్నాఁడు)

వెం—(తప్పించుకొని) ఓరీ! రాజన్యాబ్ధిబడబానలా! తుచ్ఛుఁడా! తురకకు లంచమిచ్చి మాయావరణంబు విధ్వంసనంబుగావింప నుంకించి వారిని మాపైకిఁ దెచ్చితివి గదా! నిన్ను యమాలయంబునకనిపి నీదేశము నిదె స్వాధీనము చేసికొనుచున్నాను గోడపెట్టు చెంపపెట్టు నీకగును.

విజయ—బుద్ధిహీనుఁడా! నాతో సరివత్తువురా! ఏమి యీకారు ప్రేలాపన?

వెంగ—అంబురుహావృత్తము. ఓరి! తురష్కులవేడితివా! మము నోర్వఁజాలక పోరఁగ

నీవ్వరుఁడవే! రణశూరుఁడవే! కౌరవిక్ దలందగఁగోకికో
సేరుదలంతురు దుర్మతి? నీచుఁడ! యిట్టిసేతలుచెల్లునే?
ధారుణిలో జయమొందెదవే? యిఁకఁదక్కనేర్తువె యాజిలోన్.

విజయ—ఛీ! ఓటిచేదను నీరుగారునట్లిట్లేల ప్రేలెదవురా!

తరళ. వినర! దుర్మద! నీదుగర్వపువేడబంబడఁగించెదన్
మనఁగనేర్తువె పోరినాతో మానుషాధమ! యాజిలోఁ
గనవె నీయనుజుండు నీగతిఁ గారుకూతలఁగూసి గా
జనెను బెద్దలచాయకిప్పుడు చాలుప్రేలుట దుర్మతీ!

అని ముద్గరంబు సేయ

వెంగ—దానిం ఖండించి వైచుచున్నాఁడు (తిరిగి భిండివాలపరశుపట్టైస ముసలతోమర ఛురికాస వివిధాయుధ నికాయంబులఁ బ్రయోగించుచు బాహాబాహిం గచాకచిం ఘోరమగు సంకుల సమరంబొనర్చుచున్నారు)

(బుస్సీ ప్రవేశించుచున్నాఁడు)

బుస్సీ—(ఇరుదెఱంగులవారుం బోర నారసి వెంగళ్రాయని శౌర్యంబునకు మెచ్చి నట్లభినయించుచు తనలో భళీ! వెలమకులమునకుఁ జాలినశూరుల మాయందుఁగాని

తురకల యందుఁగాని తక్కిన హిందువులయందుఁగాని నేఁగాన. ఇట్టి వీరులతో నా యుద్ధము. డబ్బుకాసించిన హైదరుమాటవింటి. తుదకేమౌనో (అని దూరమునవిల్చి చూచుచున్నాఁడు)

వెంగ—ఓరీ! పారసీకాధమా! నిలువరా నాయెదుట.

హయి—ఓరీ! నీచా! దివాణద్రోహీ! నీప్రాగరణంబెదఁజూడురా (అని తుపాకీని పేల్చుచున్నాఁడు)

(ఘోరయుద్ధము జరుగుచున్నది)

వెంగ—(తనలో) బలంబరిగె. బలంబునుం దరిగె. నేనెట్లుబోరఁగలవాఁడ. జీవచ్ఛవంబుమాత్రి నున్నవాఁడను కాయంబు గాయంబైయున్నది. సాయంతనంబు గూడబడె. పాపయ్యరాజామకోటనుంచి వచ్చినట్లు వినుచున్నాఁడ. వానితోఁగలసి రేపు సమరంబునకుఁ గడంగితినా బాగుగనుండును. సూక్ష్మసేనతోఁ బోరుటంజేసి సైనలసట వాడమెడిని వెనుక సహాయమున్నకైన నేరును లేరు. (అని పరిఘంబు ద్రిప్పి హైదరు తలపై విసరి వైవ)

హయి—తత్పరిఘాతనాహతిచే సోలి నేల మూర్ఛిలుచున్నాఁడు.

(సేనా కలకలము. బొబ్బిలివారిభేరీ మ్రోగుచున్నది. పారసీకుల హాహాకారంబులెసంగుచున్నవి. విజయరామరాజు బుస్సీ హైదరు శరీరంబుజేరుచున్నారు.)

బుస్సీ—వీరవరులారా! ఈరోజునకు యుద్ధము చాలింపుఁడు.

(అందఱు నాగుచున్నారు)

(హైదరు శరీరంబు వీక్షించి ముక్కుపైవ్రేలుంచుకొని) ఆహా!

మందాక్రాంతవృత్తము. ఔరా! హైదర్బలమెడలి నీవాజిలోఁగూలితే. నీ
వీరావేశంబెటకరిగె నీవీరుతోఁబోర నేలా?

(వెంగళ్రాయుంజూచి) ధీరా! వెంగళ్నృపతిలక! నీధీరత్నెచ్చవచ్చుం
బోరాటంబందు నినుగొనఁబోలు వారెవ్వరిందుఁ.

(విజయరామరాజుంజూచి) ఓయీ! ఇంకను బోరెదవా?

విజయ—ఖిన్నుఁడై యూరకుండె.

బుస్సీ—(హైదరు నాడిఁబరీక్షించి) నిష్ఠురహతిచేఁ బ్రాణము కడంటి మూర్ఛిల్లియున్నాఁడు సైనికులారా! మనగుడారంబునకుఁ గొనిపొండు విజనంబగుస్థలంబునకు గొంపోయినంగాని నేదదీరితెప్పిరిల్లఁడు (సైనికులుహైదరునెత్తుకొనిపోవుచున్నారు)

సేవకా! వెంగళ్రాపుగారినిటులఁ బిలువుము.

సేవ—మహాప్రసాదము స్వామీ. (అని పోయితీసికొని వచ్చుచున్నాఁడు)

వెంగ—(ప్రవేశించి) సలామ్ పరాసు కులావతంసా!

బుస్సీ—సలామ్. వెంగళ్రాయఁడా! నీశౌర్యమనివార్యము నేమెచ్చితి. కొత్తపలిసీమ నీ కిచ్చితి రాజాముతోపాటు దానినేలుకొనుము,

సేవకా! మన పాళెములోనున్న చినరంగారావు నిటుల నెత్తుకొని రమ్ము.

సేవకు—చిత్తము దేవరా! (అని పోయి వెంటఁగొని వచ్చుచున్నాఁడు)

బుస్సీ—వాని నెత్తుకొని ముద్దాడుచు వెంగళ్రాయఁడా! ఈపిల్లవాని నెఱుఁగుదువా? నీయన్నకొడుకగు చినరంగారావు సుమీ! దాది వీని నెత్తుకొని సామర్లకోటకుఁ దీసికొనిపోవుచుండ నీబాలుని ముఖంబాచంద్రబింబమును హసించుచు నెంతయు ముద్దులొలుక నాకు వీనియందుఁ బుత్రవాత్సల్యత మీఱి యిసుంతయు హానిజనించకుండునట్లుగాపాడుచు నాడేరాయందుంచినాఁడ. ఈముద్దులకుఱ్ఱఁడు తండ్రికంటె నెక్కుడు ధైర్యశాలి. త్రయీవర్షవయస్కుఁడయ్యును గుడారంబునంగల బహువిచిత్ర వివిధగాండారాది వస్తునంతాన సంకుల భాండారంబున నీ బాలువిడువ. నొక్కశాతాసిఁ జేఁబూనియాచిత్తరువుం బొమ్మల సీరులఁగాఁ దలపోసి నరుకఁజొచ్చె ఈబాలుండపరిమిత శౌర్యశాలియగు. సత్వరము వీనిందీసికొనుము. (అని వెంగళ్రావునకిచ్చుచున్నాఁడు)

వెంగ—(వాని నెత్తుకొని ముఖము నిమురుచు నన్నుందలంచుకొని దుఃఖించుచున్నాఁడు.)

బుస్సీ—ఊరడిల్లుము. విచారించిన నేమిప్రయోజనముగలదు?

వెంగ—(బాలుంజూచి)

ఉ. బాలక! చిన్నికుఱ్ఱ! పసివాఁడ! కటా! చినరంగరాయ! నీ
పాలిటికేగుదెంచెనొకొ పాపపుయుద్ధము నిన్నుఁజూడఁగాఁ
దాలిమిఁదూలుచుండెఁ దలిదండ్రులులేని యనాథఁజేయనే
ఖిలను జాలిదైవమెడలించెనొ నీయెడ ముద్దుకుఱ్ఱఁడా!

(అని యనేక విధంబుల వనరుచున్నాఁడు.)

బుస్సీ—రాజా! ఊరడిల్లుము. మీవంటితెలిసినవారిట్లు చింతపాలుకాఁగూడదు. సమస్తము దైవాధీనము గదా!

వెంగ—అత్యంతప్రేమాస్పదుండగు సోదరవియోగంబెట్లు సహించువాఁడ. జననీజనకరహితుండగు నీముద్దులపట్టి మోమునవలోకించి యెట్లీదుఃఖము భరించువాఁడ.

(విజయరామరాజేమో విచారించుచున్నట్లభినయించుచు సమీపస్థలంబున నిటునటు దిరుగుచున్నాఁడు.)

బుస్సీ—ఏమి సేయఁగలము ? నిన్నుఁజూడ నాకును జాలికలుగుచున్నది. ఈరాజుమాటలువిని హైదర్జంగుపొరబడి మీకిట్టి యపకారమొనర్చె. వారిసలహావిని నేనును వారితోఁగలసితిని. కుక్కతోకఁబట్టి గోదావరి యీదినట్లాయెనాచరిత్ర. నీవిఁకేల దుఃఖించెదవు. అయినదానికై వగచుట గతజలసేతుబంధనము. నీవైన నిఁక సుఖంబుండుము.

(అందఱు నిష్క్రమించుచున్నారు)

రంగము :— బొబ్బిలికోట.

(వెంగళ్రావు గుడారములో గాయములచే బాధపడుచు మాన్పుకొనుచుండఁగా తాండ్రపాపయ్య ప్రవేశించుచున్నాఁడు)

పాప—వెంగళ్రావుగారూ ! (దుఃఖముతో) ఎటులనున్నారు ?

వెంగ—ఇట్లున్నాను. (అని దేహముంజూపుచున్నాఁడు) (దీనస్వరముతో) ఈకోటకుమాకు నిట్టియవస్థ తటస్థమైనది. (యేడ్చుచు) ఇప్పటికి యుద్ధముమాని మూఁడురోజులైనది. ఇరువాగులవారమును గాయముల మాన్పుకొనుచున్నాము. నాబ్రతుకనిశ్చయముగనున్నది. విజయరామరాజు బుస్సీలు సుఖంబుగనేయున్నారు. అన్నకగ్నిసంస్కారాదికంబులనైనఁ జేయశక్తిలేదు. ఇట్లు పడియున్నవాఁడ. ఏమిచెప్పఁగలను ? ఇప్పటి మనలోనేనొక్కఁడ సజీవుండనైయుంటి. ఇఁక నీపిల్లవాని గతియేమౌనో ?

పాప—రంగారావుం దలఁచుకొని)

శా. రంగారాయనృపాల ! ధైర్యగుణధుర్యా ! శౌర్యగాంభీర్యసం
సంగా ! రాజకులీనరత్నమ ! రణోత్సాహా ! ధనుశ్చాతురీ
గంగానందన ! యన్న ! బొబ్బిలిపురక్ష్మానాథ ! పోరంగటా
భంగంబొందితె ! శత్రువౌ విజయుచే ! ఁబాటిల్లెఁగా మృత్యువుల్.

రంగరాయా ! ఇంకను శాత్రవజయంబుతోఁ బ్రజ్వరాజ్యలక్ష్మింగైకొని యఖండవైభవము ననుభవించెదవనుకొంటింగాని యవియన్నియుం గలలోనివార్తలయ్యెంగదా ! హా ! దైవమాయ ! అమ్మా ! మల్లమ్మాదేవీ ! నీవును భర్తగారికిఁ ద్రోవఁజూపితే ! అప్పా. నీకెంతదశగల్గినది. ఎంతపనిజరిగినది.

శా. అమ్మా ! మల్లమదేవి ! సాధ్విమణి ! మాయప్పా ! సుశీలాత్మనీ
కిమ్మాడ్కిన్ గడుదైన్యముబ్బునని నేనింతైననెంచంగలే
దమ్మా ! నీవగుధర్మవర్తనము గాయంలేదెసుంతైన ? జీ
వమ్ముల్ సాంఘిక మృత్యువెక్కరణి సంప్రాప్తించెనీకియ్యెడన్.

(కోట నల్దిక్కులం గలయంజూచుచు) ఆహా ! స్త్రీబాలవృద్ధ సంకులంబైయుండు నీ కోటకెంతపాటువాటిల్లె అహో ! దివసపంచకంబు వెనుకఁ గలకలనాదుచుండెడి బొబ్బిలికోట నేటికి భూతప్రేత పిశాచంబుల కిలకిలధ్వని సంకులంబై పరేతవాటికయయ్యె.

చ. వెలవెలబారె గేహములు వెల్మకొలంబుల జాడలేదిదే
వెలపలలోపలం గనిన భీతిజనించెడిఁ గోటకాళికా
నిలయమువోలె శాకినులనిండి మనంబున వేదనంబు వ్యా
కులమొనరించుచుండె నిదిగో పలలాఢ్యమయాస్రధారలన్.

హా ! రంగారాయక్షితీంద్రా !

గీ. నన్ను రాజాముకోటకు మున్నెయేల
తాపుగాఁబంపినాఁడ వక్కాలమందు
నేనెయుంటినా శత్రులనెగడకుండఁ
జేయనే రంగరాయ చేసేతవచ్చె.

అనేకవాదనలఁజేసి యనేకవిధంబుల నేడ్చినను బెడచెవింబెట్టి పట్టిపంపితివిగదా ! ఎంత వెఱ్ఱిపనిఁజేసితివి. నీయాజ్ఞోల్లంఘనంబునకు వెఱచి పోవకదప్పదయ్యె తిరిగివచ్చునంతకైనను సజీవులై యుంటిరిగారుగదా !

ఉ. పున్నెపులోకముల్ మిగులఁబొందఁగమీకిదె చేయుచుంటినా
కన్నులనీరునించి కడఁకన్ జలతర్పణమివ్విధంబునం
జన్నదివచ్చునేయిఁకనుసాహసముం గనిశత్రురక్తసం
పన్నతమీకుఁదృప్తి పఱుపన్దలపోయుచునుంటినియ్యెడన్.

(వెనుకకువచ్చి వెంగళ్రాయునిజూచి) (దుఃఖముతో తనలో) ఈతనితో ముచ్చటించిననేమగు. తననుదానెఱుంగఁడు. గాయంబులచే స్మృతిదప్పియున్నాఁడు. దైవమీతనినైన రక్షించుఁగాత. ఈ బాలునికిఁ జిరాయుష్యమగుగాక. విచారించిన నేమిప్రయోజనము. ఇప్పుడైన నేమిబోయె. పారసీకపరాసులతోడ విజయరామరాజుం గతాసునింజేసి బొబ్బిలిపౌరుషంబు నిలువంబెట్టెదను.

శా. చండారాతిహయప్రకాండముల నేఁజక్కాడెదంగుంభినుల్
దండంబుల్దెగి ఖండఖండములుగాఁదూటాడెదంబంట్లను
ద్దండప్రక్రియఁజెండివైచెదను దోర్దండ ప్రతాపంబునన్
గండల్గాండలుగాఁగస్యందనములన్ ఖండింతునొక్కుమ్మడిన్.

కానిమ్ము (తనలో) రామచంద్రుండంతటివాఁడు వాలింబొంచి పొరిగొనలేదా? అర్జునుండు మరుగుపెట్టి గంగాసూనుం డెగనేయలేదా? కుంభజు హరణార్థమై ధర్మరాజు బొంకియుండలేదా? వారికెట్టియపవాదమువచ్చెనో నాకు నదేరాఁగలదు, గూఢగతినరిగి యిట్టి దురాత్ములఁజంపినంగాని వేఱొండు విధంబున నా కోపానలంబు చల్లారనేరదు. ఇట్లుగాక నీతులువలం జంపు మార్గంబులేదు. ధర్మమేగానిమ్మధర్మమేగానిమ్ము! ధర్మాత్ములు సుగుణనిధులుత్తమోత్తములగు రంగారాయమల్లమ్మా దేవులంజంపించిన యీపాతకియగు రాజుంభూమింబ్రతుకనిచ్చితినా ధారుణికప్రియమొనరించినవాఁడనగుదును. (ప్రకాశముగా) సేవకా! నీవేగి విజయరామరాజున్న స్థలముం గలయంగనుంగొని రమ్ము.

సేవ—చిత్తము (అని వాఁడేగి తిరిగివచ్చి) మహాప్రభూ! నాకుఁబో వీలుగాదయ్యె. ఏమిసేయను?

పాపయ్య—పోనిమ్ము. నేనేపోయెదంగాక. (తనలో) నేను మాఱువేషము వైచికొని వారిగుర్తుమాటలు వచించుచుఁ గాదారిపొద్దునలేచిపోయి గుడారంబుజేరెదను గాక. (అని యట్లొనరించుచున్నాఁడు)

(అందఱు నిష్క్రమించుచున్నారు)

రంగము :—విజయరామరాజుగుడారము.

పాప—(రాజునిద్రించుచుండఁగా గుడారంబుగుడ్డను గరవాలంబునఁ జించివైచి లోపలంబ్రవేశించి) పులి పులి! (అని కేకవేయఁగా)

విజయ—లేచి (తనలో) పులిపులి యని వినవచ్చుచున్నది. ఈపులి తాండ్రపాపయ్యగాని వేఱుగాదు. (కన్నులందుడిచికొనిలేచి పాపయ్యంగని మిగుల లావైనవాఁడు గాన దిగ్గున లేవలేక) (ప్రకాశముగా) ఎవఁడవురా! (అని చెంతనున్నకత్తిం దీసికొనఁబోవుచుండఁగా)

పాప—గీ. తాండ్రపాపయ్య యనువాఁడఁ దగినయట్లు
నీవు చేసిన దుర్మార్గ నీచకృత్య

మనుజపశుప్రాయక పోహసి మొనను విశద
పడఁగఫలమియ్యవచ్చిన వాఁడఁజుమ్మి.

(అని హారాత్తుగఁ జేయినరుకుచున్నాఁడు. పెరహస్తంబున దీసికొనఁబోఁగా దా నింగూడ నరకుచు) ఏమిరా! పాపిష్ఠి! చండాలుఁడా! నీక్రూరకర్మము నిన్నుఁగట్టికుడిపినదిరా. బొబ్బిలినేలెదవా? (అని కాలు నరుకుచున్నాఁడు) రంగారాయుం జంపితినని సంతసించుచున్నావా? (అని యూరువులనరుకుచున్నాఁడు. ఇట్లు ముప్పది మూఁడుచోట్ల నరికి చిత్రవధగావించుచున్నాఁడు)

(సైనికులు ప్రవేశించుచున్నారు) ఘోరమగు కలకలము.

సైనికు—(పాపయ్యంజూచి) ఎవ్వఁడవురా! దుర్మార్గా! దొంగా! (అనియొక్క పెట్టునఁ జుట్టిముట్టు హైదరును మూర్ఛఁదెలిసియున్న వాఁడేగాన ప్రవేశించుచున్నాఁడు)

హైదరు—ఓరీ! క్రూరాత్మా! నీచుఁడా! దొంగా! చూడు నిన్నేమిచేసెదనో! రాత్రివచ్చి యిట్లు చేసితివిగా! నిన్నిప్పుడ పొరిగొనెదఁజూడు.

(అని భీమాట్టహాసము చేయుచున్నాఁడు.)

పాప—(తనలో) నేను బగదీర్పఁబూని చేయవలసినదానిం జేసితి. వీరంతకంతకురోషంబుమీఱఁ బైపైకి వచ్చుచున్నారు. రంగారావును జంపినరీతినే నన్నుంజంపుదురు.

ఉ. నీచపురాసుసేనలకు నేనిటులోఁబడిచచ్చుకంటె బా
హాబలితాసిధారను బరాసుఁడనై దివికేగ మేలుగా
దే చిరకీర్తి పౌరుషములెంతయు నిల్చును భూమిలోన నా
ర్యాచరణంబొనర్చెనని? అట్లొనరుచ్చుట మంచిదెంచఁగన్. (ప్రకాశముగా)

ఓరీ నీచులారా! మీచేఁజచ్చెదనురా? నాకిష్ట తృప్తియైనదిరా! (తనలో) రంగారాయమహాప్రభువులేని బొబ్బిలికోట తిరిగిచూచుటకంటె దేహంబు బాయుటయే మేలు (అని రోషావేశంబునఁ గరవాలంబుఁ ద్రిప్పుచు శత్రువులపైఁబడి సైనికానీకాయంబుతో హైదరుం గాలుప్రోలికనిచి తానును బొడుచుకొని మేన బొఱంగుచున్నాఁడు)

(సైనికుల హాహాకారంబులెసంగ బుస్సీ ప్రవేశించుచున్నాఁడు)

బుస్సీ—(ఆశ్చర్యముతో ముక్కుపై వేలుంచుకొని తనలో) ఆహా! ఎంతపనిచేసె పాపయ్య! వీడే యుద్ధసమయంబున నున్న మమ్ముందఱి నప్పుడ చంపియైచును. క్రూర

ర్మము పాపిష్ఠులం గొట్టుకొనిపోయె. న్యాయాన్యాయంబుల దైవమె యుంగఁడా? పరులకపకారమెంచువాఁడు తనకుఁ దానే నశించును. (వెంగళ్రాపు గుడారంబునకుఁ బోవుచున్నాఁడు)

(అందఱు నిష్క్రమించుచున్నారు)

రంగము :—వెంగళ్రాపు గుడారము.

(మంత్రిమొదలగువారు బలిసియుండ బుస్సీ ప్రవేశించుచున్నాఁడు)

వెంగ—లేచి. సలామ్. బుస్సీగారూ!

బుస్సీ—సలామ్. ఆరోగ్యుఁడవైతివే?

వెంగ—స్వామీ. నెమ్మదిగానుంటిని. గాయంబులుమానె. మీకటాక్షంబునఁ బ్రాణంబులుమాత్రము నిలిచె.

బుస్సీ—ఇఁక వగఁజెందకుము. దైవంబు న్యాయంబుచేకూర్చె. నిష్కారణము మిమ్ముల బాధపెట్టిన హైదరుజంగును రాజును జచ్చిరి. పాపయ్యయుఁ బ్రాణంబులఁ దొరంగె. బొబ్బిలిని నీవేయేలుకొనుము. సుఖంబుండుము. నామాటయే కొలు. అయినదానిఁగురించి విచారింపకుము. శూరులగువారికే యిట్టి కష్టంబులు సంప్రాప్తమగుఁగాని పెరవారలకు యుద్ధములేల? చావులెక్కడివి? నీకు క్షేమమగుఁగాక. పట్టాభిషిక్తుండవుగము్రు. నేనుబోయివచ్చెద.

వెంగ—మహాప్రసాదము. స్వామి! (బుస్సీ నిష్క్రమించుచున్నాఁడు)

మంత్రి—(సమస్తమంగళద్రవ్యంబులాయత్తపఱచి పురంబు శృంగారంబుగావించి నృత్తగీతవాద్యంబులెసంగ సభాస్థానంబున సింహాసనంబుదెప్పించి వైచి యందు వెంగళ్రాయునునిచి మహోత్సవము జరిగించుచు) వెంగళ్రాయాగ్రణీ! ఈయఖండ భూమండలంబునకు రాజవుగమ్ము. మమ్ము చరితార్థులుగఁజేయుము. ఇదియ పురజనుల కోరిక. అట్లనుగ్రహింపుఁడు. స్వామీ!

వెంగ—(దీనత్వము ముఖమునందుఁదోప) అట్లనేకావింపుఁడు. (అని యన్నందలఁచుకొని.)

శా. అన్నా మొన్నటిదాఁక నీవునిజబాహాటోపమేపారసం
పన్నప్రక్రియరాజ్యమున్నలిపియేసాపంబొనీవిప్పుడా
పన్నత్వంబునుబొందిపోయితివినాపాట్లెసియీభూమినీ
కన్నంబోదునుముందెయీవిధమునాకావంతయుకొదెల్పినన్.

మంత్రి—ఊరడిల్లుము రాజా! శుభసమయంబున విచారించుట కూడదు. "దైవాధీనం జగత్సర్వ" మను వాక్యములఁ దెలియవే? ఈకాలంబున కీర్తిగ జరుగవలసినదని బ్రహ్మ వ్రాసియుండఁగా నన్యథాయెట్లు జరుగనేర్చు? వీరుచంపిరి వారుచంపిరి యనుకొనుట యెంతయు వెఱ్ఱితనము. సమస్తచరాచరంబులకుఁ గార్యంబులకుఁ బరమేశ్వరుఁడే మూలకారణముగాని వేఱుకాదు. నేనొనరించితిననువాఁడు పిచ్చివాఁడు. భూమిపై నెందఱిని జూచియుండలేదు. ఎందఱు రణనిహతులుకాలేదు. రామాదులగు మహారాజులును హరిశ్చంద్రాది చక్రవర్తులును భూమిపైనుట్టిగట్టుకొని యూచుచున్నారే! వారికీర్తిమాత్ర మాచంద్రతారార్కము జగద్వ్యాప్తమై తుఱంగలించున్నది. అట్లనేమికీర్తియును భూమియెందాక నుండునంతకాల ముండకపోదు. మనంబున సంతసంబుమ్మళ్లడింప యుత్సాహంబుమీఱియుండుటే మీవంటిఘనుల కుత్తమమగు తెఱంగు. ప్రపంచమునజరుగు కార్యంబుల సాక్షిభూతులమై చూచుచుండుటయే మనసని. "కాతేకాంతా కస్తేపుత్ర స్సంసారోయమతీవవిచిత్రః కస్యత్వం కఃకుతఆయాతస్తత్వంచింతయ యదిదంభ్రాతః" అనునట్లు వీరందఱుదైవమను నాటకునిచే నాడించు జంత్రపుబొమ్మలుగాఁదెలియఁదగు. తనువులశాశ్వతములుగదా! "కిందాకు మిదాకువాసగాదే" వారికై వగవనేల? సమస్తధర్మంబులు మీకుగోచరములే.

(పట్టాభిషేకమహోత్సవముజరుగుచున్నదిమంగళాక్షతల వెంగళ్రావుపైఁజల్లుచున్నారు.)

వెంగ.—మంత్రిపుంగవా! నీచెప్పిననీతి నామనంబునంగల చింతంగొంత ద్రోచివైచినది. నీవంటిధీసచివుండు గలుగఁగ నెట్టికొఱంతయులేదు. నేనొక్కదానిం జెప్పెదవినుము. ఈవీరబొబ్బిలి మాయన్నగారగు రంగారావుగారిదిగదా! తన్నుగాఁజూచుకొమ్మని యిచ్చినరంగారావును నావశముఁజేసిపోయినాఁడు. ఈరాజ్యమునందిప్పిల్లవాని నభిషిక్తునింజేసినంగాని నాదుఃఖముచల్లారనేరదు. కాన నీకుఱ్ఱని యువరాజ్యంబునకుఁ బట్టాభిషిక్తునిగఁజేసెదను. వానికి యుక్తవయస్సువచ్చునందాక నేనే రాజ్యముచేసి యాపైసిథరాభారంబు వానికిచ్చివైతు. అట్టియన్నగారికేలేని రాజ్యము నాకేల! సచివాగ్రణీ! సమస్తమంగళద్రవ్యంబులఁ దెప్పింపుము.

మంత్రి.—సర్వముసిద్ధముగనున్నవి రాజా!

వెంగళరంగారావు పట్టాభిషేక మహోత్సవము.

వెంగ.—చెంతనున్న చినరంగారావును సింహాసనంబునందునిచి సభికులారా! మంత్రులారా! మిత్రులారా! మాయన్నకుమారుండగు నీబాలుండు వెంగళరంగారాయ

ధేయంబున నాయురారోగ్యైశ్వర్యాభివృద్ధులనలరారుఁగాత. (బాలునివంకఁజూచి.)

ఉ. భూతలమెల్ల నేలుముసమున్నతితో, జగదేకవీరవి
ఖ్యాతినిఁగాంచు రాపుకులమంతయు రాజిల, దీర్ఘజీవితం
బాతకుమారనీకిల, మహావిభవంబుదనర్చుఁగాత ని
ర్భీతినరాతిభూపతులపేర్మినడంతువుగాత, నిమ్ముగలన్.

భూసురాశీర్వాదంబులు సెలంగుచున్నవి. దేవతలుపుష్పవృష్టిఁ గురియించుచున్నారు. సమస్తజనులు సంతసించుచున్నారు. (అందఱు నిష్క్రమించుచున్నారు.)

భరతవాక్యము.

మంగళమహాశ్రీవృత్తము. ఏలుదురుగాపుత మహీంద్రులుజగంబులసమిద్ధతరధర్మగతితోడ
న్మేలొదవుఁగాత ధరణీసురల కాపులకు మేదినికి మేదురసుఖంబొఁ
గాలమునవర్షమిడుఁగాపుత పురందరుఁడు కాన్పపినసస్యము లెసంగన్
జాలివిడనాడుచుశుభంబుగను దేశములు ప్రాణులకు నాయువులు హెచ్చన్.

సీ. నిధినవగజచంద్రనిగదితహాయనశకంబునకున్ సరిగన్నయవ్వి
కారిసంవత్సరకలితవైశాఖ మాసంబునశుక్లపక్షంబునందుఁ
బంచమీభాస్కరవాసరంబున దీనిరచియించినాఁడనేఁబ్రతిభమీఱ
దీనిబొంటాడపురీనివాసుండైన భోగేశ్వరునికృపఁజూస్కితోడ

గీ. నిందుభారంబునాదైవమందెయుంచి
యఖిలకృతులకలంకృతియగుచునకల
సుకవిజనులచేనీకృతిసొంపుఁగాంచి
ధరణిమెఱయుతనాచంద్రతారకముగ.

గద్య. ఇది శ్రీమద్బొంటాడపురీనివాస భోగేశ్వరేశ్వరశాశ్వత కటాక్ష
నిరీక్షణప్రసాదిత మృదులకవితాధురంధర, భారద్వాజస గోత్రపవి
త్రాపస్తంబసూత్ర కాళ్ళకూరి కులకలశార్ణవ రాకా కైరవ
మిత్ర భోగమాంబాచ్చయామాత్య దంపతీపుత్ర భా
గాట్యవికుమారాగ్రేసర, సాంబశివరాయ
కవివర, ప్రణీతంబైనరంగారాయకద
నసమువాకారంబు సర్వము
సమగ్రము.

కాకినాడ:—సుజనరంజనీ ముద్రాక్షరశాల 189[illegible]

శుద్ధపత్రిక.

పంక్తి.	తప్పు.	ఒప్పు.
19	పుత్రా	మిత్రా
20	యొక్క	నొక్క
11	నయ్య	నయ్యె
19	నరుఁడు	నృపుఁడ
22	పంక్తి	పంక్తి
3	వారిత్తరి	వారిత్తఱి
17	మగుసె	మగునే
19	నోర్వ	నోర్చు
20	సుర	సురు
27	అనేకప	అనేక
3	నాతిశుమా	నాంచద్యశః
10	స్వాగతంపు	స్వాగతము
26	పలు	బలు
15	డాంథ	డాండ
8	లంబోని	లైన
5	జాట	ఁబూట
11	వకీలన్నసనిముష	వకీలవనంగనిమిష
28	చెప్ప	ఁజెప్ప
11	దోర్బలాంథ	దోర్బలాంక
12	మసఁగుటపోఱక	మసగుటపోరక
7	గుమ్మమెచుర	గుమ్మము నెదుర
11	ముత్తిల్లి	మత్తిల్లి
6	కారుని	కారిని
13	వారు. నజేయులు	వాఁడు. నజేయుఁడు
7	నరపతులను	వారిం
9	భయం	రయం
20	మిక్కిలి	మొక్కలి
23	నేర్పరింపు	మెర్పరింపు
9	తురష్కుఁడు	తురుష్కుఁడు
11	నీరద	నీఱవు
11	వ్యదీకము	వ్యళీకము
16	చెప్పము. మఱియు	చెప్పుఁడు మఱియుదమ్మన్న!

47	7	వారు	వీరు
48	3	పెంకి	పెంకె
51	14	బాయనివి	బాయనవి
,,	51	చాలదూ	చాలదా
54	15	రాజునిం	రాజుం
60	8	ప్రివిమల	ప్రవృత
,,	26	కోహటించుట	కావటించుట
61	2	సందేశమెను	సందేశమును
,,	7	యమియించి	నొంచితి
,,	11	పన్నాగము	పన్నకము
62	25	దురటిల్లు	దూకొను
63	13	జంఝు	ఝంఝు
65	16	మత్కారాసి	దత్కారంబు
,,	28	కోహా	కావ
67	21	భీమ	భీరు
68	27	నిజమరి	నిజనుటి
70	20	బీజ	వంశ
,,	21-24	బ్రాహ్మణ......శ్రేణికిన్	నీతలంపట్టులన్
72	9	యిది	యది
82	2	రాణిసై	రాణి
,,	18	తక్కిని	తక్కిన
83	4	నాయక. బాలులార	నాయిక. బాలురార
,,	12	ప్రతివ్రత	పతివ్రత
,,	22	పొంత	బొంతన
84	13	జాలపురా	జాలపు
,,	17	వీనితో	వీని
85	17	వధియించుచున్నాడు	వధియించుచున్నారు
86	22	లేకనో	లేకనే
88	24	పరిఘాతంబు. యుత్తమాగంబు	పరిఘాతనంబు. యుత్తమాంగంబు
90	16	బుబ్బినం	జచ్చినం
,,	26	ఖేదమునునీకుగిలిగించ	ఖేదమునునీకుంగలిగించ
92	23	గొన	గెలువం
94	19	మనలో	మాలో
95	17	వాదనలఁజేసి	వాదములఁజేసిన
98	21	చరితాగులు	